www.velthuru.com
RNI TEL TEL/ 2019 / 78609
మంగళవారం
VELTHURU TELUGU DAILY

# వెలుతురు

రంగారెడ్డి। 17, డిసెంబర్ 2024
తెలుగు దిన పత్రిక
సంపుటి: 6 సంచిక: 199, పేజీలు: 12, వెల: రూ.5/-



## రాష్ట్రంలో బీసీ భవనాల నిర్మాణం: మంత్రి పొన్నం ప్రభాకర్

(రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, డిసెంబర్ 16:** జిల్లాలలో బీసీ భవనాల నిర్మాణంపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు శాసనమండలిలో సమాధానం ఇచ్చిన బీసీ సంక్షేమ శాఖ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కుల భావనల విషయంలో గతం ప్రభుత్వం ఆర్భాటం చేసిందన్నారు.

ఆత్మ గౌరవ భవనాలకు గత ప్రభుత్వం 95 కోట్లు కేటాయించి 10 కోట్లు ఖర్చు చేసిందన్నారు.

42 ఆత్మ గౌరవ భవనాలకు భూములు కేటాయించి మౌలిక సదుపాయాలను గత ప్రభుత్వం మరించిందని మంత్రి ప్రభాకర్ తెలిపారు,బలహీన వర్గాలకు గత ప్రభుత్వం బడ్జెట్ లో 8 వేల కోట్లు కేటాయించి 2 వేల కోట్లు మంజూరు చేసి 800 కోట్ల ఖర్చు చేశారు జిల్లాల కేంద్రాలలో భావనాల నిర్మాణంలో ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. మిగతా..2లో

# 21 వరకు అసెంబ్లీ..


* బీఏసీ లేకుండానే 2 బిల్లులు
* ఎన్ని రోజులు సభ నడుపుతారో స్పష్టతలేదు
* సభ కనీసం 15 రోజులు నడపాలి
* అసెంబ్లీలో ప్రభుత్వ ఆంక్షలపై హారీశ్‌రావు మండిపాటు
* శాసనసభలో విపక్ష సభ్యుల నినాదాలు
* ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్లకార్డుల ప్రదర్శన
* సభా మర్యాదలు దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారు
* ఆవేదన వ్యక్తం చేసిన శాసనసభ స్పీకర్
* సభా సంప్రదాయాలను విపక్షసభ్యులు పట్టించుకోవట్లేదు
* బీఆర్‌ఎస్ తీరును ఖండించిన మంత్రులు
* ఎలాంటి నిర్ణయాలు లేకుండానే ముగిసిన బీఏసీ సమావేశం
* బీఏసీలో శాసనసభ స్పీకర్ నిర్ణయం
* బీఏసీ సమావేశం నుంచి బీఆర్‌ఎస్, ఎంఐఎం వాకౌట్



**హైదరాబాద్,డిసెంబర్16(వెలుతురు):** హరీశ్ రావు ప్రభుత్వ తీరును తప్పుపట్టారు. బీఏసీ లేకుండానే 2 బిల్లులు ప్రవేశపెట్టి, చర్చ పెట్టడం సంప్రదాయ విరుద్ధమని, కనీసం బీఏసీ మీటింగ్‌లో ఎన్ని రోజులు సభ నడుపుతారో కూడా స్పష్టంగా చెప్పడం లేదన్నారు. సభ కనీసం 15 రోజులు నడపాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం మాత్రం 3, 4 రోజులు సభ నడుపుతామని చెబుతోందని ఇలా అయితే ప్రజా సమస్యలపై చర్చ ఎలా సాధ్యమని ప్రశ్నించారు. అసెంబ్లీలో ప్రభుత్వ ఆంక్షలపై కూడా హరీశ్ రావు మండి పడ్డారు. తొలిరోజు టీ షర్టులతో వస్తే ఎందుకు ఆపారని మీటింగ్‌లో నిలదీశామని హరీశ్‌రావు తెలిపారు. టీషర్టుతో పార్లమెంటుకు రాహుల్ వెళ్లట్లేదా అని ప్రశ్నించారు. లగచర్ల రైతులకు బేడీలపై చర్చించాలంటే స్పందించట్లేదన్నారు. సభలో పర్యాటకం కంటే లగచర్ల రైతులపై చర్చే ముఖ్యమని చెప్పామన్నారు. ప్రతి రోజూ జీరో అవర్ ఉండాలని కోరినట్లు హరీశ్‌రావు తెలిపారు.అయితే ఈ ఆరోపణలను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఖండించారు. అసెంబ్లీ నిబంధనల మేరకే బీఏసీ జరిగిందని స్పష్టం చేశారు. బీఏసీలో బీఆర్ఎస్ వ్యవహారించిన తీరు సరిగ్గాలేదని అభ్యంతరం వ్యక్తం చేశారు. అసెంబ్లీ లాబీలో ఆయన మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. అసెంబ్లీ ఎన్ని రోజులు నడుపాలన్నది స్పీకర్ నిర్ణయిస్తారని, ఈ విషయం పదేళ్లు పాలించిన వారికి ఇది తెలియదా అంటూ ఎద్దేవా చేశారు. మాజీ మంత్రి హరీష్‌రావు చెప్పినట్లు సభ పనిదినాలు ఉండాలంటే ఎలా అని ప్రశ్నించారు. తాను ఎల్‌వోపీగా ఉన్నప్పుడు గత ప్రభుత్వం ఇలాగే చేసిందన్న విషయం తనకు తెలియదా అన్నారు. ఇప్పుడు కూడా సభ ఎన్ని రోజులు జరపాలో స్పీకరే నిర్ణయిస్తారని తేల్చి చెప్పారు.శాసనసభలో విపక్ష సభ్యుల నినాదాల మధ్య సభ రేపటికి వాయిదా పడింది. సభా మర్యాదలు దెబ్బతీసేలా సభ్యులు వ్యవహరిస్తున్నారని స్పీకర్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం మధ్యాహ్నం అసెంబ్లీలోని స్పీకర్ ఛాంబర్‌లో బీఏసీ సమావేశమైంది. అయితే బీఏసీ సమావేశం నుంచి బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు వాకౌట్ చేశారు. సభా పని దినాలు, సబ్జెక్ట్‌పై క్లారిటీ ఇవ్వనందుకు వాకౌట్ చేసిన బీఆర్ఎస్ ప్రకటించింది. మరోవైపు టీ షర్ట్సపై బీఏసీలో వాడి వేడి చర్చ జరిగింది. టీ షర్ట్స్ వేసుకుని వస్తే మిగతా..2లో

## రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రిపై సభా హక్కుల ఉల్లంఘన నోటీస్ ఇచ్చిన బీఆర్‌ఎస్

**వెలుతురు, హైదరాబాద్, డిసెంబర్ 16:** తెలంగాణా రాష్ట్రం లో అప్పులపై కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వక అబద్ధాలను నిరసిస్తూ రాష్ట్ర ఆర్థికమంత్రి పై సభా హక్కుల ఉల్లంఘన నోటీసు ఇచ్చిన బిఆర్ఎస్ శాసన సభాపక్షం, దీంతో రాష్ట్రంలో రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది.కాగా ఈ వ్యవహారం ఎటు దారితీస్తుందో వేచి చూడాలి.





## లగచర్ల రైతన్నలకు బేడీలా ..!
## ఆంటూ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల నిరసన

* అసెంబ్లీలోకి వెళ్లేందుకు ప్రయత్నం చేసిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే
* అడ్డుకున్న పోలీసులు
* ప్రభుత్వ తీరుపై విమర్శలు

(రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, డిసెంబర్ 16:** లగచర్ల రైతన్నలకు బేడీలు వేసిన ప్రభుత్వ వైఖరికి నిరసనగా సోమవారం నాడు రాష్ట్ర అసెంబ్లీ ప్రధాన గేటు ఎదుట ప్లకార్డులతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల నినాదాలు చేస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రైతులకు బేడీల సిగ్గు సిగ్గు అంటూ ప్లకార్డులతో నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను, శాసనసభలోకి రానివ్వకుండా అడ్డుకున్న పోలీసులు అడ్డుకున్నారు, దీంతో పోలీసులకు బిఆర్ ఎస్ ఎ మ్మెల్యే లకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది, దీంతో ఉద్రిక్తత నెలకొంది, అసెంబ్లీ హౌస్ లోకి వెళ్లి ప్రయత్నం చేసిన బిఆర్ ఎస్ పార్టీ ఎమ్మెల్యేలను అడ్డుకున్నారు.

## ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న కాంగ్రెస్


* రుణాలపై తప్పులు నివేదిక సమర్పించిన కాంగ్రెస్
* రూ.3.89 లక్షల కోట్లు ఉందని ఆర్‌ఐబీ చెబితే రూ.7 లక్షల చూపి తప్పుదోవ
* విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి కేటీఆర్



**హైదరాబాద్, డిసెంబర్ 16 (వెలుతురు):** కాంగ్రెస్ ప్రభుత్వం తమ రాజకీయ ప్రయోజనాల కోసం బీఆర్ఎస్‌పై తప్పుడు నివేదికలు వెల్లడించిందని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. ఆర్థిక మంత్రి ప్రసంగం పూర్తిగా అవాస్తవమని "హ్యాండ్ బుక్ ఆఫ్ స్టాటిస్టిక్స్ ఆన్ ఇండియన్ స్టేట్స్" పేరుతో ఆర్బీఐ విడుదల చేసిన నివేదికలో నిరూపితమైందని కేటీఆర్ అన్నారు. మిగతా..2లో

## బిఆర్‌ఎస్ ఖేల్ ఖతం అని తెలుసు

* అందుకే కెసిఆర్ సభకు రావడం లేదు : మంత్రి కోమటిరెడ్డి సెటైర్లు



**హైదరాబాద్,డిసెంబర్16(వెలుతురు):** ఐదుగురు ఉన్నప్పుడు ప్రతిపక్ష నేతగా భట్టి విక్రమార్క రోజూ సభకు వచ్చారని.. 38 మంది ఉన్న బీఆర్ఎస్ నాయకుడు కేసీఆర్ ఎందుకు రావడం లేదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో ముఖ్యమంత్రి కంటే ఎక్కువ విలువ ప్రతిపక్ష నాయకుడికి ఉంటుందన్నారు. భవిష్యత్తులో బీఆర్ఎస్ ఖతం అవుతుంది అని కేసీఆర్ ముందే తెలుసుకొని సభకు రావడం లేదన్నారు. అసెంబ్లీ లాబీల్లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మీడియాతో చిట్‌చాట్‌లో మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. మళ్లీ అధికారంలోకి వస్తామన్న మిగతా..2లో

## జై శ్రీరామ్ నినాదాలు చేయడం ఎలా నేరపూరిత చర్య


* మసీదు లోపల నినాదాలు చేసిన వారిని ఎలా గుర్తించారు
* ఫిర్యాదుదారున్ని ప్రశ్నించిన సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ, డిసెంబర్ 16 (వెలుతురు):** జై శ్రీరామ్ నినాదాలు చేయడం నేరపూరిత చర్య ఎలా అవుతుందని సుప్రీంకోర్టు సోమవారం ప్రశ్నించింది. మసీదు లోపల నినాదాలు చేశారనే ఆరోపణలతో ఇద్దరు వ్యక్తులపై విచారణను కొట్టివేస్తూ కర్ణాటక హైకోర్టు ఇచ్చిన తీర్పుపై అప్పీల్‌ను సమీక్షిస్తూ న్యాయమూర్తులు పంకజ్ మిథాల్, సందీప్ మెహతా ఈ అంశాన్ని లేవనెత్తారు. మసీదు లోపల 'జై శ్రీరామ్' నినాదాలు చేసిన ఇద్దరు వ్యక్తులపై విచారణను రద్దు చేసిన కర్ణాటక హైకోర్టు ఆదేశాలను సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. మిగతా..2లో

## మార్చి 5 నుంచి ఇంటర్ పరీక్షలు

* ఫిబ్రవరి 3 నుంచి ప్రాక్టికల్స్
* తెలంగాణ ఇంటర్ పరీక్షల షెడ్యూల్ విడుదల




**హైదరాబాద్,డిసెంబర్16(వెలుతురు):** తెలంగాణ ఇంటర్ పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. వచ్చే ఏడాది మార్చి 5 నుంచి 25 వరకు పరీక్షలు జరగనున్నాయి. ఫిబ్రవరి 3 నుంచి 22 వరకు ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహించనున్నారు. జనవరి 29న ఎథిక్స్ అండ్ హ్యూమన్ వ్యాల్యూస్ పరీక్ష, 30న పర్యావరణ పరీక్ష జరగనుంది. మిగతా..2లో

## పడిపోతున్న ఉష్ణోగ్రతలు

* గతంలో ఎన్నడూ లేనంతగా 7.1 డిగ్రీలుగా నమోదు

**హైదరాబాద్, డిసెంబర్ 16 (వెలుతురు):** హైదరాబాద్‌లో ఉష్ణోగ్రతలు భారీగా పడిపోయాయి. గత ఆరేండ్లలో ఎన్నడూ లేనంతంగా కనిష్టానికి పడిపోయాయి. హెచ్‌సీయూ, మౌలాలీలో అత్యల్పంగా 7.1 డిగ్రీలు, బీహెచ్ఈఎల్‌లో 7.4, రాజేంద్రనగర్‌లో 8.2, గచ్చిబౌలి 9.3, వెస్ట్ మారేడుపల్లి 9.9, కుత్బుల్లాపూర్, మచ్చ బొల్లారం 10.2, శివరాంపల్లి 10.3, జీడిమెట్ల 11.4, బాలానగర్ 11.5, పటాన్‌చెరు 11.7, మిగతా..2లో



# రాష్ట్రంలో భూమి లేని నిరుపేదలకు 12 వేల సాయం అందిస్తాం..

## అసెంబ్లీ లాబీలో మంత్రి పొంగులేటి చిట్‌చాట్...

(రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, డిసెంబర్ 16:** భూమి లేని నిరుపేదలకు 12 వేలు సాయం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని రాష్ట్ర రెవిన్యూ , సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సుమారు 15 లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూరనున్నదని ఆయన తెలిపారు.1000 కోట్లు విడుదల చేసే యోచనలో ప్రభుత్వం ఉందని అలాగే సంక్రాతి కి రైతు భరోసా. ఆసరా పెన్షన్‌ల విడుదలకు యత్నిస్తున్నామని మంత్రి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. గత రెండు మూడు సంవత్సరాల నుండి పోల్చుకుంటే స్థాంప్స్ & రిజిస్ట్రేషన్ ఆదాయం పెరిగిందని గత మూడు నెలల నుండి రియల్ ఎస్టేట్ భూమ్ పెరిగిందని చెప్పారు.

ఏపీ లో కొత్త గవర్నమెంట్ ఏర్పడ్డాక తెలంగాణ రియల్ ఎస్టేట్ పై కొంత అభద్రత భావం ఉండేది. కానీ ఇటీవల ఫ్లడ్ ఎఫెక్ట్ తో అది తొలగిపోయిందన్నారు,మళ్ళీ ఇప్పుడు అందరు తెలంగాణ బాట పట్టారని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు,స్పీకర్ కు బట్టి పై ప్రైవిలేజ్ మోషన్ ఇవ్వడం అర్ధరహితమని మంత్రి అన్నారు,

కార్పొరేషన్ లు ఒక్క రూపాయి కూడా స్వంతంగా జనరేట్ చేసుకునే పరిస్థితి లేదన్నారు,గత ప్రభుత్వం 7లక్షల కోట్ల అప్పు చేసిందని వాస్తవం. ఈ ప్రభుత్వం ను బదనాం చేయాలని బీఆర్ఎస్ చూస్తుందని విమర్శించారు,చర్చ నుండి తప్పించుకునేందుకే అనవసర లొల్లి చేస్తుం దన్నారు,బీఆర్ఎస్ అధినేత కేసిఆర్ అసెంబ్లీ వస్తే బాగుంటదన్నారు.సన్న వడ్లకు బోనస్ వచ్చే పంటకు కూడా ఇస్తామని మంత్రి హామీ ఇచ్చారు. కొంతమంది ఆంధ్ర నుండి బోనస్ కోసం తెలంగాణ లో వడ్లు అమ్మే ప్రయత్నంను అడ్డుకుంటున్నామన్నారు ఇండస్ట్రీ పాలసీలో పెట్టుబడులు ఎవరన్నది ముఖ్యం కాదని పెట్టు బడులు ఎవరు పెట్టినా తెలంగాణ రాష్ట్రానికి ఉపయోగం జరగాలని మంత్రిశ్రీనివాసరెడ్డి అన్నారు,సినీ పరిశ్రమను మా ప్రభుత్వం ప్రోత్సహి స్తుంది. మాకు సినిమా వాళ్లు, జర్నలిస్టులు, ప్రజలు అందరు సమానమే



## హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ పడిపోలేదు: మంత్రి పొంగులేటి

**హైదరాబాద్ వెలుతురు డిసెంబర్ 16:** హైదరాబాద్ లో రియల్ ఎస్టేట్ పడిపోలేదు చంద్రబాబు రాగానే అక్కడికి పోతుంది అనే ప్రచారం మాత్రమే అని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు,అమరావతి లో వరద వల్ల ఏపీకి ఇన్వెస్ట్మెంట్ వెళ్లే పరిస్థితి లేదన్నారు,అమరావతిలో వరద వల్ల ఇన్వెస్ట్మెంట్ పెట్టే వాళ్లకు భయం పట్టిందన్నారు. హైదరా బాద్ – బెంగుళూరుకు ఇన్వెస్టర్లు వస్తున్నారని మిగతా..2లో

# సంగీత ప్రపంచంలో ధృవతార

* జాకీర్ హుస్సేన్ మరణంపై ప్రముఖుల నివాళి
* వాహ్ తాజ్ ..ప్రకటనతో మరింత చేరువ

**న్యూఢిల్లీ,డిసెంబర్16(వెలుతురు):** తబలా ఖ్యాతిని ప్రపంచస్థాయికి తీసుకెళ్లిన విద్వాంసుడు జాకిర్ హుస్సేన్ (73) తుదిశ్వాస విడిచారు. ఆయన మృతిపై ప్రధాని మోదీ తదితర ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ... సంతాపం తెలియజేశారు. జాకిర్ హుస్సేన్ మరణం చాలా బాధాకరమని పేర్కొన్నారు. శాస్త్రీయ సంగీత ప్రపంచంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిన నిజమైన మేధావి అని కొనియాడారు.

జాకిర్ హుస్సేన్ మరణం తీవ్ర బాధను కలిగిస్తోంది. భారతీయ శాస్త్రీయ సంగీత ప్రపంచంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిన నిజమైన మేధావిగా ఆయన ఎప్పటికీ గుర్తుండిపోతారు. తన అసమానమైన ప్రతిభతో లక్షలాది మందిని ఆకర్షించారు. తబలాకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపుతెచ్చారు. భారతీయ శాస్త్రీయ సంప్రదాయాలను ప్రపంచ సంగీతంతో మిళితం చేసి సాంస్కృతిక మిగతా..2లో



## హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ పడిపోలేదు: మంత్రి పొంగులేటి

**మొదటిపేజీ తరువాయి..**

వస్తున్నారని మంత్రి అన్నారు. హైడ్రా భయం ప్రజల్లో మాత్రం లేదు..మొదట్లో తప్పుడు ప్రచారం జరిగినా ఇప్పుడు నిజం తెలిసిందని మంత్రి శ్రీనివాస్ రెడ్డి అప్పుల పై కేటీఆర్ బిఆర్ ఎస్ నిజాలు తెలుసుకోవాలని కార్పొరేషన్‌లోన్స్‌తో కలిపి మొత్తం లెక్కలు బయటపెట్టాలి BRS వాళ్ళు.కార్పొరేషన్ పేరుతో చేసే అప్పులు సైతం ప్రభుత్వం ఖాతాలోకి వస్తాయి అనేది కేటీఆర్ తెలుసుకోవాలన్నారు,7లక్షల 20వేల కోట్లు తెలంగాణ రాష్ట్రానికి అప్పులు ఉన్నాయ ని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

శాసన సభలో ఎవరి పాత్ర వారిదే...ప్రివిలేజ్ మోషన్ ఇవ్వడం వాళ్ల హక్కు కానీ కేసీఆర్ అసెంబ్లీకి రాకుండా కోసరుతో కొట్లాడుతున్నారని మంత్రి విమర్శించారు. కేసీఆర్ అసెంబ్లీకి వస్తె ఆయనతో కూర్చొని మాట్లాడే కోరిక నాకు వ్యక్తిగతంగా ఉందన్నారు, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ డిపార్ట్మెంట్ లో ఆదాయం పెరుగుతుంది.కాంగ్రెస్ ఏడాది కాలంపై ఎలాంటి వ్యతిరేకత లేదు...వైఎస్ఆర్ సమయంలో ఇలానే ప్రచారం జరిగింది. రెండు మూడు ఏళ్ళల్లో అన్ని సర్దుకున్నాయి...వర్షాలు భాగా పడ్డాయన్నారు,అదాని విషయంలో కాంగ్రెస్ పార్టీ జాతీయ పాలసీ నే రాష్ట్రంలో అమలు జరుగుతుంది.

## రాష్ట్రంలో బీసీ భవనాల నిర్మాణం: మంత్రి పొన్నం ప్రభాకర్

**మొదటిపేజీ తరువాయి..**

గతంలో ఇచ్చినవే ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు,కుల భావనల విషయంలో ఆర్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ముందుకు వెళ్తామన్నారు,బీ సీ కులాల అభివృద్ధి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి ప్రభాకర్ అన్నారు,
బీ సీ డిక్లరేషన్ లో చెప్పినట్టు రిజర్వేషన్ కల్పిస్తాం అందులో భాగంగానే రాష్ట్రంలో కులగణన చేస్తున్నామని మంత్రి ప్రభాకర్ తెలిపారు,

## బిఆర్ఎస్ ఖేల్ ఖతం అని తెలుసు

**మొదటిపేజీ తరువాయి..**

నమ్మకం కేసీఆర్‌కు లేదని.. అందుకే అసెంబ్లీ వస్తలేరు అంటూ మంత్రి వ్యాఖ్యానించారు. కొడుకు, అల్లుడు, బిడ్డలను తాము పట్టించుకోమన్నారు. డీలిమిటేషన్‌లో 34 అసెంబ్లీ సీట్లు, 7 ఎంపీ సీట్లు పెరుగుతాయన్నారు. జమిలి డ్రాఫ్ట్ రెడీ అయిందన్నారు. మా సీఎం , మంత్రులు పబ్లిక్‌కి అందుబాటులో ఉంటున్నాము ప్రతిపక్ష హోదా లేకున్నా ఖర్గే, అదిర్ రంజన్ చౌదరి పార్లమెంట్‌కి వెళ్లారన్నారు. బ్జడెట్ సమావేశాల వరకు కొత్త మంత్రివర్గం రెడీ అవుతుందని ఆయన వెల్లడించారు.కాంగ్రెస్‌లో మంత్రి వర్గ విస్తరణలో ఎవరికి పదవులు అనేది ఎవరు చెప్పలేరన్నారు. ఈ విషయం పార్టీ అధిష్ఠానం, సీఎందే తుది నిర్ణయమన్నారు. పాలమూరు నుంచి శ్రీహరికి కచ్చితంగా మంత్రి పదవి.. ఇది మాత్రం చెప్పగలనన్నారు. నల్గొండలో 2018లో భూపాల్ రెడ్డిని వికలాంగుడు అనే సానుభూతితో గెలిపించారంటూ మంత్రి విమర్శించారు. ఇందిరాగాంధీ, ఎన్టీఆర్ ఓడారు.. నేనెంత అంటూ వ్యాఖ్యానించారు. కల్వకుర్తిలో ఎన్టీఆర్ మీద చిత్త రంజన్ ఇంట్లో నుంచి గెలిచారన్నారు. తన మీద గెలిచేందుకు బూర నర్సయ్య రూ.80 కోట్లు ఖర్చు పెట్టారని.. అయినా తానే గెలిచానన్నారు. ప్రతిపక్ష ఎంపీగా ఎన్నో రోడ్ ప్రాజెక్టులు తీసుకొచ్చామన్నారు. గడ్కరీ నిన్న సీఎంకు చెబుతూ.. వెంకన్న నాకు చోటా బాయ్ అన్నారన్నారు.

## మార్చి 5 నుంచి ఇంటర్ పరీక్షలు

**మొదటిపేజీ తరువాయి..**

ఇంగ్లీష్ ప్రాక్టికల్ పరీక్షను ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు జనవరి 1న, సెకండియర్ విద్యార్థులకు ఫిబ్రవరి 1న నిర్వహించనున్నారు. రెగ్యులర్, ఒకేషనల్ విద్యార్థులకు ఒకేసారి ఈ పరీక్షను నిర్వహిస్తారు.ఇంటర్ రెగ్యులర్, ఒకేషనల్ విద్యార్థులకు ఫిబ్రవరి 3, 2025 నుంచి ఫిబ్రవరి 22, 2025 వరకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నారు. రెండు సెషన్లలో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 వరకు ప్రాక్టికల్ పరీక్షలు జరగనున్నాయి. మరోవైపు ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల టైమ్ టేబుల్ విడుదలైంది. మార్చి 1నుంచి ఇంటర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఇంటర్ బోర్డు కార్యదర్శి కృతికా శుక్లా ప్రకటించారు. ఇంటర్మీడియట్ రెగ్యులర్,ఒకేషనల్ విద్యార్థులకు మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు 9 గంటల నుంచి 12 గంటల వరకు జరుగుతాయి.

### ఫస్ట్ ఇయర్ పరీక్షల తేదీలు ఇవే

05-03-2025 - పార్ట్-2 సెకండ్ ల్యాంగ్వేజ్
07-03-2025 - పార్ట్-1 ఇంగ్లీష్ పేపర్
11-03-2025-మాథ్స్ పేపర్ 1A, బోటని పపెర్-1,పొలిటికల్ సైన్స్ పేపర్-1
13-03-2025 - మ్యాథ్స్ పేపర్ 1B , జూలాజి పేపర్ -1, హిస్టరీ పేపర్-1
17-03-2025 - ఫిజిక్స్ , ఎకనామిక్స్
19-03-2025 - కెమిస్ట్రీ , కామర్స్

### సెకెండ్ ఇయర్ పరీక్షల తేదీలు ఇవే

06-03-2025 - పార్ట్-2 సెకండ్ ల్యాంగ్వేజ్
10- 03-2025 - పార్ట్-1 ఇంగ్లీష్
12-03-2025 - మాథ్స్ పేపర్ 2A, బోటని , పొలిటికల్ సైన్స్
15-03-2025 - మ్యాథ్స్ పేపర్ 2B , జూలాజి, హిస్టరీ
18-03-2025 - ఫిజిక్స్ , ఎకనామిక్స్
20-03-2025 - కెమిస్ట్రీ , కామర్స్

## పడిపోతున్న ఉష్ణోగ్రతలు

**మొదటిపేజీ తరువాయి..**

షాపూర్‌నగర్ 11.7, లింగంపల్లి 11.8, బోయిన్‌పల్లి 11.9, బేగంపేట 12, ఆసిఫ్‌నగర్ 12, నేరెడ్‌మెట్ 12.1, లంగర్‌హౌస్ 12.2, మోండా మార్కెట్ 12.4, చందానగర్ 12.7, షేక్‌పేట 12.8, మాదాపూర్ 12.8, ముషీరాబాద్ 12.9, చాంద్రాయణగుట్ట 13, కూకట్‌పల్లి 13.1, గోల్కొండ 13.2, సఫిల్‌గూడ, హయత్‌నగర్ 13.3, ఉప్పల్ 13.4, మల్లాపూర్ 13.5, ఆదర్శ్‌నగర్ 13.5, తిరుమలగిరి, చర్లపల్లి 13.6 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇక ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రాష్ట్రంలోనే అతితక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదిలాబాద్ జిల్లా బేలాలో 6.3 డిగ్రీలు రికార్డయ్యాయి. నిర్మల్ జిల్లా తాంద్రలో 6.3, ఆదిలాబాద్ జిల్లా పోచర 6.4, జైనాథ్ 6.5, అర్లి (టీ) 6.6, చాప్రాల్ 6.6, సంగారెడ్డి జిల్లా సత్వార్ 6.6, వికారాబాద్‌లోని బంట్వారం 6.7, సంగారెడ్డిలోని న్యాల్కల్‌లో 6.7, ఎలిమినేడు, రాచలూరు (రంగారెడ్డి) 6.7, సిర్పూర్ యూ (ఆసిఫాబాద్) 6.7, చందనపల్లి (రంగారెడ్డి) 6.7, కోహిర్ (సంగారెడ్డి) 6.7, మర్పల్లి (వికారాబాద్) 6.8, వికారాబాద్ జిల్లాలోని నగరం (టీ), మన్నెగూడలో 6.8, నల్లవెల్లి (సంగారెడ్డి) 6.8, పోతరరెడ్డిపేట (సిద్దిపేట) 6.9, జహీరాబాద్ (సంగారెడ్డి) 6.9, మెనూర్ (కామారెడ్డి) 6.9, రాఘవపేట (జగిత్యాల) 7.3, కెరమెరి (ఆసిఫాబాద్) 7.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉత్తరాది నుంచి ఈదురుగాలులు, శీతల పవనాలు వీస్తుండటంతో ఉష్ణోగ్రతలు పడిపోయాయి. దీంతో ప్రజలు బయటకు రావడానికి జంకుతున్నారు.

## నెహ్రూ లేఖలను మాకు అప్పగించండి

### రాహుల్ గాంధీకి కేంద్ర ప్రభుత్వం లేఖ

**న్యూఢిల్లీ, డిసెంబర్ 16 (వెలుతురు):** భారత తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ రాసిన లేఖల విషయంపై కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీకి కేంద్ర ప్రభుత్వం లేఖ రాసింది. నెహ్రూ రాసిన లేఖలను తిరిగి అప్పగించాలని ప్రధానమంత్రి సంగ్రహాలయం కోరింది. 2008లో ఆ లేఖలను సోనియా గాంధీ తీసుకెళ్లినట్లు పేర్కొంది. వాటిని తిరిగి అప్పగించే విషయంలో సహకరించాలని లేఖలో విజ్ఞప్తి చేసింది. చరిత్రక ప్రాముఖ్యత కలిగిన నెహ్రూ లేఖలను జవహర్‌లాల్ నెహ్రూ మెమోరియల్ 1971లో నెహ్రూ మెమోరియల్ మ్యూజియం అండ్ లైబ్రరీకి అప్పగించింది. అయితే 2008లో యూపీఏ ప్రభుత్వ హయాంలో ఆ లేఖలను సోనియా గాంధీకి పంపారు. అప్పటి నుంచి అవి సోనియా వద్దే ఉన్నాయి. ఆ లేఖలను తిరిగి అప్పగించాలని ఈ ఏడాది సెప్టెంబర్‌లోనే ప్రధాన మంత్రి లైబ్రరీ కోరింది. దీనిపై స్పందించకపోవడంతో రాహుల్ గాంధీకి డిసెంబర్ 10న మరోసారి లేఖ రాసింది.

# సంగీత ప్రపంచంలో ధృవతార

**మొదటిపేజీ తరువాయి..**

ఐక్యతకు చిహ్నంగా మారారు. ఆయన ప్రదర్శనలు ఎన్నోతరాల సంగీత విద్వాంసులతో పాటు ఎంతోమంది సంగీతప్రియుల్లో కూడా స్ఫూర్తినింపాయి. జాకిర్ హుస్సేన్ కుటుంబంతో పాటు.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆయన అభిమానులకు నా సానుభూతి అని ప్రధాని మోదీ సంతాపం తెలిపారు. జాకిర్ హుస్సేన్.. భారతీయ శాస్త్రీయ సంగీతంలో మహోన్నత వ్యక్తి. ఆయన అద్భుతమైన సంగీత ప్రదర్శనలు తరతరాల సంగీత ప్రియులకు స్ఫూర్తినిచ్చాయి. ఆయన వారసత్వం సంగీత ప్రపంచంపై ప్రభావం చూపడంతో పాటు స్ఫూర్తినిస్తూనే ఉంటుందని ఏపి సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. 'ప్రఖ్యాత సంగీత విద్వాంసుడు జాకిర్ హుస్సేన్ అకాల మరణం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. ఆయన మరణం దేశానికి, ప్రపంచవ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది అభిమానులకు తీరని నష్టం. ఆయన కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి అని బెంగాల్ సిఎం మమతా బెనర్జీ పేర్కొన్నారు. జాకిర్ హుస్సేన్ సంగీతం ఎప్పటికీ హృదయాల్లో ప్రతిధ్వనిస్తూనే ఉంటుంది. ఆయన మరణం సంగీత ప్రపంచానికి తీరని లోటు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తున్నానని ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. 'పద్మ విభూషణ్ జాకిర్ హుస్సేన్ మరణం సంగీత ప్రపంచానికి తీరని లోటు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలి. ఆయన కుటుంబానికి ఈ లోటును తట్టుకొనే ధైర్యాన్ని ఇవ్వాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని యూపి సిఎం యోగి ఆదిత్యనాథ్ తెలిపారు. ప్రఖ్యాత తబలా విద్వాంసుడు జాకిర్ హుస్సేన్ (73) కన్నుమూశారు. రక్తపోటు సంబంధిత సమస్యలతో బాధపడుతున్న ఆయన రెండు వారాల క్రితం శాన్ ఫ్రాన్సిస్కోలోని ఆసుపత్రిలో చేరారు. పరిస్థితి విషమించడంతో ఐసీయూలో చికిత్స పొందారు. ఈక్రమంలోనే తుదిశ్వాస విడిచారు. తబలా మ్యాస్ట్రోగ్రా ప్రఖ్యాతిగాంచిన జాకిర్ హుస్సేన్ 1951 మార్చి 9న ముంబయిలో జన్మించారు. ప్రముఖ తబలా వాయిద్యకారుడు అల్లారఖా పెద్ద కుమారుడైన జాకిర్‌హుస్సేన్ చిన్నప్పటి నుంచే తండ్రి బాటలో నడిచారు. ఈ క్రమంలో హిందుస్థానీ క్లాసికల్ మ్యూజిక్, జాజ్ ఫ్యూజన్‌లో నైపుణ్యం సాధించి తనదైన ముద్ర వేశారు. తొలుత ఆదివారం రాత్రి ఆయన చనిపోయినట్లు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. అయితే ఆయన చనిపోలేదని, పరిస్థితి విషమంగా ఉందని, చికిత్స అందుతోందని కుటుంబ సభ్యులు తెలిపారు. తాజాగా ఆయన మరణాన్ని ధ్రువీకరించారు. 1990లో సంగీత్‌నాటక అకాడమీ అవార్డు, 2009లో గ్రామీ పురస్కారం అందుకున్నారు. 1988లో పద్మశ్రీ, 2002లో పద్మభూషణ్, 2023లో పద్మవిభూషణ్‌తో కేంద్ర ప్రభుత్వం ఆయన్ను గౌరవించింది. జాకిర్ హుస్సేన్ భారత్‌తోపాటు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నారు. మొత్తంగా ఐదు గ్రామీ అవార్డులు గెలుచుకున్న ఆయన.. ఈ ఏడాది ప్రారంభంలో 66వ గ్రామీ అవార్డుల్లో మూడింటిని కైవసం చేసుకున్నారు. ఆరు దశాబ్దాల పాటు సాగిన సంగీత ప్రయాణంలో.. మన దేశంతోపాటు ఎంతో మంది అంతర్జాతీయ కళాకారులతో కలిసి పనిచేశారు. తబలా మ్యాస్ట్రో జాకిర్ హుస్సేన్.. ఆరు దశాబ్దాల తన సుదీర్ఘ సంగీత ప్రయాణంలో ఎంతోమంది సంగీతప్రియులకు ఆరాధ్యమైన విద్వాంసుడు. శాస్త్రీయ సంప్రదాయాలను ప్రపంచ సంగీతంతో మిళితం చేసి సాంస్కృతిక ఐక్యతకు చిహ్నంగా నిలిచిన కళాకారుడు. అయితే, చాలామందికి జాకిర్ హుస్సేన్ అంటే ఠక్కున గుర్తొచ్చేది మాత్రం 'వాహ్ తాజ్ అనే పదమే. దీంతోనే ఆయన సంగీతప్రియులకే కాకుండా యావత్ దేశంలోని ప్రతీ ఇంటికీ చేరువయ్యారు అనడంలో ఏ సందేహం లేదు..! అదే 1990ల్లో ఆయన నటించిన బ్రూక్‌బాండ్ తాజ్‌మహల్ టీ యాడ్.

జాకిర్ హుస్సేన్ తబలా వాయిస్తుంటే చెవుల్లో తేనె పోసినట్లు ఉంటుందంటారు సంగీతప్రియులు. వర్షపు చినుకుల సవ్వడి నుంచి పరమశివుడి ఢమరుకం ధ్వని వరకు ప్రతి శబ్దాన్ని తన తబలపై ఆయన పునఃసృష్టి చేసేవారు. అందుకే ఆయన ప్రదర్శనను తిలకించే వీక్షకులంతా 'వాహ్ ఉస్తాద్' అంటూ కొనియాడేవారు. దీన్ని ఆధారంగా చేసుకొనే హిందుస్థాన్ థాంప్సన్ అసోసియేట్స్ కంపెనీ ఓ యాడ్ రూపొందించింది. అదే 'బ్రూక్‌బ్రాండ్ తాజ్ మహల్ టీ' యాడ్. ఇందులో ఆగ్రాలోని ప్రఖ్యాత కట్టడం తాజ్‌మహల్ ముందు జాకిర్ హుస్సేన్ కూర్చుని తబలా వాయిస్తుంటారు. 'తన కళను ఉత్తమంగా తీర్చుకునేందుకు ఈ మ్యాస్ట్రో సాధన చేస్తారు. అలాగే తాజ్‌మహల్ టీని కూడా ఉత్తమంగా అందించేందుకు ఎన్నోరకాల నాణ్యతా పరీక్షలు చేశాం' అంటూ బ్యాక్‌గ్రౌండ్‌లో వాయిస్ వినిపిస్తుంది. వీడియోలో చివరగా ఆయన వాయిద్యానికి మైమర్చిపోయిన ఓ అమ్మాయి జాకిర్‌కు ఓ కప్పు టీ అందిస్తూ 'వాహ్ ఉస్తాద్' అని అంటుంది. దానికి ఆయన బదులిస్తూ 'వాహ్ ఉస్తాద్ కాదు.. వాహ్ తాజ్ అనండి' అని అంటారు. మరో యాడ్‌లో ఓ బాలుడితో కలిసి తబలా వాయిస్తూ ఉంటారు. బాలుడి ప్రతిభను మెచ్చి జాకిర్ 'వాహ్ ఉస్తాద్' అంటారు. దీనికి ఆ బాలుడు 'అరె హుజూర్ వాహ్ ఉస్తాద్ కాదు.. వాహ్ తాజ్ అనాలి' అని చెప్పడంతో వారిద్దరూ నవ్వులు చిందిస్తారు. ఈ యాడ్ అప్పటికీ, ఇప్పటికీ ప్రత్యేకమే..! అంతేనా ఈ ప్రకటనతో తాజ్‌మహల్ టీ బ్రాండ్‌కు దేశవ్యాప్తంగా విశేష ఆదరణ లభించింది. ముఖ్యంగా మిడిల్‌క్లాస్‌ను అమితంగా ఆకట్టుకుంది. 1966లో ఈ తాజ్‌మహల్ టీని కంపెనీ కోల్‌కతాలో ప్రారంభించింది. తొలుత దీని ప్రచారం కోసం జాకిర్ హుస్సేన్‌ను అనుకోలేదట. నటీనటులు జీనత్ అమన్, మాళవిక్ తివారీ వంటి వారు యాడ్‌లో కన్పించారు. అయితే అప్పట్లో కేఎస్ చక్రవర్తి అనే వ్యక్తి హిందుస్థాన్ థాంప్సన్ అసోసియేట్స్‌లో కాపీరైటర్‌గా పనిచేసేవారు. ఆయనకు తబలా వాయిద్యం అంటే చాలా ఇష్టం. అలా ఓసారి జాకిర్ హుస్సేన్ ప్రదర్శనను తిలకిస్తుంటే.. తాజ్ యాడ్‌కు ఆయన సరిగ్గా సరిపోతారని అనిపించిందట. అదే విషయాన్ని సంస్థ యాజమాన్యానికి చెప్పగా వారు జాకిర్‌ను సంప్రదించారు. ఈ యాడ్ కాన్సెప్ట్ ఆయనకూ నచ్చడంతో సొంత ఖర్చులతో శాన్‌ఫ్రాన్సిస్కో నుంచి ఆగ్రాకు వచ్చినట్లు అప్పట్లో కథనాలు వచ్చాయి. ఈ ప్రకటనలో నటించడం గురించి గతంలో జాకిర్ హుస్సేన్ ఓ ఇంటర్వ్యూలో గుర్తుచేసుకున్నారు. 'నా పేరు వినగానే 'వాహ్ తాజ్' అని చాలామంది చెబుతారు. సాధారణంగా బాలీవుడ్ మ్యూజిక్‌తో పోలిస్తే శాస్త్రీయ సంగీతానికి ఆదరణ కాస్త తక్కువే. శాస్త్రీయ కళాకారులను కూడా అంతగా ఎవరూ గుర్తుపెట్టుకోరు. ప్రజలకు చేరువయ్యేందుకు మాలాంటివారికి ఏదో ఒక వేదిక కావాలి. 'తాజ్ టీ' నాకు అలాగే ఉపయోగపడింది. ఆ యాడ్‌లో నేను కన్పించింది 30 సెకన్లే అయినా.. నన్ను చాలామంది గుర్తుపట్టేలా చేసింది. నేను ఎవరనే ఆసక్తిని మరింత పెంచిందని జాకిర్ ఆనాడు చెప్పారు.

## ఉస్తాద్ జాకీర్ హుస్సేన్ ప్రతిభతో 'తబలా వాయిద్యం విశ్వవ్యాప్తం'

### జాకీర్ హుస్సేన్‌కు ప్రధాని మోదీ సంతాపం



**న్యూఢిల్లీ, డిసెంబర్ 16 (వెలుతురు):** తబలా విద్వాంసుడు ఉస్తాద్ జాకీర్ హుస్సేన్ మృతి పట్ల ప్రధాని మోదీ సంతాపం తెలిపారు. భారత సంప్రదాయ సంగీతంలో విప్లవం తీసుకువచ్చిన ఓ జ్ఞానిగా ఉస్తాద్ జకీర్ హుస్సేన్‌ను గుర్తు చేసుకుంటామన్నారు. ప్రధాని మోదీ తన ట్విట్టర్‌లో స్పందిస్తూ.. లెజెండరీ మ్యాస్ట్రో జకీర్ హుస్సేన్ మృతి బాధకు గురి చేసిందన్నారు. తబలా వాయిద్యాన్ని విశ్వవ్యాప్తం చేసిన సంగీత కళాకారుడు అని పేర్కొన్నారు. తన తబలా మ్యూజిక్‌తో లక్షలాది మంది అభిమానుల్ని ఆకట్టుకున్నట్లు చెప్పారు. భారతీయ క్లాసికల్ సంప్రదాయాలను.. గ్లోబల్ మ్యూజిక్ తో సమ్మిళితం చేసి.. సాంస్కృతిక ఐకమత్యాన్ని ప్రదర్శించినట్లు తెలిపారు. జాకీర్ హుస్సేన్ ఇచ్చిన ప్రదర్శనలు.. రసభరితమైన బాణీలు.. రాబోయే తరాలకు చెందిన మ్యూజిక్ లవర్స్‌ను ప్రేరేపిస్తూనే ఉంటాయన్నారు. జాకీర్ కుటుంబసభ్యులు, స్నేహితులు, ప్రపంచ సంగీత లోకానికి సంతాపం చెబుతున్నట్లు మోదీ తన ట్వీట్‌లో వెల్లడించారు.

## జాకీర్ హుస్సేన్ మృతి పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతాపం

(రాపర్తి భాస్కర్ గౌడ్)



**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, డిసెంబర్ 16:** ప్రఖ్యాత తబలా విద్వాంసుడు పద్మవిభూషణ్ జాకీర్ హుస్సేన్ మరణం పట్ల ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని సంతాపం తెలియజేశారు. జాకీర్ హుస్సేన్ తండ్రి అల్లారఖా బాటలో నడుస్తూ తబలా వాద్యం పట్ల, హిందుస్థానీ శాస్త్రీయ సంగీతంలో తనదైన ముద్ర వేసుకుంటూ అంతర్జాతీయ ఖ్యాతి గడించారని గుర్తుచేశారు. జాకీర్ హుస్సేన్ మరణం సంగీత ప్రపంచానికి తీరని లోటు అని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. జాకీర్ హుసేన్ మరణం పట్ల ముఖ్యమంత్రి సంతాపం తెలియజేస్తూ వారి ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని ప్రార్థించారు. జాకీర్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ఈ సందర్భంగా తెలియజేశారు.

# ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న కాంగ్రెస్

**మొదటిపేజీ తరువాయి..**

2014-15లో తెలంగాణ మొత్తం రుణాలు రూ.72 వేల 658 కోట్లు ఉండగా, 2024 మార్చి నాటికి ఈ రుణాల మొత్తం రూ. 3,89, 673 కోట్లకు చేరిందని ఆర్‌బీఐ వెల్లడించిందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై ప్రివిలేజ్ మోషన్ ఇచ్చిన అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ అప్పులు కేవలం రూ.3.89 లక్షల కోట్లు అని ఆర్బీఐ నివేదికలో స్పష్టం చేస్తే.. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం రూ.7లక్షల కోట్లు అంటూ తప్పుదోవ పట్టిస్తుందని విమర్శించారు. రాష్ట్ర అప్పులపై ఆర్థిక మంత్రి ఉద్దేశపూర్వకంగానే తప్పుడు సమాచారమిచ్చి, గత బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రతిష్ఠకు భంగం కలిగించారని అన్నారు. అందుకే తెలంగాణ శాసనసభ కార్య విధాన మరియు కార్యక్రమ నిర్వహణ నియమావళిలోని 168 (1) నిబంధన ప్రకారం బీఆర్ఎస్ శాసనసభా పక్షం తరపున ఆర్థిక మంత్రిపై సభా హక్కుల ఉల్లంఘన నోటీసులు ఇస్తున్నామని చెప్పారు. ఎమ్మెల్యేల హక్కులకు భంగం కలిగించేలా వ్యవహరిస్తున్న అంశంలోనూ సభా హక్కుల నోటీసులు ఇచ్చామని తెలిపారు. లగచర్ల వంటి బాధాకరమైన సంఘటన జరిగినప్పుడు, టూరిజంపైన అసెంబ్లీలో చర్చ పెట్టడం ప్రభుత్వ ప్రాధాన్యతలకు అద్దం పడుతుందని కేటీఆర్ విమర్శించారు. లగచర్ల అంశంపై శాసనసభలో చర్చించాలని స్పీకర్‌కు విజ్ఞప్తి చేశామని తెలిపారు. అసలైన అప్పులతో రాష్ట్ర ప్రభుత్వం సవరణ స్టేట్‌మెంట్ ఇవ్వాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. సవరణ ఇవ్వని పక్షంలో సభా హక్కుల ఉల్లంఘన తీర్మానాన్ని అసెంబ్లీలో ప్రవేశపెట్టాలని కోరారు. గతంలో తానే స్వయంగా అప్పటి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డిపై ఇచ్చిన ప్రివిలేజ్ మోషన్‌ను అప్పటి స్పీకర్ మనోహర్ అంగీకరించారని గుర్తుచేశారు. దానిపై అప్పుడు సభలో చర్చ జరిగిందని పేర్కొన్నారు గతంలో ఉన్న పద్ధతులు, సాంప్రదాయాలకు అనుగుణంగా ప్రివిలేజ్ మోషన్‌కు అనుమతి ఇవ్వాలని స్పీకర్‌ను విజ్ఞప్తి చేశామని తెలిపారు. గతంలో ఉన్నటువంటి సాంప్రదాయాలను పరిగణలోకి తీసుకుని సభా హక్కుల ఉల్లంఘన తీర్మానానికి స్పీకర్ గడ్డం ప్రసాద్ శాసనసభలో అనుమతి ఇస్తారని ఆశిస్తున్నానని అన్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు, ఇతర కాంగ్రెస్ నేతలు అప్పులపై బయట కూడా అడ్డగోలుగా మాట్లాడుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు. 7 లక్షల కోట్ల అప్పు అంటూ లేని అప్పు గురించి మాట్లా డుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీళ్లు చెబుతున్న అప్పుల లెక్కలు తప్పు కాబట్టి.. ఈ ప్రభుత్వం కడుతున్నామని చెబుతున్న నెలకు 6వేల 500 కోట్ల వడ్డీ లెక్కలు కూడా తప్పే అని స్పష్టం చేశారు. ఏడాదికి కేవలం రూ.22 వేల కోట్ల వడ్డీ మాత్రమే కడుతున్నారని చెప్పారు. రాష్ట్రంలో అనేక సమస్యలు ఉండగా కేవలం టూరిజంపైనే రాష్ట్ర ప్రభుత్వం చర్చకు స్వీకరించడం బాధాకరమని కేటీఆర్ అన్నారు. రాష్ట్రంలో ఢిల్లీ టూరిజం, జైలు టూరిజం బాగా నడుస్తున్నాయని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులు ఢిల్లీకి 100కి పైగా చేసిన పర్యటనలతో ఢిల్లీ టూరిజం బాగా పెరిగిందని విమర్శించారు. మరోవైపు 40 మంది లగచర్ల రైతులను జైలులో పెట్టడం, ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్న సోషల్ మీడియా కార్యకర్తల నుంచి మొదలుకొని పార్టీ నాయకులను జైల్లో పెడుతున్న జైలు టూరిజం.. బెయిల్ వచ్చిన తర్వాత కూడా నటులను జైలులో ఉంచుతున్న జైలు టూరిజం.. ప్రభుత్వ పథకాలపై మాట్లాడుతుంటే జైలుకు పంపిస్తామని ముఖ్యమంత్రి చేస్తున్న జైలు టూరిజం.. ఈ విధంగా తెలంగాణలో జైలు టూరిజం బాగా నడుస్తుందని అన్నారు. సర్పంచ్‌ల సమస్యలపై కూడా శాసన సభలో చర్చకు లేవనెత్తామని కేటీఆర్ తెలిపారు. సర్పంచ్‌లకు ఇవ్వాల్సిన రూ.600 కోట్ల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ తరపున డిమాండ్ చేశామన్నారు. గత నెలలో బడా కాంట్రాక్టర్లకు ఇచ్చిన రూ.1200 కోట్ల నిధుల్లో సగం ఇస్తే.. సర్పంచ్‌ల సమస్యలు పరిష్కారమవుతాయని అన్నారు. ఈ అంశంలో రాష్ట్ర ప్రభుత్వానికి సూచనలు ఇవ్వాలని స్పీకర్‌కు కూడా విజ్ఞప్తి చేశామని నచెప్పారు. లగచర్ల అంశంపై కూడా సభలో చర్చించాలని స్పీకర్‌ను కోరినట్లు కేటీఆర్ తెలిపారు. రైతులను అక్రమంగా జైలులో ఉంచిన కాంగ్రెస్ సర్కార్ తీరుపై రాష్ట్ర ప్రజలు ఆవేదన చెందుతున్నారని పేర్కొన్నారు. ఈ విషయంలో ప్రభుత్వ వైఖరిని శాసన సభలో తెలియజేయాలని డిమాండ్ చేశారు.

# జై శ్రీరామ్ నినాదాలు చేయడం ఎలా నేరపూరిత చర్య

**మొదటిపేజీ తరువాయి..**

దీనిపై విచారణ చేపట్టిన భారత అత్యున్నత న్యాయస్థాన ధర్మాసనం ఈ మేరకు వ్యాఖ్యలు చేసింది. హైదర్ అలీ సిఎం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ జరిపింది. ఒక నిర్దిష్ట మతపరమైన పదబంధాన్ని లేదా పేరును అరుస్తుంటే అది ఎలా నేరం అని బెంచ్ ప్రశ్నించింది. మసీదు లోపలికి వచ్చి నినాదాలు చేసిన వారిని ఎలా గుర్తించారని సుప్రీంకోర్టు ఫిర్యాదుదారుని ప్రశ్నించింది. విచారణ సందర్భంగా, పిటిషనర్ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది దేవదత్ కామత్‌ను సుప్రీంకోర్టు ధర్మాసనం ప్రశ్నించింది.ఈ ప్రతివాదులను ఎలా గుర్తిస్తారు అవన్నీ సీసీటీవీలో రికార్డయ్యాయని అంటున్నారు. లోపలికి వచ్చిన వ్యక్తులను ఎవరు గుర్తించారని బెంచ్ ప్రశ్నించింది. భారతీయ శిక్షాస్మృతిలోని సెక్షన్ 503 లేదా సెక్షన్ 447లోని నిబంధనలను అభియోగాలు తాకడం లేదని హైకోర్టు గుర్తించిందని ధర్మాసనం పేర్కొంది. భారతీయ శిక్షాస్మృతిలోని సెక్షన్ 503 క్రిమినల్ బెదిరింపులకు సంబంధించిందని, అయితే సెక్షన్ 447 నేరపూరిత అతిక్రమణకు శిక్షను సూచిస్తుందని సుప్రీంకోర్టు పేర్కొంది. ఫిర్యాదును ప్రస్తావిస్తూ, ఎఫ్ఐఆర్ నేరాల ఎన్‌సైక్లోపీడియా కాదని కామత్ అన్నారు. మసీదులోకి ప్రవేశించిన అసలు వ్యక్తులను మీరు గుర్తించగలిగారా దీనిపై రాష్ట్ర పోలీసులు వివరణ ఇవ్వాల్సి ఉంటుందని కామత్ అన్నారు. దీనిపై ధర్మాసనం పిటిషన్ కాపీని రాష్ట్రానికి ఇవ్వాలని పిటిషనర్‌ను కోరగా, కేసు తదుపరి విచారణను 2025 జనవరికి వాయిదా వేసింది.

అంతకుముందు సెప్టెంబర్ 13న, ఈ కేసులో ఇద్దరు వ్యక్తులపై క్రిమినల్ ప్రొసీడింగ్‌లను కర్ణాటక హైకోర్టు రద్దు చేసింది. ఎవరైనా 'జై శ్రీరామ్' అంటూ నినాదాలు చేస్తే ఏ వర్గానికి చెందిన వారి మనోభావాలను ఎలా దెబ్బతీస్తారన్నది అర్థం కావడం లేదని కర్ణాటక హైకోర్టు తన ఉత్తర్వుల్లో పేర్కొంది.

ఈ ఘటనలో ఎలాంటి ప్రజా విఘాతం లేదా ఎలాంటి చీలిక ఏర్పడినట్లు ఎలాంటి ఆరోపణలు లేవని వ్యాఖ్యానించింది. ఐపిసి సెక్షన్ 506 ప్రకారం నేరపూరిత బెదిరింపు నేరానికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి ఎవరో కూడా ఫిర్యాదుదారు చూపలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. మసీదులోకి ప్రవేశించి మతపరమైన నినాదాలు చేశారనే ఆరోపణలతో ఇద్దరు వ్యక్తులు దాఖలు చేసిన పిటిషన్‌పై కర్ణాటక హైకోర్టు ఈ ఆదేశాలు జారీ చేసింది.

ఈ కేసులో తనపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్, ప్రొసీడింగ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సంఘటన 2023 సెప్టెంబర్ 24న జరిగింది. పుత్తూరు సర్కిల్‌లోని కడప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. కొందరు గుర్తు తెలియని వ్యక్తులు మసీదులోకి ప్రవేశించి 'జై శ్రీరామ్' నినాదాలు చేయడంతో బెదిరింపులకు దిగారని ఫిర్యాదుదారు ఆరోపించారు. ఎలాంటి ఆరోపణ చేసిన నేరాలకు సంబంధించిన ఆధారాలు లేకుండా, పిటిషనర్‌లపై విచారణ కొనసాగించడం చట్టపరమైన దుర్వినియోగం అవుతుందని, న్యాయపరమైన అనుచితానికి దారి తీస్తుందని హైకోర్టు నిర్ధారించింది.

# 21 వరకు అసెంబ్లీ..

**మొదటిపేజీ తరువాయి..**



తప్పేంటని బీఆర్ఎస్ సభ్యులు ప్రశ్నించారు. పార్లమెంట్‌కు రాహుల్ గాంధీ టీ షర్ట్ వేసుకుని వెళ్లడం లేదా అని సమావేశంలో హరీష్ రావు ప్రశ్నించారు. బీఏసీ సమావేశంపై మాజీ మంత్రి హరీష్ రావు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ.. గంట సేపు సమావేశం జరిగినా సభ పనిదినాలపై స్పష్టత ఇవ్వడం లేదని ఆయన అన్నారు. అందుకే బీఏసీ నుంచి వాకౌట్ చేసినట్ల మాజీ మంత్రి తెలిపారు. 'మేము 15రోజులు సభ పెట్టాలని అడిగాము. సభను నాలుగైదు రోజులే నడిపే మూడ్‌లో ఉన్నారు. మమ్మల్ని అడ్వయిజ్ మాత్రమే ఇవ్వాలని సీఎం అన్నారు. కేవలం సలహా మాత్రమే ఇవ్వాలని అంటున్నారు. ఇదే విషయంపై ఎంఐఎం కూడా వాక్ ఔట్ చేసింది. ప్రోటోకాల్ పాటించడం లేదని స్పీకర్‌కు చెప్పాం. బీఏసీ పెట్టకుండానే బిల్స్ ఎలా పెడతారు అని అడిగాము. పెళ్ళిళ్లు ఉన్నాయని సభ పెట్టకపోవడం ఏంటని అడిగాము. కనీసం 15 రోజులు ఈసారి సభ నడపాలని బీఆర్ఎస్ నుంచి అడిగాం. ప్రతిరోజూ జీరో అవర్ పెట్టాలని అడిగాం. టీషర్ట్‌లతో ఎందుకు రానియడం లేదని గట్టిగా అడిగాము. మీ నాయకుడు రాహుల్ గాంధీ టీ షర్ట్‌లతో వెళ్ళాడు కదా అని గుర్తు చేశాము. బీఏసీ అంటే బిస్కెట్ అండ్ చాయ్ లాగా చేశారు' అంటూ హరీష్ రావు వ్యాఖ్యలు చేశారు.బీఏసీ అంటే బిస్కెట్ అండ్ చాయ్ లాగా చేశారని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. స్పీకర్ ఛాంబర్ లో బీఏసీ భేటీ జరిగింది. ఈ సభలో సీఎం రేవంత్ రెడ్డి, మాజీ సీఎం హరీష్ రావు, ఎంఐఎం సభ్యులు హాజరయ్యారు. కాగా.. సభలో మీరు కేవలం సలహా మాత్రమే ఇవ్వాలని అనడంతో బీఆర్ఎస్ వాకౌట్ చేసిందన్నారు. ఇదే విషయంపై ఎంఐఎం కూడా వాక్ ఔట్ చేసిందని హరీష్ రావు తెలిపారు. సభ పని దినాలు అజెండాపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వడం లేదని నిరసన తెలిపామన్నారు. సభ గంటన్నర పాటు కొనసాగిందన్నారు. సభలో మంత్రి ప్రసంగిస్తున్న సమయంలో బీఆర్ఎస్ సభ్యులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్లకార్డులను ప్రదర్శించారు. దీంతో సభ్యుల వద్ద ప్లకార్డులను తీసుకురావాలని మార్షల్స్‌కు స్పీకర్ ఆదేశించారు. ప్లకార్డులను మార్షల్స్‌కు ఇస్తే మాట్లాడే అవకాశమిస్తామని స్పీకర్ సభ్యులకు సూచించారు. విపక్ష సభ్యుల నినాదాల మధ్య సభను రేపటికి వాయిదా వేశారు. శాసనసభలో బీఆర్ఎస్ నేతల తీరును ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబులు ఖండిం చారు. పర్యాటక అంశంపై మంత్రి మాట్లాడుతుంటే అడ్డుకున్నారని మండిపడ్డారు. సభా సంప్రదాయాలను విపక్షసభ్యులు పట్టించుకోవ ట్లేదని ఆక్షేపించారు.

సభా మర్యాదకు భంగం కలిగించడం సరికాదని భట్టి విక్రమార్క హితవుపలికారు. సభాపతిపై విపక్ష సభ్యులకు గౌరవం ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మరోవైపు శాసనసభలో బీఆర్ఎస్ నాయకులు ప్లకార్డులు ప్రదర్శిం చడాన్ని మంత్రి శ్రీధర్‌బాబు తప్పుపట్టారు. సభా సంప్రదాయాలను విపక్షాలు గౌరవించట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్పీకర్ ఆదే శాలను సభ్యులు పక్కనపెట్టడం సరికాదన్నారు. విపక్షాలు లేవనెత్తిన ప్రతి అంశంలో ప్రభుత్వం జవాబిస్తుందన్నారు. బీఏసీ భేటీలో విపక్షాలు అభిప్రాయాలు తీసుకున్నారని తెలిపారు. విపక్షసభ్యులు సభా సమయం వృథా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు మరో ఐదు రోజుల పాటు జరగనున్నాయి. ఈ మేరకు బీఏసీలో నిర్ణయం తీసుకున్నారు. ఈనెల 21 వరకు అసెంబ్లీ సమావేశాలు జరుగనున్నాయి.



# మాజీ ఎమ్మెల్యే కిషోర్ జన్మదినోత్సవం

## కేసీఆర్ ఆశీర్వాదం తీసుకున్న కిషోర్

వెలుతురు, హైదరాబాద్, డిసెంబర్ 16:
తన పుట్టినరోజు సందర్భంగా మాజీ రాష్ట్ర ముఖ్య మంత్రి కేసీఆర్ ను ఎర్రవెల్లి వ్యవసాయ క్షేత్రంలో కుటుంబ సమేతంగా కలిసి ఆశీర్వాదం తీసుకున్న తుంగతుర్తి మాజీ శాసనసభ్యులు డా. గాదరి కిశోర్ కుమార్, అదేవిధంగా మాజీ ఎమ్మెల్యే కిషోర్ కుమార్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఆయన స్నేహితులు రాపర్తి కరుణాకర్, కొండూరు భాస్కర్, రసమల్ల గణేష్. నీళ్ల లింగ స్వామి తదితరులు పాల్గొన్నారు.



# రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ముందు ధర్నా చేసిన సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు

వెలుతురు, రంగారెడ్డి జిల్లా, డిసెంబర్ 16:
రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ముందు సమగ్ర శిక్షణ ఉద్యోగ్య సంఘాల ఆధ్వర్యంలో రీలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేపట్టారు, అలాగే తమ డిమాండ్లను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని లేని పక్షంలో ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామన్నారు, తెలంగాణ రాష్ట్రంలో గత 12 రోజులుగా ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఇప్పుడైనా ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు, తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం మరీనా తమ సమస్య పరిష్కారం కాకుండా పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు, ఈ అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా రాష్ట్రంలో ఉన్న సమగ్ర శిక్షణ ఉద్యోగ నియామకాల ప్రక్రియను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు, అలాగే రాష్ట్ర ముఖ్య మంత్రి తమ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు

# జాబ్ క్యాలెండర్ ప్రకారమే నోటిఫికేషన్లు

### ఉద్యోగాల ఖాళీల అంచనా వేసి టీజీపీఎస్సీ ద్వారా పరీక్షలు

### డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

హైదరాబాద్, డిసెంబర్ 16 (వెలుతురు):
తెలంగాణలో ఉద్యోగాలకు సంబంధించిన నోటిఫికేషన్లు జాబ్ కేలండర్ ఆధారంగా ఉంటాయని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఉద్యోగాల ఖాళీలు అంచనా వేసి టీజీపీఎస్సీ ద్వారా పరీక్షలను నిర్వహిస్తామన్నారు. ప్రశ్నపత్రాల లీక్, మాల్ ప్రాక్టీస్ జరుగకుండా పారదర్శకంగా పరీక్షల నిర్వహణ చేపడుతున్నామని తెలిపారు. శాసన మండలిలో ఆయన మాట్లాడారు. ఉద్యోగాల భర్తీ కోసమే జాబ్ క్యాలెండర్ ప్రకటించామని దశలవారీగా భర్తీ చేస్తున్నామని వెల్లడించారు.



రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోస్టుల్లో నియామకాలు చేపడతామన్నారు. కాగా, 'అదిగో జాబ్ క్యాలెండర్.. ఇదిగో జాబ్ క్యాలెండర్' అంటూ నిరుద్యోగులను ఊరించిన రేవంత్‌రెడ్డి సర్కారు, ఈ ఏడాది ఆగస్టు 3న గత అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఖాళీల వివరాల్లేని.. నోటిఫికేషన్, పరీక్షల తేదీల్లేని జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించి ఉసూరుమనిపించింది. జాబ్ క్యాలెండర్‌లో మొత్తం 20 రకాల షెడ్యూళ్లను ప్రకటించగా వీటిలో అర్హత పరీక్ష అయిన టెట్ రెండు సార్లు ఉన్నది. మిగతా 18లో గ్రూప్-1, 2, 3 నోటిఫికేషన్లు గతంలో జారీ అయినవే కావడం గమనార్హం. పరీక్షలు మాత్రమే నిర్వహించాల్సి ఉన్న వీటిని కూడా కొత్త జాబ్ క్యాలెండర్‌లో ప్రకటించి కాంగ్రెస్ సర్కారు తన ఖాతాలో వేసుకున్నది. యూపీఎస్సీ ఏటా జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తుంది. నోటిఫికేషన్ తేదీ, దరఖాస్తు గడువు, రాత పరీక్ష తేదీ లాంటి పూర్తి వివరాలు అందులో పొందుపరుస్తుంది. కానీ రేవంత్ సర్కారు ప్రకటించిన జాబ్ క్యాలెండర్‌లో ఇవేవీ లేవు. కేవలం ఫలానా నెలలో నోటిఫికేషన్ ఇస్తాం.. ఫలానా నెలలో పరీక్ష నిర్వహిస్తామన్న వివరాలు మాత్రమే ప్రకటించారు.

# 'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్' అందరినీ ఏకం చేస్తుంది: జిష్ణు దేవ్ వర్మ


### 'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్' మూడు రోజుల ఫొటో ప్రదర్శనను ప్రారంభించిన తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

హైదరాబాద్ వెలుతురు పిఐబీ 16 డిసెంబర్, 2024:
హైదరాబాద్‌లోని సాలార్ జంగ్ మ్యూజియంలో మూడు రోజుల పాటు నిర్వహించే 'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్' ఫొటో ప్రదర్శనను తెలంగాణ గవర్నర్ శ్రీ జిష్ణుదేవ్ వర్మ ఈ రోజు ప్రారంభించారు. ఇంటిగ్రేటెడ్ కమ్యూనికేషన్ అండ్ అవుట్‌రీచ్ ప్రోగ్రాం (ఐసీఓపీ)లో భాగంగా సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్, హైదరాబాద్ ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది.

ఈ సందర్భంగా సభనుద్దేశించి గవర్నర్ శ్రీ జిష్ణుదేవ్ వర్మ ప్రసంగిస్తూ సర్దార్ వల్లభాయ్ పటేల్ గౌరవార్థం... రెండేసి రాష్ట్రాలను ఒక దగ్గరకు తీసుకురావడం ద్వారా వాటి మధ్య సంస్కృతిక సంగమం ఉండాలన్న ఆలోచనకు తొలిసారిగా ప్రధానమంత్రి రూపకల్పన చేశారని అన్నారు. అన్ని సంస్థానాలను ఏకం చేయడంలోనూ, జాతీయ ఐక్యతను పెంపొందించడంలోనూ సర్దార్ పటేల్ కీలకపాత్ర పోషించారని అన్నారు. రాష్ట్రాలను అనుసంధానించాలనే ఆలోచన గొప్పదిగా అభివర్ణించిన ఆయన, ఈ ప్రదర్శనకు హాజరైన వారికి భారతీయ సంస్కృతికి సంబంధించిన అనేక విషయాలను తెలుసుకునే అవకాశం లభిస్తుందని అన్నారు. భారతదేశం భిన్నత్వంతో కూడిన విశిష్టమైన నాగరికత, ఇది జాతీయ చైతన్యాన్ని పెంచుతుంది. ఈ వైవిధ్యం వివిధ నృత్య రీతులు, సంగీతం, కళ, పండుగలతో వెల్లివిరుస్తోంది. అంతర్లీనంగా ఉన్న ఏక్య భావన సమష్టిగా అభివృద్ధి సాధించేందుకు శక్తినిస్తుంది.

సరైన ఆలోచన, సరైన పనులు, సరైన చర్యలు చేయాలని సూచిస్తున్న ధర్మభావనను భారతదేశం అవలంబిస్తోందని శ్రీ దేవ్ వర్మ అన్నారు. ప్రతి సంస్కృతి ఇదే భావనను ప్రతిబింబిస్తోందని తెలిపారు. ప్రతి రాష్ట్రాన్ని అనుసంధానించడం సవాలే అయినప్పటికీ ఈ ఆధునిక పండగలు.. కూడా ఏక్య భావనతో ఉన్నాయన్నారు. ఉదాహరణకు తెలంగాణలో జరిగే బతుకమ్మలాంటి పండుగ హర్యానాలోనూ జరుపుకుంటూ ఉండొచ్చు. పండుగ చేసుకునే విధానం వేరైనప్పటికీ భావం ఒకటే అయి ఉండొచ్చని



అభిప్రాయపడ్డారు.

రాష్ట్రాలను జత చేయాలనే కార్యక్రమం ప్రత్యేకంగా ఉందని, ముఖ్యంగా ఇది చిన్నారులకు, పెద్దలకు ప్రయోజనం కలిగిస్తుందని ఆయన అన్నారు. వాతావరణం, సంస్కృతి, ఆహారంలో వైవిధ్యం ఉన్నప్పటికీ హర్యానా, తెలంగాణ లాంటి రాష్ట్రాల మధ్య సారూప్యతలను లోతుగా అన్వేషించేలా ఈ ప్రదర్శన ప్రోత్సహిస్తుందని, పురావస్తు ప్రదేశాలు, సాంస్కృతిక పద్ధతులు ఈ సంబంధాన్ని వెల్లడిస్తాయని వివరించారు.

దేశంలో ఏ రెండు రాష్ట్రాలు ఒకేలా లేనప్పటికీ, భారత్ మూలవిలువలైన సరైన ఆలోచన, సరైన పని, సరైన మార్గం- వైవిధ్యమైన సంస్కృతులు, పాటలు, పండగల్లో స్థిరంగా కనిపిస్తూనే ఉంటాయి. రుగ్వేదంలోని “ఏకం సత్ విప్ర బహుధా వదంతి” అంటే “సత్యం ఒక్కటే: కాని దాన్ని పండితులు భిన్నమైన పద్ధతుల్లో చెబుతారు” అనే సూక్తిని ఈ ప్రదర్శన కళ్లకు కట్టినట్టు వివరిస్తుందని తెలిపారు.

నేషనల్ మ్యూజియం, న్యూఢిల్లీ అదనపు డైరెక్టర్ జనరల్, సాలార్ జంగ్ మ్యూజియం డైరెక్టర్ శ్రీ ఆశీష్ గోయల్, తన ప్రారంభోపన్యాసంలో మాట్లాడుతూ, హర్యానా సంస్కృతిని తెలంగాణ ప్రజలకు చేరువ చేయడమే ఈ ఎగ్జిబిషన్ లక్ష్యమని అన్నారు. దేశంలో పెద్ద సంఖ్యలో సందర్శకులను సాలార్ జంగ్ మ్యూజియం ఆకర్షిస్తుందని, ఏటా పది లక్షల మంది సందర్శిస్తారని వెల్లడించారు. మ్యూజియం సందర్శకులకు మెరుగైన, సౌకర్యవంతమైన, ఆకర్షణీయమైన అనుభవాన్నిచ్చేందుకు ఏర్పాటు చేసిన మూడు సెల్ఫ్ టికెటింగ్ కియోస్కులను గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఈ రోజు ప్రారంభించారు.

సాలార్ జంగ్ మ్యూజియం డైరెక్టర్, ఐఐఎస్ అధికారి శ్రీ ఆశిష్ గోయల్.. పత్రికా సమాచార కార్యాలయం, సెంట్రల్ బ్యూరో కమ్యూనికేషన్ విభాగాల అదనపు డైరెక్టర్ జనరల్ శ్రీమతి శృతి పాటిల్, మ్యూజియంను సందర్శిస్తున్న గవర్నర్ వెంట ఉన్నారు. 'ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్' కార్యక్రమంలో భాగంగా జత కూర్చిన తెలంగాణా - హర్యానాలకు సంబంధించిన చిత్రకళ, సాంస్కృతిక రూపాలు, వంటలు తదితర అంశాలను ప్రదర్శిస్తున్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాలూ, కేంద్రపాలిత ప్రాంతాల ప్రజల మధ్య అనుసంధానం, పరస్పర అవగాహన పెంపు లక్ష్యంగా 'ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్' కార్యక్రమాన్ని ప్రారంభించారు. భాషా, సంస్కృతులు, మతపరమైన గుర్తింపులనే విభిన్నమైన దారాలతో అల్లిన అందమైన తివాసి వంటి భారతదేశ సంస్కృతి, సంకీర్ణమైన జాతీయతా భావానికి ప్రతీకగా నిలుస్తోంది. ఉమ్మడి సంస్కృతీ సంప్రదాయాల ఆవిర్భావం.. అహింస, న్యాయమనే పునాదులపై నిర్మించిన స్వాతంత్ర్య పోరాటం వంటి కారణాలు, భిన్నత్వంలో ఏక్య సాధనకు తోడ్పడ్డాయి. ఇటువంటి ఉన్నతమైన సంస్కృతిని భవిష్యత్తు తరాల కోసం పరిరక్షించవలసిన అవసరం ఎంతైనా ఉంది.

జట్టుగా చేసిన రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల మధ్య అనుసంధానం, పరస్పర అవగాహన పెంచాలని 'ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్' కార్యక్రమం భావిస్తోంది. భాష, సాహిత్యం, వంటలు, పండుగలు, సాంస్కృతిక కార్యక్రమాలు, పర్యాటకం తదితర అంశాల్లో క్రమ పద్ధతిలో చేపట్టే పరస్పర అవగాహనా కార్యక్రమాల ద్వారా ఒక ప్రాంతం వారు మరో ప్రాంతం గురించి చక్కని అవగాహన పొందగలిగే అవకాశం కలుగుతుంది. కార్యక్రమంలో భాగంగా తెలంగాణా రాష్ట్రాన్ని హర్యానా రాష్ట్రంతో అనుసంధానించారు.

భారత ప్రభుత్వ సమాచార ప్రసార మంత్రిత్వశాఖ విభాగమైన కేంద్రీయ కమ్యూనికేషన్స్ బ్యూరో (సీబీసీ), మూడు రోజుల ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ కార్యక్రమాన్ని హైదరాబాద్ నగరంలోని సాలార్జంగ్ మ్యూజియంలో ఏర్పాటు చేసింది. ఇందులో తెలంగాణా-హర్యానా రాష్ట్రాలకు చెందిన విభిన్న ఛాయాచిత్రాలను ప్రదర్శిస్తారు. జోడీ రాష్ట్రాల కళారూపాలు, ఆహారం, పండుగలు, స్మారక చిహ్నాలు, ప్రసిద్ధ పర్యాటక స్థలాలు సహా పలు అంశాలతో కూడిన 50 ప్యానళ్ళను ప్రదర్శిస్తున్నారు.. వీటి ద్వారా ఆయా అంశాల్లో ఇరు రాష్ట్రాల మధ్య గల సారూప్యత, భిన్నత్వం తేటతెల్లమవుతుంది.

కార్యక్రమంలో భాగంగా చిత్రకళ, కవిత్వం, రంగస్థలం వంటి విభిన్న అంశాలపై నిపుణుల ప్రసంగాలను ఏర్పాటు చేశారు. డిసెంబర్ 17 జరిగే కార్యక్రమంలో పద్మశ్రీ పురస్కార గ్రహీత శ్రీ మహమ్మద్ అలీ బేగ్, సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత శ్రీ గోరటి వెంకన్న వంటి ప్రముఖులు విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తారు. డిసెంబర్ 16,17,18 తేదీల్లో ఈ కార్యక్రమాలను ప్రజలు సందర్శించవచ్చు.

# మీర్‌పేట్‌లో డ్రగ్స్ ముఠా అరెస్ట్

వెలుతురు, ఎల్ బి నగర్, డిసెంబర్ 16:
రాచకొండ కమిషనరేట్ పరిధిలోని మీర్ పేట్ లో పోలీసులు డ్రగ్స్ విక్రయిస్తున్న ముఠా గుట్టు రట్టు చేసి ముగ్గురి అరెస్ట్ చేసినట్లు గా రాచకొండ పోలీస్ కమీషనర్ సుధీర్ బాబు వెల్లడించారు, మీర్ పేట్ లో కోటి 25 లక్షల విలువైన 53 కిలోల డ్రగ్స్ ను ఎల్ బి నగర్ ఎస్ఓటి పోలీసులు వల పన్ని ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు.



వీరంతా రాజస్థాన్ రాష్ట్రంకు చెందిన మంగి లాల్, మంకీ లాల్,బెస్టియా లు మధ్య ప్రదేశ్ రాష్ట్రంకు చెందిన పింటూ నుంచి డ్రగ్స్ ను కొనుగోళ్లు చేసి హైదరాబాద్ నగరం లో విక్రయిస్తారని కమిషనర్ సుధీర్ బాబు తెలిపారు, రాచకొండ పోలీసులు డ్రగ్స్ పై



ఉక్కు పాదం మోపి డ్రగ్స్ ను రాచకొండ కమిషనరేట్ పరిధిలో డ్రగ్స్ ను నిర్మూలించడమే లక్ష్యంగా పని చేస్తున్న పోలీసులను కమిషనర్ అభినందించారు.
ఈ కార్యక్రమంలో ఎల్ బి నగర్, మీర్ పేట్ పోలీసులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పాలనలో ఒక్కరూపాయి కూడా ఇవ్వడం లేదు

### బీఆర్ఎస్ పాలనలో గ్రామాలు, పట్టణాల అభివృద్ధికి కోట్లాది రూపాయలు

### కాంగ్రెస్ నిర్లక్ష్యంతో కుంటుపడుతున్న గ్రామాలు, పట్టణాలు

### చిన్నచిన్న బిల్లులు చెల్లించటానికి కూడా కాంగ్రెస్ పేచీ : మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు

హైదరాబాద్, డిసెంబర్ 16 (వెలుతురు):
బీఆర్ఎస్ పాలనలో పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి కార్యక్రమం పెట్టి ప్రతి నెల గ్రామాలకు 275 కోట్లు, పట్టణాలకు 150 కోట్లు ఇచ్చామని మాజీ మంత్రి తన్నీరుహరీశ్‌రావు అన్నారు. కానీ కాంగ్రెస్‌ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ ఏడాది కాలంలో పల్లె, పట్టణ ప్రగతి కింద ఒక్క రూపాయి కూడా గ్రామపంచాయతీలకు ఇవ్వడం లేదని విమర్శించారు. గ్రామపంచాయతీలను కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యం చేయడంతో తెలంగాణ పల్లెలకు పోతే చికన్ గున్యా వంటి వ్యాధులు వస్తాయని అమెరికా తన పౌరులను హెచ్చరించే స్థాయికి పరిస్థితి వెళ్లిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనినిబట్టి కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు తెలిసిపోతున్నదని మండిపడ్డారు. అసెంబ్లీ ప్రశ్నోత్తరాల్లో భాగంగా సర్పంచులకు పెండింగ్ బిల్లులపై హరీశ్‌రావు ప్రశ్నలేవనెత్తారు. దీనికిగాను మంత్రి సీతక్క సర్పంచ్‌లకు చెల్లించాల్సిన బిల్లులు రూ.691 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. దీనిపై హరీశ్‌రావు మాట్లాడుతూ.. బడా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తున్నారు, కానీ చిన్న కాంట్రాక్టర్లకు సంవత్సరకాలం నుంచి 691



కోట్లు నిధులు ఇవ్వకుండా సర్పంచులు, ఎంపీటీసీలను ప్రభుత్వం గోస పెడుతున్నదని విమర్శించారు. చివరికి వారు గవర్నర్, మంత్రులను కలిసి మొరపెట్టుకున్నారని అయినా లాభం లేదని చలో అసెంబ్లీకి పిలుపునిస్తే వారిని అరెస్టు చేస్తున్నారని చెప్పారు. 'బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ పల్లెలు అద్భుతంగా కేసీఆర్ నాయకత్వంలో తీర్చిదిద్దబడ్డాయి. పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి కార్యక్రమం పెట్టి ప్రతి నెల గ్రామాలకు 275 కోట్లు, పట్టణాలకు 150 కోట్లు ఇచ్చాం.
కానీ కాంగ్రెస్‌ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ ఏడాది కాలంలో పల్లె, పట్టణ ప్రగతి కింద ఒక్క రూపాయి కూడా గ్రామపంచాయతీలకు ఇవ్వకపోవడంతో ఈ సమస్య వచ్చింది. కేంద్ర ప్రభుత్వం దేశంలో ఉత్తమ గ్రామ పంచాయతీయల అవార్డులను ప్రకటిస్తే వాటిలో టాప్ 20లో 19 తెలంగాణ గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఈ ఘనత కేసీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వానిది. ఆ రకంగా పల్లెలను చేశాం. ప్రతి గ్రామపంచాయతీకి ట్రాక్టరు, ట్యాంకరు, ట్రాలీ, నర్సరీ, డంప్‌యార్డ్, వైకుంఠధామం పెట్టి తెలంగాణ పల్లెలను దేశానికి ఆదర్శంగా నిలిపాం. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎస్ఎఫ్‌సీ నిధులు విడుదల కావడం లేదు, కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఈజీఎస్ నిధులు, 15వ ఫైనాన్స్ కమిషన్ నిధులను దారిమళ్లించారు. జీపీ జనరల్ ఫండ్స్.. వాళ్ల డబ్బులు వాళ్లు ఖర్చుపెట్టుకోవడానికి ఆర్థికశాఖ క్లియరెన్స్ ఇవ్వకపోవడంతో చెక్కులు పాసవకపోవడంతో నేడు సర్పంచులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వచ్చింది. అప్పులు చేసి, బంగారం కుదవపెట్టి పనిచేస్తే బిల్లులు ఇవ్వరా. ఒక్క నవంబర్ నెలలో బడా కాంట్రాక్టర్లకు రూ.1200 కోట్ల బిల్లులు ఇచ్చారు. రూ.5 లక్షలు, రూ.10 లక్షల పనులు చేసిన చిన్న కాంట్రాక్టర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీల బిల్లులను చెల్లించకుండా పగబట్టి, కక్షతో వారిని ఇబ్బంది పెడుతున్నారు. గ్రామ పంచాయతీలకు క్రమంతప్పకుండా ఇవ్వాల్సిన నిధులు ఇవ్వకపోవడంతో తెలంగాణకు పోతే చికన్‌గున్యా వ్యాధులు వస్తున్నాయని అమెరికా తన పౌరులను హెచ్చరించే స్థితికి పరిస్థితి తీసుకొచ్చారు. దీనిని బట్టి పల్లెలను కాంగ్రెస్ సర్కార్ ఏవిధంగా నిర్లక్ష్యం చేసిందో అర్థమవుతుంది. ఇది మన రాష్ట్రానికే కాదు, మన దేశానికే అవమానం. మీ పాలన ఈ విధంగా ఉన్నది. సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు దిగిపోయి తొమ్మిది నెలలైనా ఇంకా వారికి జీతాలు చెల్లించలేదు. ఒకటో తేదీన జీతాలిస్తున్నమని గొప్పగా చెబుతరు.. కానీ జెడ్పీ చైర్మెన్లకు జెడ్పీటీసీలు, ఎంపీటీలకు ఇంప్పటికీ వారికి మూడు నెలల జీతాలు పెండింగ్‌లో ఉన్నాయి. వారికి స్పష్టమైన తేదీ చెప్పాలి. పంచాయతీ ఎన్నికలలోపు వారికి జీతాలు చెల్లించాలి. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో రాజీవ్‌గాంధీ తెచ్చిన 73, 74 రాజ్యాంగ సవరణ ప్రకారం, గ్రామపంచాయతీలను బలోపేతం చేస్తామన్నరు. క్రమంతప్పకుండా నిధులు విడుదల చేస్తామన్నారు.

మాజీ సర్పంచులు, జెడ్పీటీసీలకు పింఛన్లు ఇస్తామన్నరు. అవేమీ చేయకుండా కనీసం జీతాలు కూడా ఇస్తాలేరు. వారి జీతాలు, పెండింగ్ నిధులను ఎప్పటిలోగా క్లియర్ చేస్తరో స్పష్టంగా చెప్పాలని' హరీశ్‌రావు డిమాండ్ చేశారు. కాగా, సర్పంచుల పెండింగ్ బిలులపై ప్రభుత్వం సరైన సమాధానం ఇవ్వకపోవడంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సభ నుంచి వాకౌట్ చేశారు.

# సంపాదకీయం

## రక్షణ కవచం - నిర్లక్ష్యం ఫలితం

నేటి ఉరుకుల పరుగుల జీవితంలో ప్రయాణం ప్రమాదకరమైనదిగా మారింది. ఇటీవల కాలంలో పెరుగుతున్న ఘటనలు ..మన ముందున్న లెక్కలు ఈ విషయం చెబుతున్నాయి. ముఖ్యంగా టూవీలర్ ప్రమాదలు ఎక్కువగా జరుగుతున్నాయి. వాహన ప్రమాదాలలో చనిపోతున్న వారు కూడా ద్విచక్ర వాహనదారులే అధికం. దీనికి వారి నిర్లక్ష్యం కూడా కారణమవుతోంది. బైక్ నడపడంలో తాము నేర్పరులమని, హెల్మెట్ అవసరం లేదని, ఇది శిరోభారమని భావించేవారు మనలో చాలా మందే ఉన్నారు. హెల్మెట్ భారం కాదు అది ఒక రక్షణ కవచం.

యువత బైక్ ఎక్కితే చాలు రయ్ రయ్ మని దూసుకుపోతుంటారు. మితిమీరిన వేగం, మద్యం మత్తులో నడపడం, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించడం పరిపాటిగా మారింది. ఇటీవల యువత సెల్‌ఫోన్ డ్రైవింగ్, రాంగ్‌రూట్, ఓవర్‌టేక్ చేయడం, నిర్లక్ష్యంగా హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ చేస్తూ ప్రాణాలు తీసుకుంటున్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడుపుతున్న సంఘటనలు ఇటీవల ఎక్కువయ్యాయి. శరీరానికి తలకాయ ప్రధానం, ఇంద్రియాలలో నైనం ప్రధానం, షడ్రుచులలో ఉప్పు ప్రధానం, నదులకు నీరు ప్రధానం’ అని సుభాషిత రత్నావళి చెబుతుంది. కానీ, శిరస్సుకు శిరస్త్రాణం ప్రధానం అని జీవితం చెబుతుంది. ఉరుకుల పరుగుల జీవితంలో వేగానికున్న ప్రాధాన్యత భద్రతకు ఇవ్వకపోవడంతో భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది. హెల్మెట్ లేకపోతే ఏమౌతుందిలే

అన్న చిన్నపాటి నిర్లక్ష్యం వల్ల ఎంతోమంది యువకులు ప్రాణాలను కోల్పోతున్నారు. దేశంలో ఏడాదికి సగటున 1.78లక్షల మంది రోడ్డు ప్రమాదాలలో మరణిస్తున్నారని, అందులో 60మంది 18నుంచి 34 ఏళ్లలోపు వారేనని సాక్షాత్తూ కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఇటీవల లోక్‌సభలో వెల్లడించారు. దేశంలో ప్రతి గంటకూ దాదాపు 53 ప్రమాదాలు, 19 మరణాలు జరుగుతున్నాయి. దీనిలో 45శాతం ద్విచక్ర వాహన ప్రమాదాలే. దేశంలో ప్రస్తుతం యువ జనాభా ఎక్కువగా వుంది. అయితే, ప్రస్తుతం 15 ఏళ్ల లోపు వున్న బాలల శాతం 2036 నాటికి గణనీయంగా తగ్గనుందని ’భారతదేశంలో మహిళలు-పురుషులు 2023’ నివేదిక వెల్లడిస్తోంది. దీనికంటే ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే ద్విచక్ర వాహన ప్రమాదాలలో చనిపోతున్న వారిలో ఎక్కువ మంది యువతే కావడం. తెలుగు రాష్ట్రాలలో హెల్మెట్ ధరించకుండా బైక్‌లు నడుపేవారి సంఖ్య అధికంగా ఉంది. హెల్మెట్ ధారణ తప్పనిసరి చేయాలని ఎ.పి హైకోర్టు గతంలోనే స్పష్టం చేసింది. తాజాగా ’హెల్మెట్ పెట్టుకోకపోవడం వల్ల ప్రమాదాలు పెరుగుతున్నా యని, గత జూన్ నుంచి సెప్టెంబర్ మధ్యకాలంలో హెల్మెట్ ధరించకపోవడం వల్ల ఏపీలో 667 మంది చనిపోయారని’ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. హెల్మెట్ వినియోగించేలా చేయడంలో పోలీసులు కఠినంగా వ్యవహరించకపోవడం వల్లే అంతమంది చనిపోయారని, పోలీసుల అలసత్వం వల్లే ఈ పరిస్థితి నెలకొందని హైకోర్టు వ్యాఖ్యానించింది. ఒక పరిమితి వరకే బండి వేగం మన చేతుల్లో వుంటుంది. ఆ పరిమితి దాటితే ఆ వేగాన్ని కంట్రోల్ చేయడం కష్టం. వేగాన్ని నియంత్రిం చుకోలేకపోతే అది ప్రమాదానికి దారితీస్తుంది. ద్విచక్ర వాహనదారులు కచ్చితంగా హెల్మెట్ పెట్టుకోవాలని ’మోటారు వాహనాల చట్టం 1998లోని 129, 177 సెక్షన్లు చెబుతున్నాయి. దీని ప్రకారం జరిమానా విధించడమే కాదు, డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేసే అవకాశం కూడా వుంటుంది. మనం ప్రయాణించే రోడ్డు రేస్ ట్రాక్ కాదు. వాహనం ఎక్కగానే రేసింగ్ మూడ్‌లోకి వెళ్లిపోవడం వల్ల కోరి ప్రమాదాన్ని తెచ్చుకోవడమే అవుతుంది. టైర్లు, బ్రేకులు, బైక్ కండిషన్ పట్ల శ్రద్ధ పెట్టాలి. చాలావరకు రోడ్డు ప్రమాదాలు, టైర్లు, బ్రేకులు విఫలమవడం వల్లనే జరుగుతాయి. హెల్మెట్ ధరిస్తే? ప్రాణాలు కోల్పోకుండా కనీసం గాయాలతోనైనా బయటపడే అవకాశం వుంటుంది. హెల్మెట్లు ప్రమాదాలలో మరణాన్ని నివారించగలవు, నిరోధించగలవు. అయితే, అది మాత్రమే చాలదు. బైక్ నడిపేటప్పుడు నిర్లక్ష్యంగా వ్యవహరించడం మీకే కాదు, తోటి ప్రయాణీకులకు కూడా ప్రమాదమే నన్న విషయం గుర్తించాలి.





## పావురాలతో మనుషులకు ప్రమాదమా?

నగర వాతవరణంలో పక్షుల మనగడ కష్టమవుతోంది. ఇప్పటికే అనేక రకాల పక్షులు నగరాల్లో కనుమరుగయ్యాయి. అయితే పావురాలకు మాత్రం ఇది వర్తించదు. పల్లె ప్రాంతాల్లో కన్నా నగరా ల్లోనే మనం పావురాను ఎక్కువగా చూస్తాం. సిటీస్‌లో వాటికి నీరు, ఆహారం అందుబాటులో ఉంటాయి. వాటిని చంపితినే జంతువులు దాదాపు ఉండవు. ఉన్నా చాలా తక్కువ. వీటికి తోడు ఎత్తయిన బిల్డింగులు, కిటికీలు, పైకప్పులు, వంతెనలు, ఫ్లైఓవర్లు, గోదాములు..ఇలా ఒకటేంటి, అవి నివసించడానికి ఎన్నో అనువైన ప్రదేశాలున్నాయి. అయితే, మెట్రో సిటీస్‌లో వీటి సంఖ్య పెరగటం మనుషులకు ప్రమాదంగా పరిణమిస్తోంది. పావురాల వల్ల కలిగే ఆరోగ్య ప్రమాదాలను పరిగణనలోకి తీసుకున్న పుణె మున్సిపల్ కార్పొరేషన్, వాటిని పోషించే వారిపై చర్యలు ప్రారంభించింది.

పావురాల రెట్టలు, ఈకలు శ్వాసకోశ ఇన్ఫెక్షన్లకు కారణమవుతాయి. వీటితోపాటు చర్మ సమస్యలు, అలర్జీలు, సైనసైటిస్ ప్రమాదం పెరుగుతుంది. కానీ, ఏదైనా ఒక జీవి జనాభా విపరీతంగా పెరిగితే అది పర్యావరణంపైనా ప్రభావం చూపుతుంది. పావురాల సంఖ్య పెరగడం పర్యావరణంలో అసమ తుల్యతకు సంకేతం. పావురాలు స్థానిక జాతులే. ఇళ్లలో పెంచుకోవడానికి పావురాలను మనుషులు అడవుల నుంచి గ్రామాలు, పట్టణాలకు తీసుకొచ్చారు. అంతకు ముందు అవి కొండా కోనల్లో తిరుగుతూ, పెద్ద పెద్ద బండరాళ్ల మధ్య గూళ్లు పెట్టుకుని జీవించేవి. చిన్న చిన్న పురుగులు, పండ్లు తిని బతికేవి. వీటి రెట్టల ద్వారా పండ్ల విత్తనాలు అడవి అంతటా వ్యాపించేవి. కానీ, ఇప్పుడు పక్షులకు అడవులలో తిండి సరిగా దొరకడం లేదు. పావురాలను డేగలు, గద్దలు వేటాడి చంపి తింటుంటాయి. తోడేళ్లు, నక్కలకు కూడా ఇవి చాలా ఇష్టమైన ఆహారం. తరచూ మనుషులు కూడా వీటిని వేటాడుతుంటారు. ఇంతకు ముందు ఈ పక్షులు అడవుల్లో చాలా ఎక్కువగా ఉండేవి. ఇప్పుడు చాలా తగ్గాయి.


నగరాల్లో వీటికి శత్రువులు పెద్దగా లేకపోవడం, రక్షణ ఎక్కువగా ఉండటం వాటి సంఖ్య పెరగడానికి కారణమైంది. పైగా ప్రజలు వాటికి తిండిగింజలు వేస్తూ వేటాడే శ్రమను తగ్గిస్తున్నారు. దీంతో సహజంగానే సంతానోత్పత్తి సులభమవుతోంది. పౌల్ట్రీలలో కోళ్లు పెరిగినట్లే, ఇక్కడ పావురాలు కూడా పెరుగుతున్నాయి. నగరాలు పెద్ద పౌల్ట్రీఫ్రామ్‌గా మారాయి. పావురాల సంఖ్య పెరిగేకొద్దీ ప్రకృతిలోని ఇతర జీవులపై దాని ప్రభావం పడుతుంది. ఇవి తమకంటే చిన్నసైజులో ఉండే పిచ్చుకల్లాంటి వాటిని వేధిస్తుంటాయి. అవి కట్టుకున్న గూళ్లను ఆక్రమిస్తుంటాయి. వాటి ఆహారాన్ని తినేస్తాయి. దీనివల్ల ఆహారపు కొరతతో చిన్నపక్షులు నశిస్తుంటాయి. ఒక్క పావురానిదే కాదు, ఏ పక్షి మల మూత్రాలైనా మన చుట్టూ ఎక్కువగా ఉంటే, అవి మనిషి ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయి.

ఇక, పర్యావరణంలో పావురాలు కూడా కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, అవి పెద్ద సంఖ్యలో పెరగడం వల్ల ప్రకృతి సమతుల్యత దెబ్బతింటుందని పర్యావరణవేత్తలు చెబుతున్నారు. ఏ ప్రదేశంలో ఎన్ని పక్షులు నివసించాలి అన్నదానిపై ఒక నిర్దిష్ట పరిమితి ఉంది. ఒక రకం జీవరాశి అధికంగా పెరిగితే, దానివల్ల ఇతర జీవులకు లభించే ఆహారం, నివాసం, ఎగిరే స్థలం తగ్గుతాయి. అది వాటి జనాభా మీద ప్రభావం చూపిస్తుంది. పావురాలు అన్ని పరిస్థితులను తట్టుకుంటాయి. కొన్ని ఇతర పక్షుల మాదిరిగా కాకుండా, ఏ సమయంలోనైనా గుడ్లు పెట్టి సంతానోత్పత్తి చేయగలవు. నివాసానికి అనుకూల స్థలం, పుష్కలంగా ఆహారం, వేటాడే జంతువులు లేకపోవడంలాంటివి పావురాలు విపరీతంగా పెరగడానికి కారణమవుతున్నాయి. ఇప్పుడు నగరాలలో చాలా ప్రాంతాలను పావురాలు ఆక్రమించినట్లు కనిపిస్తుంది. వీటి కారణంగానే కాకులు, పిచ్చుకల్లాంటి కొన్ని పక్షులు కనిపించకుండా పోతున్నాయి. అయితే పావురాల సంఖ్య పెరగడం వల్లే ఇతర పక్షుల తగ్గిపోతున్నాయని చెప్పడం పూర్తిగా నిజంకాకపోవచ్చు. పట్టణీకరణతోపాటు, మరికొన్ని ఇతర కారణాల వల్ల కూడా ఇలాంటి పక్షులు కనుమరుగవుతున్నాయి. ఈ రెండింటిలో ఏది ఎంత వరకు కారణమన్నదాన్ని పరిశోధించాల్సి ఉంది.

# కల్లుగీత కార్మికులకు ఏడాది పాలనలో ఏమి చేశారు..?

తెలంగాణ రాష్ట్రంలో కల్లు గీత వృత్తిపై ఆధారపడి సుమారు 5 లక్షల కుటుంబాలు జీవిస్తున్నారు. వృత్తిలో విపరీతమైన ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ బ్రతుకుతెరువు కోసం ధైర్యం చేసి వృత్తిని కొనసాగిస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కంటే మెరుగైన విధానాలు కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తుందేమో అని సంక్షేమ పథకాల ద్వారా సహకరిస్తుందేమో అని ఆశగా ఎదురుచూస్తున్నారు. ఎన్నికల ప్రణాళికలో ప్రకటించిన వాటిని అమలు చేయాలని అడుగుతున్నారు.

ఏ వృత్తిలో లేని ప్రమాదాలు కల్లుగీత వృత్తిలో జరుగుతున్నాయి. ఈ పది సంవత్సరాల కాలంలో 5400 మంది ప్రమాదానికి గురయ్యారు. వీరిలో 775 మంది చనిపోయారంటే ఎంత ప్రమాదమో అర్థం చేసుకోవచ్చు. వీటిని పాలకులు, రాజకీయ పార్టీలు అర్థం చేసుకొని నివారించడానికి తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



- కల్లు ప్రకృతి పానీయం. అనేక ఔషధ గుణాలు కలిగినటు వంటిది. స్వచ్ఛమైన కల్లు ఆరోగ్యానికి ఎంతో మంచిది. శీతల పానీయాలు థమ్స్ అప్, కోకో కోల లాంటివి, లిక్కర్ లాంటివి వాడడం వల్ల అనేక రకాల జబ్బులు వస్తు న్నాయి. ఆరోగ్యం దెబ్బతినడంతో పాటు ఆర్థికంగా కుంగిపోతున్నారు. మద్యం మత్తులో అరాచకాలు పెచ్చరిల్లు తున్నాయి. మహిళలపై అత్యాచారాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. వీటిని నివారించి ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

ఈ ఏడాది కాలంలో రాష్ట్ర ప్రభుత్వం గీత కార్మికులకు చేసిందేమిటో పరిశీలిస్తే..

- బెల్ట్ షాపులు పెట్టి మద్యం అమ్ముతే బెల్ట్ తీస్తామని సీఎం రేవంత్ రెడ్డి అనేక సభలలో ఉద్యోగ భరితంగా ఉపన్యాసం ఇచ్చారు. ఎన్నికల ప్రణాళికలో బెల్ట్ షాపులు పూర్తిగా లేకుండా చేస్తామన్నారు. కానీ ఆచరణలో అమలు చేయడం లేదు. అదాయం పెంచుకోవడం కోసం ఎక్సైజ్ శాఖా అధికారులకు టార్గెట్లు పెట్టి లిక్కర్ అమ్మకాలు పెంచుతున్నారు.
- వృత్తిలో ప్రమాదాలను నివారించడానికి కాటమయ్య రక్షణ కవచం పేరుతో సేఫ్టీ కిట్టును జూలై 14వ తేదీన అబ్దుల్లాపూర్ మెట్ లోని లష్కర్ గూడాలో గీత కార్మికుల తో సభ నిర్వహించి ముఖ్యమంత్రి విడుదల చేశారు. అన్ని గౌడ, కల్లు గీత సంఘాలు ఈ సభలో పాల్గొని హర్షం వ్యక్తం చేశాయి. ఇప్పటివరకు ఈ ఐదు నెలల కాలంలో పదివేల మందికి ఎలా వాడాలో ట్రైనింగ్ ఇప్పించి ఈ రక్షణ కవచం పంపిణీ చేశారు. ప్రభుత్వ లెక్కల ప్రకారమే సభ్యత్వం కలిగిన వాళ్లు 2 లక్షల 50 వేల మంది ఉన్నారు. సభ్యత్వం లేకుండా వృత్తి చేసే వాళ్ళు కూడా పెద్ద సంఖ్యలో ఉన్నారు. కొన్ని గ్రామాల వారికి ఇంకా రాలేదు. వచ్చిన గ్రామాలలో రెండు మూడు సూత్రమే ఇచ్చారు. మిగతా వాళ్లంతా ఎప్పుడు ఇస్తారా అని ఎదురుచూస్తున్నారు. ఈ ఐదు నెలల కాలంలోనే 16 మంది గీత కార్మికులు ప్రమాదవశాత్తు చెట్టు పైనుండి పడి చనిపోయారు. రక్షణ కవచం ఇచ్చి ఉంటే బతికేవాడు కదా అని ఆ కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జనవరి నుండి మళ్లీ వృత్తి సీజన్ ప్రారంభం అవుతుంది ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది అందుకని మిగతా పథకాలు ఎలా ఉన్నా దీనికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించి త్వరితగతిన ఈ పథకం పూర్తి అయ్యేవిధంగా ప్రభుత్వం కృషి చేయాల్సిన అవసరం ఉంది. ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రతిష్టాత్మకంగా ఆవిష్కరించిన ఈ రక్షణ కవచం అందరి గీత కార్మికుల చేతులకు అందేలా చూడాలి. ప్రమాదాలు నివారించి వారి ప్రాణాలను కాపాడాలి.
- ఈ ఏడాది కాలంలో చనిపోయిన వారి కుటుంబాలకు, వికలాంగులైన వారికి ప్రభుత్వం ఇవ్వాల్సిన ఎక్స్‌గ్రేషియా 7 కోట్ల 90 లక్షల రూపాయలు ఇప్పటివరకు బాధితులకు అందలేదు. జూలై 14 న జరిగిన సభలో ముఖ్యమంత్రి స్వయంగా మాట్లాడుతూ ఈ డబ్బులు వెంటనే ఇప్పుడే విడుదల చేస్తామని చెప్పారు. ఐదు నెలలు అవుతున్నప్పటికీ ఆచరణలో అమలుకు నోచుకోలేదు. ఎన్నికల ప్రణాళికలో నెల రోజుల లోపు ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తామని, 5 లక్షల నుండి 10 లక్షల వరకు పెంచుతామన్నారు. అన్నమాట ప్రకారం అమలు చేయాలి.
- ఏజెన్సీ ఏరియాలో వృత్తి చేస్తున్న గీత కార్మికుల గురించి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రేవంత్ రెడ్డి గారు అసెంబ్లీలో అద్భుతంగా మాట్లాడారు. రద్దయిన వారి కల్లుగీత సొసైటీలను పునరుద్ధరించాలన్నారు. ఇంకా ఒక అడుగు ముందుకు వేసి ఈ ప్రాంతంలో ఉన్న గీత కార్మికులందరికీ చట్ట ప్రకారం షెడ్యూల్ ట్రైబ్ సర్టిఫికెట్స్ ఇవ్వాలన్నారు. కానీ ఇప్పటివరకు కనీసం సొసైటీల పునరుద్ధరణ గురించి కూడా చర్యలు చేపట్టడం లేదు. ఈ ప్రాంతంలో ఉన్నవారికి ఎలాంటి సంక్షేమ పథకాలు వర్తించకపోవడంతో వాళ్లు ఆవేదన పడుతున్నారు.
- యాదాద్రి భువనగిరి జిల్లాలోని నందనం లో గత ప్రభుత్వ హయాంలో నీరా ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి 8 కోట్ల బడ్జెట్ కేటాయించింది. బిల్డింగ్ నిర్మాణం పూర్తయింది. అందుకు సంబంధించిన మిషనరీ ఏర్పాటు చేశారు. కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన భవనము, మిషనరీ గురించి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో నేడు పడావు పడి ఉన్నాయి. ఇక్కడ ఐదు ఎకరాలు టాడ్ కార్పొరేషన్ కు సంబంధించిన భూమి ఉన్నది. విస్తారంగా తాటి ఈత చెట్లు ఉన్నాయి. నీరా మరియు తాటి ఈత అనుబంధ ఉత్పత్తులు ఇక్కడ తయారవుతాయి. వివిధ ప్రాంతాలకు సమృద్ధిగా నీరా ను బాటిలింగ్ చేసి పంపిణీ చేయవచ్చు. బుట్టలు, బ్యాగులు, దండలు తదితర ఫ్యాన్సీ వస్తువులను తయారుచేసి మార్కెటింగ్ చేయవచ్చు. ఫలితంగా గీత కార్మికులకి ఉపాధి కలుగుతుంది.
- గత ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్లో గీత కార్మికుల సంక్షేమానికి 25 కోట్ల రూపాయల కేటాయించింది. దీనిలో 22 కోట్ల రూపాయలు వెచ్చించి హైదరాబాదు నెక్లెస్ రోడ్ లోని నీరా కేఫ్ ని టాడి కార్పొరేషన్ ద్వారా టూరిజం శాఖ వాళ్లు నిర్మించారు. అందుకని వాళ్ళ ఆధీనంలోనే ఈ కేఫ్ ఉన్నది. బడ్జెట్లో గీత కార్మికులకు కేటాయించిన
- డబ్బులతో నిర్మితమైనది కాబట్టి న్యాయంగా దీనిని టాడి కార్పొరేషన్ కి అప్పగించాలి. దీని ద్వారా వచ్చే లాభాలను గీత కార్మికుల సంక్షేమానికి ఖర్చు చేయాలి.
- వృత్తిలో ప్రమాదాలు జరిగిన వారికి టాడి కార్పొరేషన్ నుండి ఇస్తున్న తక్షణ సహాయం దహన సంస్కారాల కొరకు 25,000లు, దెబ్బలు తగిలిన వారికి 10,000 బడ్జెట్ లేదనే పేరుతో నిలిపివేశారు. దీనిని కొనసాగించాలి.
- సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని ట్యాంక్ బండ్ పై నెలకొల్పుతామని, జనగామ జిల్లాకు పాపన్న పేరు పెడతామని ఎన్నికల ప్రణాళికలో ప్రకటించడమే కాకుండా అధికారం చేపట్టాక అనేక సందర్భాలలో మంత్రులు వివిధ సభలలో, అసెంబ్లీ లో ప్రస్తావించారు. 50 సంవత్సరాలు నిండిన గీత కార్మికులకు ప్రస్తుతం ఇస్తున్న రెండు వేల పెన్షన్‌ను చేయూత పథకం ద్వారా నాలుగు వేల రూపాయలకు పెంచుతామని ప్రకటించారు. మద్యం షాపులలో గౌడులకు ఇస్తున్న 15 శాతం రిజర్వేషన్ ను 25 శాతం కు పెంచుతామని ఇవి కల్లుగీత సొసైటీలకు ఇచ్చే విదంగా చూస్తామన్నారు. ఇటీవల కరీంనగర్ జిల్లాలో జరిగిన సభలో బీసీ సంక్షేమ శాఖ మాత్యులు పొన్నం ప్రభాకర్ గారు మాట్లాడుతూ గత ప్రభుత్వం గీత కార్మికులకు ద్విచక్ర వాహనాలు ఇస్తామని చెప్పి ఇవ్వకుండా నిరాశపరిచిందని తమ ప్రభుత్వం తప్పకుండా అందరికీ అందిస్తుందని ఆ కల నెరవేరుస్తుందని అన్నారు.
- మొత్తంగా చూస్తే ఈ ఏడాది పాలన కాలంలో కాటమయ్య రక్షణ కవచం మినహా మిగతా వాగ్దానాలు ఏవి ఆచరణకు నోచుకోలేదు. గీత కార్మికుల బాగోగులు చూడాల్సిన ఎక్సైజ్ మరియు ప్రొహిబిషన్ శాఖ ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాల అమలు పై దృష్టి సారించాలి. ప్రధానంగా గీత కార్మికులకు ఉపాధి కలగాలంటే చెట్ల పెంపకానికి భూమి, కల్లు కు మార్కెట్ సౌకర్యం, నీరా తాటి ఈత ఉత్పత్తుల పరిశ్రమలు నెలకొల్పాలి. టాడి కార్పొరేషన్ కు అవసరాలకు సరిపడ బడ్జెట్ కేటాయించి ఖర్చుచేయాలి. ఉమ్మడి రాష్ట్రంలో గీతకార్మిక సొసైటీలకు అప్పటి ప్రభుత్వాలు ఇచ్చిన భూములకు రక్షణ లేకుండా పోతోంది. రియల్టర్ల కన్ను పడటంతో అన్యాక్రాంతం అయ్యే ప్రమాదం పొంచి ఉంది. ఇందుకు గాను ఆయా సొసైటీల పరిధిలో ఉన్న భూములకు ప్రభుత్వమే రక్షణ కోసం కంచెలు నిర్మించాలి.
- ప్రతి సొసైటీకి 5 ఎకరాలు భూమి ఇవ్వాలనే జివో నెం 560 ని అమలు చేయాలి. హైబ్రీడ్ తాటి, జీలుగ, ఖర్జూర, ఈత చెట్లను అభివృద్ధి చేసి సొసైటీలకు పంపిణీ చేస్తే భవిష్యత్ లో యువతను ఆకర్షించేందుకు, మరణాలకు తగ్గించేందుకు వీలు కలుగుతుంది.
- గీత వృత్తిలో ఎక్కడ ప్రమాదానికి గురై చనిపోయినా, శాశ్వత వికలాంగులైనా పదిలక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి.
- తరతరాల నుండి ఏజెన్సి ఏరియాలో జీవనం గడుపుతూ కల్లుగీత వృత్తి చేస్తున్న గీత కార్మికులకు సొసైటీలను ఏర్పాటు చేసి ఉపాది కల్పించాలి. సంక్షేమ పథకాలు వారికి వర్తింప చేయాలి. ఎన్నికల ప్రణాళికలో వారు ఇచ్చిన హామీలు అమలు చేయాలి.



మేకపోతుల వెంకటరమణ
రాష్ట్ర అధ్యక్షులు,
తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం

# పెన్షన్ అనేది ఉద్యోగుల హక్కు, అది ప్రభుత్వాల భిక్ష కాదు


### పెన్షనర్లందరికి జాతీయ పెన్షనర్ల దినోత్సవ శభాకాంక్షలు

**హైదరాబాద్ వెలుతురు డిసెంబర్ 16:** పింఛను లేదా పెన్షన్ అనేది ఒక వ్యక్తి వయస్సు, లేదా ఇతర కారకాల కారణంగా కార్యాలయం నుండి నిష్క్రమించి నప్పుడు ఒక సంస్థ లేదా యజమాని రిటైర్డ్ ఉద్యోగులకు ఇవ్వవలసిన పెద్ద పారితోషికాన్ని సూచిస్తుంది.

పెన్షన్ అనేది ఒక బహుమానం కాదు. లేదా యాజమాని యొక్క దయాదాక్షిణ్యం కాదు. ఉద్యోగి గతంలో అందించిన సేవలకు ప్రతిఫలంగా యాజమాన్యం ఉద్యోగికి అందించేది మాత్రమే పెన్షన్. ఇది సామాజిక, ఆర్థిక న్యాయాన్ని అందించే ఒక సామాజిక సంక్షేమ ప్రక్రియ మాత్రమే. ఉద్యోగి తన విధినిర్వహణలో తన సంపూర్ణ శారీరక, మానసిక శక్తినంత ధారపోసి, తన యాజమాని కోసం అవిశ్రాంత సేవలు అందించి, ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగికి వృద్ధాప్యంలో అండగా, ఆసరాగా నిలవడం యాజమాన్యం యొక్క కనీస బాధ్యతయే కాదు మానవ ధర్మం కూడా. భారత దేశం పరాయి పాలనలో ఉన్నప్పుడు ఉన్న పెన్షన్ సౌకర్యం స్వతంత్ర భారత దేశంలో కనుమరుగు కావడం, అనంతరం ఇచ్చిన నామమాత్రపు పెన్షన్‌లో కూడా వ్యత్యాసము ఉండటం, సీనియర్లకు తీవ్ర నష్టం వాటిల్లిన సంధర్భములో భారత డిఫెన్సు సర్వీసులో ఆర్థిక సలహాదారుగా పనిచేసిన డి.కే. నకారా 1972 లో పదవీ విరమణ చేసిన తర్వాత ఆయన తనకు జరిగిన అన్యానికి వ్యతిరేకంగా సుదీర్ఘమైన న్యాయ పోరాటం చేసారు. దివంగత డి.కే. నకారా చేసిన న్యాయ పోరాటం ఫలించినది. భారత దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీం కోర్టులో డి.కే. నకారా నాల్గు దశాబ్దాల కిందట విజయం సాధించినారు. ఆనాటి సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి స్వర్గీయ వై.వి.చంద్రచూడ్ డి.కే.నకారాకు అను కూలంగా తీర్పును చెప్పారు.

ఆ సందర్భంగా తన తీర్పులో పెన్షన్ అనేది ఉద్యోగుల హక్కు, అది ప్రభుత్వాల భిక్ష కాదు అని వ్యాఖ్యానించారు.

భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు 17-12-1982న వెలువరించిన జడ్జిమెంట్తో భారత చరిత్రలో పెన్షనర్లకు సువర్ణ అధ్యాయము మొదలైంది. అవిశ్రాంత పోరుచేసి వృద్ధాప్యంలో ఆసరాగా పెన్షన్ పొందే హక్కును సాధించిన డి.కే. నకారా భారత పెన్షనర్ల గుండెల్లో నిలిచిపోయారు.





పెన్షన్ పొందే హక్కును సాధించిన డి.కే. నకారా

పెన్షనర్ల దీర్ఘకాలిక సమస్య పరిష్కారమైన దినం స్మృతిగా 1983 నుండి ప్రతీ సంవత్సరము డిసెంబర్ 17 నాడు జాతీయ పెన్షనర్ల దినోత్సవాన్ని దేశవ్యాప్తంగా జరుపుకుంటున్నాము. ఆనాడు దేశవ్యాప్తంగా ఉన్న పెన్షనర్లు స్వర్గీయ డి.కే.నకారాకు నివాలులు అర్పస్తున్నారు. ఐతే ప్రపంచ బ్యాంకు కనుసన్నలలో నూతన ఆర్థిక సంస్కరణల ఫలితంగా అనుకోని విధంగా మరోమారు పాత పెన్షన్ విధానం దేశవ్యాప్తంగా 01.04.2004 నుండి పెన్షన్ రద్దయినది.

మన రాష్ట్రంలో 01.09.2004 నుండి రద్దయినది. దాని స్థానంలో అసంబద్ధ నూతన పెన్షన్ విధానం(సి పి ఎస్) అమలులోకి వచ్చింది. నకారా పోరాట స్ఫూర్తిగా పోరాటాలు చేసి పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ చేసుకోవలసిన అవసరం ఉంది. అందులో భాగంగానే దేశ వ్యాప్తంగా ప్రతి సంవత్సరము సెప్టెంబరు 1 నాడు పెన్షన్ విద్రోహ దినంగా జరుపుకుంటూ ధర్నాలు దీక్షలు చేయడం జరుగుతుంది.

నకారా పోరాట స్ఫూర్తిగా పోరాటాలు చేసి పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ కోసం కంట్రీబ్యూటరి పెన్షనర్ల దీర్ఘకాలిక పోరాటానికి సంపూర్ణ మద్దతును పాత పెన్షనర్లందరము అందిస్తూ డి.కె. నకారా గారికి ఘనంగా నివాళులు అర్పిద్దాం. డిసెంబరు 17న వృద్ధ పెన్షనర్లను ఘనంగా సన్మానించు కుంటాము.

పెన్షనర్లందరం ఐక్యంగా ఉండి పెండింగ్ సమస్యలన్నింటిని సాధించు కుందాం. పెన్షనర్లందరికి జాతీయ పెన్షనర్ల దినోత్సవ శభాకాంక్షలు



- ఇంజమూరి రఘునందన్
సెల్: 9866102962
పెన్షనర్ల అసోసియేషన్ నాయకులు



# కార్యకర్తలకు అండగా కాంగ్రెస్ పార్టీ

**- కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్..**

**కూకట్‌పల్లి డిసెంబర్ 16 వెలుతురు:** కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉండేందుకు అన్ని రకాలుగా కృషి చేస్తుందని కూకట్పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ అన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పార్టీ సీనియర్ నాయకుడు బాబ్జి కుమార్ కు బండి రమేష్ వ్యక్తిగతంగా సోమవారం రూ 50 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం బాబ్జి ఆరోగ్యం పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. బాబ్జి త్వరగా కోరుకునేలా తగు వైద్య అందించాలని సూచించారు. అలాగే నాలాలో పడి ఆదివారం మృతి చెందిన ఫతేనగర్ డివిజన్ కు చెందిన బాలుడు ముజ్మిల్ తల్లిదండ్రులకు వ్యక్తిగతంగా రమేష్ రూ .10వేల సహాయాన్ని అందించడంతోపాటు, జిహెచ్ఎంసి అధికారులతో మాట్లాడి రూ.5 లక్షల ప్రభుత్వ సహాయం అందేలా రమేష్ చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రతి కార్యకర్తకు పార్టీ అన్నివేళలా అండగా ఉంటుందన్నారు. తాను సైతం వ్యక్తిగతంగా వారికి నిరంతరం అందుబాటులో ఉంటూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

# లచ్చిరెడ్డికి ఏపీజే అబ్దుల్ కలాం జాతీయ అవార్డు

**హైదరాబాద్, వెలుతురు: డిసెంబర్ 16:** న్యూఢిల్లీలో బిజెపి సీనియర్ నాయకులు గోగిరెడ్డి లచ్చిరెడ్డి కరోనా సమయంలో పేదవారికి చేసిన సేవలకు గాను, రంగారెడ్డి జిల్లాలో మెడికల్ క్యాంప్, జిల్లాలో పలు



పాఠశాల విద్యార్థులు పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన వారికి ప్రోత్సాహం అందజేసిన అందుకుగాను బహుజన సాహితి అకాడమీ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని బహుజన సాహితీ అకాడమీ జాతీయ అధ్యక్షులు నల్ల రాధాకృష్ణ, జాతీయ సెలక్షన్ కమిటీ సభ్యులు బోసుపల్లి ప్రతాప్ ఏపీజే అబ్దుల్ కలాం జాతీయ అవార్డును లచ్చి రెడ్డికి అందజేయడం జరిగింది.

# ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను ఉపయోగించుకోవాలి

**మాస్టర్స్‌మైండ్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం...**

**హైదరాబాద్, వెలుతురు డిసెంబర్ 16:** పేద, మధ్యతరగతి ప్రజలంతా ఉచిత వైద్య శిబిరాలను ఉపయోగించుకోవాలని మాస్టర్స్ మైండ్స్ అధినేత గొల్ల రామకృష్ణయాదవ్ పిలుపునిచ్చారు. హయత్‌నగర్ మాస్టర్స్‌మైండ్స్







పాఠశాల ఆద్వర్యంలో సోమవారం నాడు ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేశారు. మాస్టర్స్‌మైండ్స్ స్కూల్ డైరెక్టర్ గొల్ల రామకృష్ణ, తిరుమల్ రెడ్డిలు వేగాస్ డెంటల్ క్లినిక్ మల్కాజ్‌గిరి డాక్టర్ కే. శిరిషలు కలిసి సోమవారంనాడు సంయుక్తంగా మెగా క్యాంపు నిర్వహించారు. పలువురు విధ్యార్థిని, విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులకు ఉచితంగా డెంటల్ పరిక్షలు నిర్వహించారు. అనంతరం వారికి మందులు ఇచ్చారు. పళ్ళ క్లినింగ్‌పై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి. పద్మజ రాజుతో పాటు స్కూల్ టీచర్లు, సిబ్బంది తదితరులు పాల్గోన్నారు.

# రోడ్లు మరియు డ్రైనేజీ లేని సమస్యలను వెంటనే పరిష్కరించాలి : జి.రామన్ గౌడ్

**హైదరాబాద్, వెలుతురు డిసెంబర్ 16:** సోమవారం రోజున హిమాయత్ నగర్ డివిజన్లోని కింగ్ కోటి లో రోడ్లు మరియు డ్రైనేజీ లేని సమస్యలను ఖైరతాబాద్ శాసనసభ్యులు దానం నాగేందర్ గారి దృష్టికి స్థానికులు తేవడం జరిగింది. దీనికి సంబంధించి సోమవారం రోజున హిమాయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామానుగౌడ్ గారి ఆదేశాల మేరకు కాంగ్రెస్ సీనియర్ నాయకులు జి.రామన్ గౌడ్ అధికారులతో కలిసి అక్కడ పర్యటించడం జరిగింది.



డీఎంసీ మారుతి దివాకర్, ఏ ఈ చంద్రశేఖర్, వర్క్ ఇన్స్పెక్టర్ రాము ఉన్నారు. కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ అధికారులతో మాట్లాడి ముందుగా వాటర్ వర్క్స్ పనులను పూర్తి చేసుకుని రోడ్డు విషయాన్ని చూడాలని కోరారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మన్సూర్, సోహెల్ జాబరి, మునీర్ నవాబ్,జాకి , మహేష్ ,రవి తదితరులు పాల్గొన్నారు..

# ఐఎన్‌టియూసిలో చేరిన వివిధ జిల్లాలకు చెందిన ఆశ వర్కర్లు

**వెలుతురు, హైదరాబాద్, డిసెంబర్ 16:** హైదరాబాద్ నారాయణగూడ డాక్టర్ జి ఎస్ ఆర్ ఐఎన్ టి యూ సి భవన్ లో సోమ వారం జాతీయ అధ్యక్షులు డాక్టర్ జి. సంజీవరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన ఆశ వర్కర్స్ బిఆర్టియు యూనియన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీమతి కరుణ ఆధ్వర్యంలో 20 జిల్లాల బాధ్యులు అధ్యక్ష కార్యదర్శులు, నేడు ఐఎన్టీయూసీలో చేరగా వారికి ఐఎన్టీయూసీ కండవాలు గప్పి ఆహ్వానిస్తున్న రాష్ట్ర ఐఎన్టీయూసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ఎరగాని నాగన్న ,ఎండి జలీల్ భాయ్, కొత్త సీతారాములు,బి. విజయ్ కుమార్ యాదవ్, కొండ పద్మ, ఈ సందర్భంగా నాగన్న గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా పాలన కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఆయన సహకారంతో పేదలకు, కార్మికులకు న్యాయం జరుగుతుందని నమ్మకంతో, వివిధ యూనియన్లకు చెందిన నాయకులు కార్మికులు భారీ ఎత్తున ఐన్ టీ యూ సిలో చేరుతున్నారని, వారి న్యాయమైన డిమాండ్లు సాధించుకునేంతవరకు ఐఎన్టీయూసీ ప్రభుత్వంతో చర్చల ద్వారా పలితాన్ని సాధిస్తుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో కె రమణ, సిహెచ్ నర్సమ్మ, ధనలక్ష్మి, శ్రీలత ,శ్రీదేవి ,కలమ్మ తదితరులు పాల్గొన్నారు.




# అన్ని మతాల పండగలకు బట్టలు పంపిణీ చేసిన ఘనత కెసిఆర్‌దే : ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

**కూకట్‌పల్లి, డిసెంబర్ 16 వెలుతురు:** తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో గత పది సంవత్సరాలుగా అన్ని మతాల ప్రత్యేక పండుగలకు బట్టలు పంపిణీ చేసిన ఘనత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కే దక్కుతుంది ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. క్రిస్మస్ సందర్భంగా కూకట్ పల్లి నియోజక వర్గంలో బిఆర్ఎస్ క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు డేవిడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రిస్మస్ వేడుకలకు సోమవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్ కుమార్,ఫాస్టర్ ఐజాక్ లు ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా నియోజక వర్గంలోని పాస్టర్లకు ఎమ్మెల్యే సొంత నిధులతో బట్టల పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ నాటి నుండి తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో అన్ని మతాల, కులాలకు వారి ప్రత్యేక పండగలకు బట్టలు పంపిణీ చేసిన ఘనత కేసీఆర్ కే దక్కుతుదన్నారు. ఈ ప్రభుత్వం ఏర్పడిన సంవత్సర కాలంలో ఆడపడుచులకు బతుకమ్మ చీరలను, ముస్లింలకు రంజాన్ తోఫా, క్రిస్మస్ వేడుకలకు పాస్టర్లకు బట్టల పంపిణీ చేయడంలేదని ఇలాంటి దౌర్భాగ్యమైన ప్రభుత్వం ఉండడం మన దురదృష్టకరమని ఎమ్మెల్యే అన్నారు. నియోజకవర్గంలోని క్రిస్టియన్ మతస్తులకు తామెప్పుడు అండగా



నిలబడతామని ఎల్లవేళలా ఎవరికి ఎలాంటి కష్టం వచ్చినా తాము అండగా నిలబడతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం పాస్టర్ ఐజాక్ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా కేసీఆర్ ప్రభుత్వం స్థానికంగా ఎమ్మెల్యే కృష్ణారావు క్రిస్టియన్ వేడుకలకు, ప్రజలందరికీ అండగా నిలబడుతూ నియోజకవర్గంలో ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పరిష్కరించే నాయకుడికి ప్రజల అభిమానం ఎప్పటికీ ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు జూపల్లి సత్యనారాయణ ,ఆవుల రవీందర్ రెడ్డి, పండల సతీష్ గౌడ్, సబిహా గౌసుద్దీన్ ,శిరీష బాబురావు, మందడి శ్రీనివాసరావు ,శ్రీహరి మహేశ్వరి, రోజా రంగారావు, మాజీ కార్పొరేటర్,తూము శ్రావణ్ కుమార్, సతీష్ రావు, రేవరన్ పరలోక నేస్తం పి. ఐజాక్, ఫాస్టర్లు డానియల్, డేవిడ్, సువార్తమ్మ, రాజు, స్వామి, విజయపాల్, జాన్ పాల్, లాల్ బాబు, దేవదానం, సాంసన్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణాలను ఆపేదెవరు..?

## బఫర్ జోన్‌లో అక్రమ నిర్మాణాలు : చోద్యం చూస్తున్న కమిషనర్, టౌన్ ప్లానింగ్ విభాగం

**తుర్కయంజాల్,వెలుతురు : డిసెంబర్ 16:** రాష్ట్ర ప్రభుత్వం హైడ్రా ను ఏర్పాటు చేసి ప్రభుత్వ భూములలో, చెరువులు, కుంటలు, బఫర్ జోన్ల లో నిర్మించిన అక్రమ నిర్మాణాలను కూల్చి వేస్తుంటే మరోపక్క తుర్కయంజాల్ మున్సిపల్ పరిధిలో అక్రమ నిర్మాణాదారులు రెచ్చిపోతున్నారు. హైదరాబాద్ నగరానికి తుర్కయంజాల్ కూతవేటు దూరంలో ఉండడంతో వ్యాపారాలు చేసుకోవడానికి అణువుగా మారింది. ఇదే అదనుగా భావించిన వ్యాపారస్తులు హైవేలను ఎంచుకొని అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. మాసబ్ చెరువు సర్వేనెంబర్ 202 బఫర్ జోన్ లో భారీగా హెూటల్ ను అక్రమంగా నిర్మిస్తున్నారు. ఇదేమని అధికారులను ప్రశ్నిస్తే సమాధానాలు దాటవేస్తున్నారు. గతంలో అనుమతులు లేవని కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులు పనులు ఆపి వేయించారు. ఆ తర్వాత అదే నిర్మాణం ఎలా సక్రమమైందో అని పలువురు ప్రశ్నిస్తున్నారు. మున్సిపల్ పరిధిలో ఎలాంటి అనుమతులు లేకుండా విచ్చలవిడిగా నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు నామ మాత్రపు చర్యలు తీసుకుంటున్నారు. టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు



అక్రమ నిర్మాణదారులు ఇచ్చే ముడుపులకు ఆశపడి పనిచేస్తున్నారనే ఆరోపణలు ఘాటుగానే వినిపిస్తున్నాయి. బఫర్ జోన్లలో సర్వే చేసి అక్రమ నిర్మాణాలు జరగకుండా చూడాలని పలువురు ఉన్నతాధికారులను కోరుతున్నారు.



# అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

**- కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్**

**కూకట్ పల్లి డిసెంబర్ 16 వెలుతురు:** అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి, పేదవారి సొంతింటి కల నెరవేర్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఆల్వేన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మేరకు శేర్లింగంపల్లి నియోజకవర్గం ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని దత్తాత్రేయ కాలనీలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక కొరకు నిర్వహిస్తున్న సర్వేను డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్ లు జిహెచ్ఎంసి అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రజాపాలనలో స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి అధికారులు వారి ఇళ్ల వద్దకు వెళ్లి సర్వే నిర్వహించడం జరుగు తుందని అన్నారు.

సర్వే కోసం ప్రత్యేకంగా రూపొందించిన మొబైల్ యాప్‌లో లబ్ధిదారుల వివరాలు పొందుపరచడం జరుగుతుందని అన్నారు. సొంత స్థలం ఉండి లేదా రేకుల ఇల్లు ఉన్న లబ్ధిదారులను ఎంపికచేసి వారు స్లాబు, ఇల్లు నిర్మించుకోవడానికి ప్రభుత్వం తరపునుండి ఐదు లక్షల రూపాయల ఆర్థికసాయం అందించడం జరుగుతుంది అన్నారు.

ఈ కార్యక్రమంలో పాండుగౌడ్, రామకృష్ణ, సత్యనారాయణ, ఎ.ఎం.సి కె.శ్రీనివాస్, సర్వేయర్లు ముస్తఫా, కుమార్, జయ లక్ష్మి, సుమన్, అరుణ కుమారి తదితరులు పాల్గొన్నారు.



# ఆకట్టుకున్న ఆధ్యారెడ్డి కూచిపూడి నృత్య ప్రదర్శనలు

**వెలుతురు, కల్చరల్:** తెలుగు భాష చైతన్య సమితి ఆధ్వ ర్యంలో నాంపల్లి, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో నిర్వ హించిన దేశభక్తి గీతాలపన, అధ్యా రెడ్డి కూచిపూడి నృత్య ప్రదర్శనలు శ్రోతలను ఎంతగానో ఆకట్టుకున్నాయి. భవాని నృత్యాంజలి కళాక్షేత్రం అధినేత్రి, ప్రముఖ నృత్య గురువు భవాని శిష్యు రాలు ఆధ్యారెడ్డి.. ఏక దంతా యవక్రతుందాయ, పలుకే బంగార మాయెనా వివిధ అంశాల కు వైవిద్య భరితమైన నృత్యప్ర దర్శనలు చేసి శ్రోతల హర్షధ్వా నాలు అందు కున్నారు. ఈ సంద ర్భంగా ప్రముఖ గాయని వేమూరి మంజుల ఆలపించిన భక్తి గీతాలు హైలైట్ గా నిలిచాయి. ఈ సంద ర్భంగా జరిగిన సభలో సరస్వతి ఉపాసకులు దైవజ్ఞశర్మ హాజరై చి న్నారి ఆధ్యాను అభినందించారు.

# గీత కార్మికులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి అమలు చేయలేదు

### - మేకపోతుల వెంకటరమణ, కేజీకేపేస్ రాష్ట్ర అధ్యక్షులు.



**హైదరాబాద్ వెలుతురు డిసెంబర్ 16:** కాంగ్రెస్ పార్టీ కల్లుగీత కార్మికులకు ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీలు ఈ ఏడాది కాలంలో ఏ ఒక్కటి అమలు చేయలేదని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల వెంకటరమణ అన్నారు.

ఏడాది కాంగ్రెస్ పాలనలో కల్లుగీత వృత్తి అంశంపై సోమవారం రోజున సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఇటీవల సంఘం రాష్ట్ర సదస్సు నిర్వహించి 22 డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చామని, ఏడాది కాలంలో ఎన్నోసార్లు మంత్రులను కలిసి వినతి పత్రాలు ఇచ్చామని అయినా ఏ ఒక్కటి పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వృత్తిలో ప్రమాదం జరిగిన వారికి ఇవ్వాల్సిన ఎక్స్ గ్రేషియా ఏడాది నుండి ఇవ్వడం లేదని మేనిఫెస్టోలో మాత్రం నెల రోజుల లోపు ఇస్తామని చెప్పారన్నారు. ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఆవిష్కరణ చేసిన కాటమయ్య రక్షణ కవచం ఈ ఐదు నెలల కాలంలో పదివేలు మాత్రమే పంపిణీ చేశారని మిగతా వృత్తి చేసే వారందరికీ ఇవ్వాలన్నారు. నెక్లెస్ రోడ్డులోని నీరా కేఫ్, టాడి కార్పొరేషన్ కు అప్పగించాలని, నందనములోని ప్రాజెక్టు ప్రారంభించాలని అన్నారు. ప్రమాదానికి గురయ్యే వారికి టాడి కార్పొరేషన్ నుంచి ఇచ్చే ఆర్థిక సహాయం నిలుపుదల చేశారని వీటిని వెంటనే కొనసాగించాలన్నారు, ఏజెన్సీ ఏరియాలోని సొసైటీలను పునరుద్ధరించాలని, కల్లుగీత సొసైటీలపై అక్రమంగా చేసే దాడులను, అరెస్టులను ఆపాలని డిమాండ్ చేశారు. ఎక్సైజ్ శాఖ మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు కల్లుగీత కార్మికుల గురించి ఏమాత్రం పట్టించుకోవడంలేదని, దాడులను ప్రోత్సహిస్తున్నారని అలాంటప్పుడు ఆయనకు ఈ శాఖ అవసరమా అని ప్రశ్నించారు.

ఇప్పటికైనా ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని లేని పక్షంలో భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఉద్యమాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు, సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాలరాజ్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో కేజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు మరియు సమన్వయ కమిటీ నాయకులు వివిధ సంఘాల రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

# జహీరాబాద్‌లో కొత్త ఫ్లై ఓవర్ బ్రిడ్జికి "స్మార్ట్ సిటీ ఫరీదుద్దీన్ ఫ్లైఓవర్" బ్రిడ్జిగా నామకరణం చేయాలి

### - ప్రభుత్వానికి పుర ప్రముఖుల విజ్ఞప్తి..



**జహీరాబాద్ వెలుతురు డిసెంబర్ 16:** జహీరాబాద్‌లో నిర్మాణ పనులు పూర్తి చేసుకోబోతున్న కొత్త ఫ్లై ఓవర్ బ్రిడ్జికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, దివంగత నాయకులు మహమ్మద్ ఫరిదోద్దీన్ జ్ఞాపకర్థంగా "స్మార్ట్ సిటీ ఫరీదుద్దీన్ ఫ్లైఓవర్" బ్రిడ్జిగా నామకరణం చేయాలని అలాగే దానికి సమీపంలో వారి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని జహీరాబాద్ పుర ప్రముఖులు, స్థానిక ప్రజలు మరియు సంఘం నాయకులు టిప్పు క్రాంతి సేన అధ్యక్షుడు ముహమ్మద్ యూసుఫ్, మౌలానా హాఫీజ్ ముబీన్ అహ్మద్ ఖాస్మీ, ఆసిఫ్ (ఏ టూ జెడ్) ముహమ్మద్ అబ్దుల్ రహీమ్, ఇతర సామాజిక యువకులు పెద్ద సంఖ్యలో జహీరాబాద్ పార్లమెంట్ సీనియర్ నాయకులు డాక్టర్ సిద్ధం ఉజ్వల్ రెడ్డి నివాసానికి చేరుకుని వినతిపత్రం సమర్పించారు. వినతిపత్రం లో చేసిన పైన ప్రతిపాదనను వారు కూడా పూర్తిగా మద్దతు ఇస్తానని హామీచ్చారు.



**దివంగత మాజీ మంత్రి మహమ్మద్ ఫరీదోద్దీన్**

వారు సమర్పించిన వినతిపత్రంలో దివంగత నేత మాజీ మంత్రి మహమ్మద్ ఫరిదోద్దీన్ వ్యక్తిగత, రాజకీయ ప్రస్థానం మరియు వారు ప్రజలకు చేసిన సేవలను వివరించారు.... ముహమ్మద్ ఫఖరోద్దీన్ కుమారుడు ముహమ్మద్ ఫరీదుద్దీన్ జహీరాబాద్ యొక్క ప్రముఖ రాజకీయ, సామాజిక నాయకుడు. 1989-1996లో సర్పంచ్‌గా, డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడిగా రాజకీయాలు ప్రారంభించారు. 1994-1999 వరకు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉన్నారు. జహీరాబాద్ ఎమ్మెల్యేగా (1999-2009) ఆయన అనేక ముఖ్యమైన మంత్రిత్వ శాఖలను నిర్వహించారు. రాష్ట్ర విభజన తర్వాత 2016-2019 మధ్య కాలంలో తెలంగాణ మైనారిటీ సంక్షేమ కమిటీ చైర్మన్‌గా, ఎమ్మెల్సీగా పనిచేశారు. ఫరీదుద్దీన్ మైనారిటీల కోసం గణనీయమైన సంస్కరణలు చేశారు. వారి హక్కుల పరిరక్షణ కోసం ఎల్లప్పుడూ చురుకుగా ఉన్నారు. అన్ని మతాలు మరియు వర్గాల మధ్య సామరస్యం మరియు ఐక్యతను పెంపొందించారు, ఇది అతని వ్యక్తిత్వం యొక్క ప్రముఖ లక్షణం, అతని నాయకత్వంలో, ప్రజలు ముందుకు సాగడానికి విద్యా సంస్థలు మరియు సాంస్కృతిక వేదికలు స్థాపించబడ్డాయి. అతని కృషి ఫలితంగా జహీరాబాద్ మరియు దాని పరిసర ప్రాంతాలలో ఈద్గా మరియు శ్మశానవాటిక స్థాపనతో సహా ముఖ్యమైన అభివృద్ధి పనులు జరిగాయి.

జహీరాబాద్ ప్రాంతాన్ని దివంగత ఫరీదుద్దీన్ సాహిబ్ స్వగ్రామమైన హూతి (బి)తో కలిపే కొత్త ఫ్లైఓవర్ ఒక ప్రధాన మౌలిక సదుపాయాల ప్రాజెక్ట్. ఆయన సేవలకు నివాళులర్పించేందుకు ఈ ఫ్లై ఓవర్‌కు స్మార్ట్ సిటీ ఫరీదుద్దీన్ ఫ్లైఓవర్ అని పేరు పెట్టాలని ప్రజలు సూచించారు. ఫ్లైఓవర్ సమీపంలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు, తద్వారా ఆయన సేవలను ఎల్లప్పుడు గుర్తుంచుకునేలా మరియు అతని వ్యక్తిత్వాన్ని శాశ్వత చిహ్నంగా అందించడం మాత్రమే కాదు, వారి జ్ఞాపకశక్తిని సజీవంగా ఉంచుతుంది సూత్రాలు మరియు పోరాటాలు ఒక అందమైన తోట తో ఫ్లైఓవర్ సమీపంలో ఒక విగ్రహం ఏర్పాటు చేయాలి.

ఈ విగ్రహం ఆయన సేవలకు ప్రాతినిధ్యం వహించడమే కాకుండా జహీరాబాద్ పౌరులకు గర్వకారణం అవుతుంది. దీని ద్వారా జహీరాబాద్ యొక్క సాంస్కృతిక మరియు చారిత్రక గుర్తింపును మరింత బలోపేతం చేస్తుందని మరియు దివంగత ఫరీదుద్దీన్ వ్యక్తిత్వాన్ని గౌరవించటానికి ఉత్తమ మార్గంగా ఫ్లైఓవర్‌కు పేరు పెట్టడం మరియు విగ్రహాన్ని స్థాపించడం ఈ కార్యక్రమం స్థానిక పౌరులను గర్వించేలా చేస్తుంది జహీరాబాద్ యొక్క వైవిధ్యం మరియు వివిధ సంస్కృతులకు సంబంధించిన సేవలను ప్రతిబింబించే సైట్ పర్యాటకులకు ఆసక్తిని కలిగిస్తుంది మరియు ప్రజా నియోజకవర్గాలు మరియు కమ్యూనిటీ నాయకులకు ఇది ఒక విద్యా మరియు చారిత్రక మైలురాయిగా ఉపయోగపడుతుంది దివంగత ఫరీదుద్దీన్ సేవలకు శాశ్వత నివాళి అర్పించేందుకు వీలుగా వీలైనంత త్వరగా ఆమోదం పొందాలి. నగరం యొక్క సౌందర్యశాస్త్రంలో మైలురాయిని పొందుతుందని వినతిపత్రం లో పేర్కొన్నారు.

# సంస్థాన్ నారాయణపురంలో బిజెపి నూతన బూత్ కమిటి ఎన్నిక

**సంస్థాన్ నారాయణపురం మండలం వెలుతురు డిసెంబర్ 16:** సంస్థాన్ నారాయణపురం మండలం కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ 98వ బూత్ అధ్యక్షులు చింతల గణేష్ గౌడ్ ఆధ్వర్యంలో బూత్ సమావేశాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మాజీ జిల్లా కార్యవర్గ సభ్యుడు సంఘీశెట్టి లక్ష్మి నారాయణ, మాజీ బీజేవైఎం అధ్యక్షుడు మద్ది అశోక్, మండల ఉపాధ్యక్షుడు గొల్లూరి యాదగిరి విచ్చేసి వారు మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ జాతీయ నాకత్వం పిలుపు మేరకు నూతన బూత్ కమిటీలను ఎన్నుకోవడం జరుగుతుంది. కార్యకర్తల బలాన్ని నమ్మి ముందుకు సాగుతున్న పార్టీ బీజేపీ అని తెలిపారు.కేంద్రంలోని బీజేపీ ఆధ్వర్యంలోని ఎన్.డి.ఏ ప్రభుత్వం పనితీరును ప్రజల ముందు ఉంచాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తకు ఉన్నది అని అన్నారు.

అనంతరం సంస్థాన్ నారాయణపురం బూత్ నెం 98 నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది.

అధ్యక్షుడిగా గొల్లూరి సాయి సాగర్,కార్యదర్శి వీరమల్ల అరుణ్ గౌడ్ ,లాబర్థి ప్రముఖ్ గొల్లూరి వెంకటేష్ ,మన్ కీ బాత్ ప్రముఖ్ బద్దం కిరణ్ ,వాట్సాప్ గ్రూప్ ప్రముఖ్ బద్దం సందీప్ , బి.ఎల్.ఏ



-2 చింతల గణేష్ , సభ్యులుగా గొల్లూరి ఉమా భారతి, రాపర్తి కావ్య, వీరమల్ల శిరీష, సుర్వి ఉమా, బద్దం సాయి రాం, గొల్లూరి యశ్వంత గార్లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.ఈ కార్యక్రమంలో బీజేవైఎం మండల అధ్యక్షులు ఉప్మాగుల గిరిబాబు , కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు బద్దం యాదయ్య, ఓబీసీ మోర్చా కార్యదర్శి వీరమల్ల వెంకటేష్, సుర్వి శ్రీశైలం ,బద్దం లింగస్వామి, బాల్గురి రమేష్,కొంశెట్టి నవీన్, బద్దం ప్రసాద్, బీజేపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అయాన్స్ భార్గవ్ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో మహా రక్తదాన శిబిరం

**చౌటుప్పల్ మండలం వెలుతురు డిసెంబర్ 16:** చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని గట్టు శ్రీరాములు ఫంక్షన్ హాల్ లో అయాన్స్ భార్గవ్ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో మహా రక్తదాన శిబిరం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యాతిధిగా



మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు విచ్చేసి మాట్లాడుతూ రక్త దానం చేసి ప్రాణ దాతలు కావాలని ప్రతిరోజూ రక్తం అవసరం ఉండి ఎంతోమంది ఇబ్బందులు పడుతున్నారు.

తలసేమియా, గర్భిణులు, ప్రమా దాల్లో గాయపడిన వారు రక్తం కోసం పాట్లు పడుతున్నారన్నారు. రక్తదానం చేయడం వల్ల ఎంతో మంది ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు.

ప్రతి రక్తపు బొట్టు విలువైనదని, ఏదైనా పునరుత్పత్తి చేసుకోవచ్చు కానీ రక్తాన్ని మాత్రం ఎవరో ఒకరు దానం చేయడం వల్లే పొందవచ్చన్నారు. రక్త దానంపై అపోహలు వీడాలన్నారు.

ఈ కార్యక్రమంలో మునుగోడు నియోజకవర్గ ఎన్నికల ఇన్చార్జ్ పబ్బు రాజు గౌడ్, మాజీ జెడ్పిటిసి చిలుకూరి ప్రభాకర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకుల ఇంద్రసేనా రెడ్డి, కౌన్సిలర్ Md బాబా షరీఫ్, కొయ్యడ సైదులు, షాదిఖాన చైర్మన్ Md కరీం, మాజీ సర్పంచి పాశం సంజయ్ బాబు, కంచరకుంట్ల రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# డివిజన్ సమస్యలపై జోనల్ కమీషనర్‌కు విద్యాకల్పన ఏకాంత్ గౌడ్ వినతి..

**కూకట్ పల్లి డిసెంబర్ 16 వెలుతురు:** శేరిలింగంపల్లి నియోజకవర్గం వివేకానంద నగర్ డివిజన్ లోని పలు సమస్యలపై జిహెచ్ఎంసి కూకట్ పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహన్ కు రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు విద్యా కల్పన ఏకాంత్ గౌడ్ సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూకట్ పల్లి, మూసాపేట్ రెండు సర్కిల్లకు ఒక్కరే ఎంటమాలజీ అధికారి ఉండడంతో కూకట్పల్లి సర్కిల్ కు కనీసం అసిస్టెంట్ ఎంటమాలజీ సిబ్బంది కూడా లేకపోవడంతో ఫాగింగ్ పై పర్యవేక్షణ లోపించడం అదనపు బాధ్యతను ఇతర అధికారులు ఇవ్వడంతో ఫాగింగ్ పై పర్యవేక్షణ లోపించడంతో ఫాగింగ్ సరిగ్గా జరగడంలేదని, కమీషనర్ దృష్టికి తీసుకెళ్లారు. అలాగే సుమిత్ర నగర్ లోని గోపాలకృష్ణ అపార్ట్మెంట్ వద్ద పీజేఆర్ ఫంక్షన్ హాల్ వద్ద చెట్లు భారీగా పెరిగి చుట్టు పక్కన ఇండ్లకు ఇబ్బందికరంగా మారిన విషయాన్ని కూడా కమీషనర్ దృష్టికి తీసుకు వెళ్లినట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఏకాంత్ గౌడ్, గణేష్ గౌడ్, నియోజకవర్గం కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి యస్. పి. జీతేందర్, డివిజన్ నాయకురాలు నాగమణి పాల్గొన్నారు.

# అయ్యప్పస్వామి మహా పడిపూజలో పాల్గొన్న కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు..

**కూకట్‌పల్లి, డిసెంబర్ 16 వెలుతురు:** శేరిలింగంపల్లి నియోజకవర్గం వివేకానంద నగర్ డివిజన్ లోని వెంకటేశ్వర నగర్ 35 బ్లాక్‌లో ఎర్ర లక్ష్మయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమంలో కార్పొరేటర్ మాధవరం రోజాదేవి



రంగారావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రతి ఒక్కరికి ఆ అయ్యప్ప స్వామి కరుణాకటాక్షాలు నిండుగా ఉండాలని అయ్యప్ప స్వామిని ప్రార్ధించినట్లు కార్పొరేటర్ తెలిపారు.

# జిహెచ్ఎంసి అధికారుల వైఫల్యంతో నాలలో పడి బాలుడు మృతి

### సీపీఎం పార్టీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యవర్గ సభ్యులు ఐలాపురం రాజశేఖర్



**కూకట్‌పల్లి, డిసెంబర్ 16 వెలుతురు:** బాలానగర్ మండలంలోని ఫతే నగర్ డివిజన్ ఇందిరాగాంధీ పురం నాలాలో బాలుడు పడి కొట్టుక పోవడం వంటి సంఘనటలు జరగడం బాధాకరం అని సీపీఎం పార్టీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యవర్గ సభ్యులు ఐలాపురం రాజశేఖర్ ఆవేదన వ్యక్తంచేశారు. జిహెచ్ఎంసి అధికారుల నిర్లక్ష్యం కారణంగానే నిండు ప్రాణం పోయింది అన్నారు. ఇలాంటి సంఘనటలు జరగకుండా జిహెచ్ఎంసి కమిషనర్ చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. బాలుడి బాడీ హుస్సేన్ సాగర్ లో లభ్యం అవడంతో ఆవేదన వ్యక్తంచేశారు. నాళాలను, అండర్ డ్రైనేజీలు ఏర్పాట్లు చేయాలని సీపీఎం పార్టీ 6సం.ల నుండి పోరాటాలు చేస్తున్న ప్రభుత్వాలకు, జిహెచ్ఎంసి అధికారులకు ఎలాంటి చలనం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. బాధిత కుటుంబానికి నష్టపరిహారం చెల్లించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

# శ్రీరామ్ విధి వార్డ్ నెంబర్ 16లో కల్వర్టు నిర్మాణ పనులు ప్రారంభం

### సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డికు ధన్యవాదములు తెలిపిన కాలోనివాసులు..

**జహీరాబాద్ వెలుతురు డిసెంబర్ 16:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పురపాలక సంఘం పరిధిలోని శ్రీరామ్ విధి వార్డ్ నెంబర్ 16 లో కల్వర్టు లేక కాలోనివాసులు ఇబ్బంది పడుతున్న విషయాన్ని వార్డుకు సంబంధించిన నాయకులు తెలంగాణ రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ యన్.గిరిధర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో వారు వెంటనే స్పందించి కల్వర్టు నిర్మాణ పనులు పూర్తి చెయ్యాలని అధికారులకు సూచించడం జరిగింది. దింతో సోమవారం శ్రీరామ్ విధి వార్డ్ నెంబర్ 16 లో కల్వర్టు పనులను సంబదిత అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీరామ్ విధి వార్డ్ నెంబర్ 16 ప్రజలు సంతోష వ్యక్తం చెస్తూ తెలంగాణ రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ యన్.గిరిధర్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.





## సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

**- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కాంటెస్ట్ అభ్యర్థి మామిడి సుధాకర్ రెడ్డి**

**మెదక్ జిల్లా వెలుతురు డిసెంబర్ 16:**
మెదక్ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ ఆఫీస్ ముందు ధర్నా నిర్వహిస్తున్న సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులకు మద్దతు ప్రకటించిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కాంటెస్ట్ అభ్యర్థి మామిడి సుధాకర్ రెడ్డి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, వారికి మినిమం బేసిక్ ఇవ్వాలని, వారికి ఇన్సూరెన్స్ హెల్త్ సౌకర్యాలు కల్పించాలని, పార్ట్ టైం ఉద్యోగులకు 12 నెలల జీతం ఇవ్వాలని, ఈ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని వారు అన్నారు.

## తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ జన్మదిన వేడుకలో చిన్ననాటి మిత్రులు

**సంస్థాన్ నారాయణపురం, వెలుతురు డిసెంబర్16:**
తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ తన బాల్య విద్యను సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో అభ్యసించారు. ఆయన చిన్ననాటి మిత్రులు కలిసి



జన్మదినం సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు.
చిన్ననాటి బాల్య స్మృతులను నెమరు వేసుకున్నారు. అనంతరం శాలువాతో సన్మానం చేసి కేక్ కటింగ్ చేయించారు. ఈ కార్యక్రమంలో నారాయణపురం శ్రీ కంఠమహేశ్వర దేవస్థానం అధ్యక్షులు రాపర్తి కర్ణాకర్ గౌడ్,రాసమల్ల గణేష్, భాస్కర్ గుప్తా,ఎల్లంకి వెంకటేష్ గౌడ్,అభిమానులు,తదితరులు పాల్గొన్నారు.

## భువనగిరి పట్టణంలో హనుమాన్ వాడలో హాస్టల్లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

- భువనగిరి పట్టణంలో హనుమాన్ వాడలో గల తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ హాస్టల్‌ను ఆకస్మిక తనిఖీ
- ఏర్పాటు చేయని కొత్త మెనూ బోర్డు
- విద్యార్థులతో పనిచేయించడం, పెరుగుకు బదులు మజ్జిగ పోయడం
- మెనూ ప్రకారం, నాణ్యత ప్రమాణాలను పాటించని అధికారులు
- అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసిన జిల్లా కలెక్టర్ హనుమంత రావు...
- కేర్ టేకర్ రమేష్‌ని సస్పెండ్
- ప్రిన్సిపాల్‌కి షోకాజ్ నోటీసు జారీ చేసిన జిల్లా కలెక్టర్..

**భువనగిరి వెలుతురు డిసెంబర్ 16:**
సోమవారం రోజు భువనగిరి పట్టణంలోని హనుమాన్ వాడలో గల సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ కలెక్టర్ తనిఖీ చేశారు. వంటశాలను పరిశీలించారు. విద్యార్థులకు వండిన భోజనం లో కొత్త మెనూ పాటించక పోవడం జరిగింది. విద్యార్థులకి పెట్టే గుడ్లు కూడా సరిగా లేకపోవడం, విద్యార్థుల చేత పనిచేయించడం జరిగిందని కలెక్టర్ దృష్టికి రావడం జరిగింది. పెరుగుకు బదులుగా మజ్జిగ పెట్టిన తీరును కలెక్టర్ స్వయంగా





పరిశీలించారు. డైనింగ్ హాల్‌లో కొత్త మెనూ బోర్డు ఏర్పాటు చేయకపోవడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు వడ్డించే డైనింగ్ హాల్ కూడా శుభ్రంగా లేక పోవడంపై సిబ్బందిపైమండిపడ్డారు. కార్యక్రమంలోసంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ట్రాన్స్ పోర్ట్ వద్ద ప్రమాదం కూలీ కొమరయ్య మృతి

**వెలుతురు, వనస్థలిపురం, డిసెంబర్ 16:**
వనస్థలిపురం పరిధి లోని ఆటో నగర్ లో కొమరయ్య అనే వ్యక్తి మృతి చెందిన సంఘటన కలకలం రేపుతోంది, కొమరయ్య అనే వ్యక్తి ఆటో నగర్ లో ఉన్న దీపక్ ట్రాన్స్ పోర్ట్ లో పని చేస్తున్నాడు, అయితే అతను ట్రాన్స్ పోర్ట్‌కు వచ్చిన పార్సిల్స్ లోడ్‌ను దించే క్రమంలో కొమరయ్య అదుపు తప్పి పడిపోయాడు, దీంతో ఆయనకు తీవ్రగాయాల య్యాయి. దీంతో కొమరయ్య మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వనస్థలి పురం పోలీసులు సంఘటన స్థలాన్ని సందర్శించి కేసు నమోదు చేసుకుని విచారణ



జరుపుతున్నారు. కాగా పోలీసులను కొమరయ్య కుటుంబ సభ్యులు తమకు న్యాయం చేయాలంటూ డిమాండ్ చేశారు,కొమరయ్యకు న్యాయం జరగాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

## కేంద్ర మంత్రి నితిన్ గడ్కరితో సమావేశమైన జహీరాబాద్, బీదర్ ఎంపీలు

**జహీరాబాద్ వెలుతురు డిసెంబర్ 16:**
ఢిల్లీ లో పార్లమెంట్ ఆవరణంలో సోమవారం రోజు జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షేట్కార్, బీదర్ ఎంపీ సాగర్ కాంద్రే కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరితో సమావేశామై రాష్ట్ర రహదారుల అప్గ్రేడ్ చేయమని ప్రతిపాదించరు. ఈ చొరవ మన రాష్ట్ర అవసరాలను మరింత మెరుగుపరచటానికి, కనెక్టివిటీని పెంపొందించేందుకు, రవాణా అవస్థాపనను మెరుగుపర్చుడానికి మేలు జరుగుతుందని తెలిపారు. మెదక్, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలోని గుర్తించబడిన రాష్ట్ర రహదారులు (2 నోస్) వారి వ్యూహాత్మక ప్రాముఖ్యత, ట్రాఫిక్ ప్రవాహం, ప్రధాన ఆర్థిక కేంద్రాల్లో సామీప్యత మరియు భవిష్యత్ అభివృద్ధికి తోడ్పడుతుందని తెలియపరిచారు. పరిశ్రమల కేంద్రంగానూ, సంగారెడ్డిల కేంద్రంగా వికారాబాద్ జిల్లా ప్రసిద్ధి చెందినదని, మెదక్ కేంద్రంగా ఆటోమొబైల్ తయారీ కేంద్రాలు, సందర్శించడానికి అనేక పర్యాటక కేంద్రాలు కూడా ఉన్నాయన్నారు. ఇండియా సిమెంట్స్ లిమిటెడ్ (ఐసిఎల్), సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ), పెన్నా సిమెంట్స్, చెట్టినాడ్ సిమెంట్స్, వికాట్ సాగర్ వంటి ప్రధాన సిమెంటు సంస్థలు తాండూర్ వద్ద స్థాపించబడ్డాయని పేర్కొన్నారు. సమయోజనీయ, ఎంఎస్ఎన్, ఆప్టిమస్, హానర్ మొదలైనవి, ఔషధ పరిశ్రమలు రవాణా కోసం ప్రధాన ఉపాధి వనరులు ఉన్నాయన్నారు. జాతీయ రహదారుల కోసం అప్గ్రేడ్ చేయడానికి ప్రధాన రహదారి విభాగాలు ఉపయోగం పడతాయి అని తెలిపారు..



## బేతెస్థ మందిరంలో ఘనంగా క్రిస్మస్ సంబరాలు..

**జహీరాబాద్ వెలుతురు డిసెంబర్ 16:**
బేతెస్థ పరిశుద్ధాత్మ ప్రార్థన మినిస్ట్రీస్ వారు నిర్వహించిన క్రిస్మస్ వేడుకల సంబరాలు బహు ఘనంగా ముగిశాయి. క్రీస్తు పూర్వం పులిలొంకా రేజింతల్ శివార్ నాల్కల్ మండలం బేతెస్థ పరిశుద్ధాత్మ ప్రార్థన మినిస్ట్రీస్ వ్యవస్థాపక అధ్యక్షులు రెవరెండ్ డాక్టర్ ప్రశాంత్ బెంజిమెన్ ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా నిర్వహించిన క్రిస్మస్ వేడుకలు బహు ఘనంగా ముగిశాయి. శనివారం రాత్రి



జరిగిన ప్రార్థన కూడికలో రెవరెండ్ పాస్టర్ మూర్తి రాజు కాకినాడ వాక్యోపదేశం చేశారు. ఆదివారం సాయంత్రం జరిగిన క్రిస్మస్ సంబరాలలో రెవరెండ్ డాక్టర్ పాస్టర్ దివెన్ కుమార్ రాక్ చర్చ్ హైదరాబాద్ వాక్యోపదేశం చేస్తూ ఏసుక్రీస్తు జన్మించిన బెత్లహేము ప్రాంతం గురించి యేసుప్రభు జనన వృత్తాంతం క్లుప్తంగా బోధించారు.

ఆయన మాట్లాడుతూ రెవరెండ్ ప్రశాంత్ బెంజిమెన్ పాస్టర్‌తో తనకు చాలా కాలం నుండి స్నేహం ఉందని ఇంతటి అరణ్య ప్రాంతంలో ఆలయాన్ని నిర్మించి దేవుని సేవ చేస్తూ వేలాది ఆత్మలను రక్షణ వైపు నడిపిస్తున్న ప్రశాంత్ పాస్టర్ ను అభినందిస్తున్నానన్నారు.. దేవుని పిలుపు లేనిదే ఇది సాధ్యం కాదని ఈ సేవ ఇంకా ఎంతగానో అభివృద్ధి చెందాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అన్నారు. అదే విధంగా బెతిస్తా ప్రార్థన మందిరం ఈ యొక్క ప్రాంతానికి లైట్ హౌస్‌గా దేవుడు ఏర్పాటు చేసి ఉన్నాడని అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక నాయకులు శ్రీనివాస్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, రేజింతల్ శ్రీనివాస్ రెడ్డి, రాయికోడ్ మార్కెట్ కమిటీ మాజీ చేర్మెన్ యేసయ్య, డాక్టర్ సుమన్ ప్రవీణ్ తదితరులు



మాట్లాడుతూ క్రిస్మస్ సంబరాలలో పాల్గొనడం ఆనందంగా ఉందని క్రిస్మస్ సంబరాలలో చేరి వచ్చిన భక్తులకు అందరికీ క్రిస్మస్ శుభా కాంక్షలు తెలియజేశారు.

రెవరెండ్ పాస్టర్ సాలోమోన్ రాక్ చర్చ్ వారి బృందంతో గంభీర మైన స్తుతి ఆరాధన జరిగించారు.

క్రిస్మస్ కేక్ కట్ చేసి ఒకరికొకరు క్రిస్మస్ శుభా కాంక్షలు తెలియజేసుకున్నారు. చిన్నపిల్లల క్రిస్మస్ కిట్, క్రిస్మస్ సంగీతాలుపాటలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

ఈ కార్యక్రమంలో పాస్టర్లు రమేష్ బాబు, రజినీకాంత్, బ్రదర్ జార్జ్, జాన్, ప్రసన్న కుమార్, ఎఫ్రాయిమ్, సంపత్ కుమార్, యోహాన్, జైపాల్ పోలీస్, జైపాల్ మహీంద్రా, శాంసన్, అశోక్ డాక్టర్, వినోద్, నర్సింలు, రంజిత్, రాజు, దేవయ్య, జాన్ డాక్టర్, నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కాలనీ అభివృద్ధిలో నూతన కమిటీ సభ్యులు భాగస్వామ్యం కావాలి


**- కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్..**

**కూకట్‌పల్లి, డిసెంబర్ 16 వెలుతురు:**
నూతన కమిటీ సభ్యులు కాలనీ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అన్నారు. ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఆల్విన్ కాలనీ 1వ, ఫేస్ లో జరిగిన కాలనీ అసోసియేషన్ ఎన్నికల్లో గెలిచిన నూతన సభ్యులు సోమవారం డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గెలుపొందిన సభ్యులను కార్పొరేటర్ శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో శివరాజ్ గౌడ్, పోశెట్టిగౌడ్, కాలనీ అసోసియేషన్ ప్రెసిడెంట్ బి.వెంకటేష్ గౌడ్, వైస్ ప్రెసిడెంట్ రామ్ రెడ్డి, జనరల్ సెక్రటరీ కుమార చారి, జాయింట్ సెక్రటరీ రఘు, కోశాధికారి లక్ష్మీ, కల్చరల్ సెక్రటరీ హేమలత, అడ్వైజర్లు నరసింగరావు, యాదవ రెడ్డి, బిష్మ కుమార్, మనోహర్, మోహన్ రావు, మనోహర్ రెడ్డి, శంకర్, లక్ష్మయ్య, బాలరాజు, దత్తు, ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థుల మానసిన స్థితిని పెంచడమే రూమ్ టు రీడ్ లైబ్రరీ లక్ష్యం...

**జహీరాబాద్ వెలుతురు డిసెంబర్ 16:**
సంగారెడ్డి జిల్లా మాల్చేలమా గ్రామంలోగల మండల పరిషత్ ప్రైమరీ స్కూల్ నందు సోమవారం కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు బాలగోపాల్ చేతుల మీదుగా రూమ్ టు రీడ్ లైబ్రరీ ప్రారంభోత్సవం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు అనిత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు రూం టు రీడ్ లిట్రసి ఫెసిలిటేటర్, హై స్కూల్ హెచ్ఎం పాల్గొనడం జరిగింది. కార్యక్రమంలో భాగంగా తరగతి బోధన ప్రణాళికలో గ్రంథాలయ పుస్తకాలను ఏవిధంగా వినియోగించాలి, గ్రంథాలయాల పుస్తకాలు చిన్నారులకు తరగతి గదిలో బోధనకు ఏ విధంగా సమన్వయ పరుస్తూ బోధించాలో వివరించడం జరిగింది. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు బాలగోపాల్ విద్యార్థులకు పరెంట్ క్యాలెండర్ పంపిణీ చేసి వాటిని ఏవిధంగా ఉపయోగించాలో చెప్పడం జరిగింది. కొంతమంది విద్యార్థులతో పుస్తకాలను చదివించి వాటి ప్రాముఖ్యతను వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రమాదేవి, జనార్ధన్, దయాకర్, సంధ్యారాణి, శ్వేత, రూమ్ టు రీడ్ లిటరసీ ఫెసిలిటేటర్, విజయశ్రీ, విద్యార్థులు పాల్గొన్నారు.





# గ్రూప్-2 పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి

**రంగారెడ్డి, (వెలుతురు):**
రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లోని శ్రీ చైతన్య పాఠశాల నందు నిర్వహిస్తున్న గ్రూప్–2 పరీక్షా కేంద్రాన్ని పరీక్షల నిర్వహణలో భాగంగా రెండవ రోజు సోమవారం జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా అభ్యర్థుల హాజరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. పరీక్ష కేంద్రాల్లోని మౌలిక సదుపాయాలతో పాటు వైద్య



సదుపాయాలను కలెక్టర్ పరిశీలించారు. పరీక్షకు హాజరు అయ్యే అభ్యర్థులను, పరీక్ష కేంద్రాలకు అనుమతించే క్రమంలో అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని అధికారులకు సూచించారు. పరీక్షలు నిర్వహిస్తున్న తీరును నిశితంగా పరిశీలించారు. నిబంధనలు పక్కాగా పాటిస్తున్నారా లేదా అన్నది గమనించి పలు సూచనలు చేశారు. కమిషన్ మార్గదర్శకాలను పాటిస్తూ సాఫీగా పరీక్షలు నిర్వహించాలని అన్నారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నామని కలెక్టర్ వెల్లడించారు.

### జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో

# ఘనంగా అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవ వేడుకలు

**రంగారెడ్డి, (వెలుతురు):**
సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశం మందిరంలో సోమవారం జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, జిల్లా సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత మాట్లాడుతూ వికలాంగులు తమకు కేటాయించిన




పనులను సక్రమంగా నిర్వహిస్తున్నారని, వారు పని చోట ర్యాంపులు, కావలసిన సదుపాయాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. జిల్లా సంక్షేమ శాఖ అధికారి సంధ్యారాణి మాట్లాడుతూ వికలాంగులకు సంక్షేమ శాఖ తరపున అమలు అవుతున్న పథకాలను దివ్యంగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా వికలాంగుల సంఘం అధ్యక్షులు నర్సింహాచారి మాట్లాడుతూ అన్ని కార్యాలయాలలో వారికి వసతులు కల్పించాలని, అదే విధంగా సదరం సర్టిఫికేట్‌ల జారీలో జాప్యం జరగకుండా చూడాలని పిడి డీఆర్డీఏను కోరడం జరిగినది.

# బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు

### లోక్‌సభలో ఆందోళన వ్యక్తంచేసిన ప్రియాంక

### తక్షణ చర్యలకు ప్రభుత్వానికి డిమాండ్

**న్యూఢిల్లీ,డిసెంబర్16(వెలుతురు):** బంగ్లాదేశ్ ఘటనలపై కాంగ్రెస్ ఆందోళన వ్యక్తం చేసింది. ఆ దేశంలో మైనారిటీలు, హిందువులపై దాడులు జరుగుతున్న ఘటనలపై లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకాగాంధీ మాట్లాడారు. ఆ దాడులపై భారత్ గళం



విప్పాలని కోరారు. 'బంగ్లాదేశ్ లో మైనారిటీలైన హిందూ, క్రిస్టియన్‌లపై జరుగుతున్న దాడులపై భారత ప్రభుత్వం గళం విప్పాలి. ఆ దేశంతో మాట్లాడి పరిస్థితిని చక్కదిద్దేందుకు అక్కడి ప్రభుత్వాన్ని కోరాలని అన్నారు. విజయ దివస్ సందర్భంగా 1971 యుద్ధంలో అమరులైన వారికి లోక్‌సభ వేదికగా సెల్యూట్ చేశారు. ఆనాటి తూర్పు పాకిస్థాన్ పరిస్థితిని ఇందిరాగాంధీ ధైర్యంగా చక్కదిద్దారని కొనియాడారు. ఇకపోతే ప్రియాంకా బ్యాగ్ అందరి దృష్టిని ఆకర్షించింది. దానిపై 'పాలస్తీనా' అని ఇంగ్లీష్‌లో రాసి ఉంది. ఇజ్రాయెల్ దాడులతో దుర్భర పరిస్థితులను అనుభవిస్తోన్న పాలస్తీనా ప్రజలకు సంఘీభావంగా ఆమె దానిని తీసుకువచ్చారు. ఇదిలా ఉంటే.. బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్‌హసీనా దేశం విడిచివెళ్లిన తర్వాత బంగ్లాలో హిందూ మైనార్టీలపై దాడులు పెరిగి పోతున్నాయి. ముఖ్యంగా ఇస్కాన్‌కు చెందిన చిన్మయ్ కృష్ణదాస్ అరెస్టుతో పరిస్థితి మరింత దిగజారింది. ఆయనకు న్యాయసాయం అందించడంపై కూడా ఆందోళనలు నెలకొన్నాయి.దీనిపై ఇటీవల విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ మాట్లాడుతూ.. దాడులను నివారించడానికి ఆ దేశ తాత్కాలిక ప్రభుత్వం మైనారిటీలు, హిందువుల భద్రతకు తగిన చర్యలు తీసుకుంటుందని ఆశిస్తున్నట్లు వెల్లడించారు. ఈవిషయంపై ఇటీవల భారత విదేశాంగశాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ బంగ్లాదేశ్‌కు వెళ్లి అక్కడి నేతలతో చర్చలు జరిపారన్నారు.

# రాజ్యాంగ పరిరక్షణకు తీసుకున్న చర్యలేవీ..?

### నెహ్రూను విమర్శించడం ఎంతవరకు సబబు

### రాజ్యసభలో చర్చలో ఏకిపారేసిన మల్లిఖార్జున ఖర్గే

**న్యూఢిల్లీ,డిసెంబర్16(వెలుతురు):**
రాజ్యసభలో రాజ్యాంగంపై వాడీవేడి చర్చ కొనసాగింది. ఈ నేపథ్యంలో మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూపై విమర్శలు చేసిన కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, భాజపాపై కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే విరుచుకుపడ్డారు. నిర్మలా సీతారామన్ జేఎన్‌యూ నుంచి పట్టభద్రురాలు, ఆర్థిక నిపుణురాలు కావొచ్చు గానీ.. ఆమె చర్యలు మాత్రం బాగాలేవంటూ విమర్శించారు.

'భాజపా విభజన సూత్రాన్ని నమ్ముతోంది. ప్రజలకు స్వేచ్ఛ, సమానత్వం కావాలి. భాజపా పాలనలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడింది. నెహ్రూ, ఇందిరాగాంధీలను భాజపా కించపరుస్తోంది. దేశం కోసం భాజపా ఎప్పుడూ పోరాటం చేయలేదు. అలాంటి వ్యక్తులు నెహ్రూ గురించి మాట్లాడటం విడ్డూరం. రాజ్యాంగానికి భాజపా అనుకూలమా వ్యతిరేకమా ప్రాథమిక సమస్యల పరిష్కారానికి భాజపాకు ఆసక్తిలేదు అంటూ విమర్శలు చేశారు.. జాతీయ జెండా, రాజ్యాంగాన్ని ఎప్పుడూ గౌరవించని వారు.. రాజ్యాంగంపై మాకు పాఠాలు చెబుతున్నారు. అవాస్తవాలతో దేశాన్ని తప్పుదోవపట్టిస్తున్నారు. గోబెల్స్ కంటే కూడా అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్ తెచ్చిన ఆహార భద్రత చట్టం కొవిడ్ సమయంలో పేదలను ఆదుకొంది. రాజ్యాంగం బలోపేతానికి ప్రధాని ఏం చర్యలు తీసుకున్నారు ఏం సాధించామో ఎవరికి వారు ఆత్మ పరిశీలన చేసుకోవాలి' అన్నారు. 'మనుస్మృతి ఆధారంగా లేదని రాజ్యాంగాన్ని ఆరెస్సెస్ వ్యతిరేకించింది. రాజ్యాంగాన్ని, జాతీయ జెండాను వారు అంగీకరించలేదు. 2002

జనవరి 26న తొలిసారి ఆరెస్సెస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఎగురవేయాల్సిన తప్పనిపరిస్థితి ఎదురైంది.



ప్రధాని నరేంద్ర మోదీ అవాస్తవాలు చెబుతున్నారు. ప్రజలకు రూ.15లక్షలు చొప్పున వేస్తానని అవాస్తవాలు చెప్పారు. రాజ్యాంగాన్ని బలోపేతం చేసేందుకు గత 11 ఏళ్లలో ప్రధాని నరేంద్ర మోదీ ఏం చేశారు 1971లో పాకిస్థాన్‌ను భారత్ ఓడించి తూర్పుపాకిస్థాన్‌కు (నేటి బంగ్లాదేశ్) విముక్తి కల్పించిన రోజు (డిసెంబర్ 16న)ను విజయ్ దివస్‌గా చేసుకొంటున్నాం. బంగ్లాదేశ్‌లో మైనార్టీలను ఆదుకోవడంలో ఇందిరా గాంధీని భాజపా నేతలు స్ఫూర్తిగా తీసుకోవాలి' అని సూచించారు. రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా రాజ్యసభలో చర్చ మొదలయ్యింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నేత మల్లికార్జున ఖర్గే సోమవారం సభలో ప్రసంగిస్తూ కేంద్ర హోంమంత్రి అమిత్‌షాపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. 'అమిత్ షా పెద్ద వాషింగ్ మిషన్ కొన్నాడు. ఆ మెషిన్‌లోకి ఎవరెళ్లినా.. వారు పరిశుద్ధులై బయటకొస్తారు' అని ఎద్దేవా చేశారు. ప్రతిపక్షపార్టీ నేతలపై ఈడి దాడులతో కేంద్రం అవినీతిపరులుగా ముద్ర వేస్తోంది. ఆ సమయంలో వారు బిజెపిలోకి చేరుతున్నారు.

వీరలా బిజెపిలోకి చేరగానే.. అవినీతిపరులు కాస్తా.. నీతిపరులైపోతున్నారన్న అర్థం వచ్చేలా సభలో ఖర్గే ఈ వ్యాఖ్యలు చేశారు. 'ఏదైనా రాష్ట్రం లేదా ప్రాంతంలో మీకు వ్యతిరేకంగా ఓటు వేస్తే వ్యతిరేకంగా మీరు ప్రతీకారం తీర్చుకోకూడదు' అని ఖర్గే హితవు పలికారు. కాగా, ఎగువ సభలో మణిపూర్ సంక్షోభం అంశాన్ని ఖర్గే లేవనెత్తారు. ప్రధాని మోడీ ఎన్నికలు ఎక్కడుంటే అక్కడికి వెళ్తారు. కానీ ఆయన ఇంతవరకు మణిపూర్ వెళ్లలేదు. అక్కడికెళ్లేందుకు ఆయన ఇష్టపడడం లేదు అని ఖర్గే విమర్శించారు. అదే సమయంలో రాహుల్ మణిపూర్‌కి వెళ్లారని, అక్కడి యాత్ర చేపట్టారని ఖర్గే గుర్తు చేశారు. 'మీకు చాలా భద్రత ఉంది. అయినా మణిపూర్‌కి మీరెందుకు వెళ్లడం లేదు మీరు ఈ సమస్యను ఎందుకు పరిష్కరించడం లేదు' అని ఖర్గే ప్రధానిని నిలదీశారు.





# ప్రజావాణి అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా సత్వరమే పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి

### ప్రజావాణికి (67 ) ఫిర్యాదులు

**రంగారెడ్డి (వెలుతురు):** ప్రజావాణి అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి స్వీకరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందిస్తూ వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ శాఖ- 52,ఇతర శాఖలకు-15, మొత్తం 67 దరఖాస్తులు అందాయి.

అనంతరం జిల్లా కలెక్టర్ సి,నారాయణ రెడ్డి జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి శాఖల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల పథకం సర్వేను ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని తెలిపారు. ఇందిరమ్మ ఇంటింటి సర్వేను ఒక ప్రణాళికా పరంగా నిర్వహించాలని, మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటిస్తూ, తప్పిదాలకు తావు లేకుండా వివరాలను సేకరిస్తూ ఆన్లైన్ యాప్ లో నమోదు చేయాలని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పక్కాగా, పూర్తి పారదర్శకంగా జరిగేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నూతనంగా ప్రవేశపెట్టిన డైట్ ను సంక్షేమ హాస్టల్స్, రెసిడెన్షియల్ పాఠశాలల్లో అన్ని రకాల పాఠశాలలో అమలు జరిగేలా ప్రతి ఒక్కరు పని చేయాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహశీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# దేశం కోసం మోడీ 3 గంటలు మాత్రమే నిద్రపోతున్నారు

### ప్రధానిపై సైఫ్ అలీఖాన్ ప్రశంసలు - ప్రధాని మోడీతో కపూర్ ఫ్యామిలీ భేటీ

**న్యూఢిల్లీ, డిసెంబర్ 16 (వెలుతురు):**
దివంగత నటుడు రాజ్ కపూర్ శత జయంతి సందర్భంగా కపూర్ కుటుంబం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించింది. ఈ ఈవెంట్ కు ప్రధాని మోడీని కూడా ఆహ్వానించారు. ఇందుకోసం ఇటీవలే కపూర్ ఫ్యామిలీ ఢిల్లీ వెళ్లి మోడీని ప్రత్యేకంగా కలిసింది. కరీనా కపూర్, నీతూ కపూర్, కరిష్మా కపూర్, రణబీర్ కపూర్, అలియా భట్, రిద్ధిమా కపూర్ సహానీ, సైఫ్ అలీ ఖాన్ అందరూ మోడీని కలిశారు. ఆయనతో సరదాగా ముచ్చటించారు. తాజాగా ప్రధానితో జరిగిన సంభాషణను దేవర విలన్ సైఫ్ అలీఖాన్ పంచుకున్నారు. 'పార్లమెంటు సమావేశాల తర్వాత మమ్మల్ని కలవడానికి మోదీ గారు వచ్చారు. కాబట్ అప్పటికే వారు కాస్త అలసిపోయి ఉంటారని నేను ఊహించాను. కానీ ఆయన మా అందరినీ చూడగానే నవ్వుతూ చాలా బాగా మాట్లాడారు. కరీనా, కరిష్మా, రణబీర్.. అంటూ పేరు పేరునా పలకరించారు. మోడీని ఇలా కలవడం కపూర్ కుటుంబానికి చాలా గౌరవప్రదమైన విషయం'. "ఈ పర్యటనలో ప్రధాని మోడీ వ్యక్తిగతంగా నా తల్లిదండ్రుల గురించి అడిగారు. అలాగే నా బిడ్డలు తైమూర్ , జహంగీర్ ల గురించి కూడా ప్రస్తావించారు. అలాగే ఆయన మాకోసం ఒక స్పెషల్ ఆటోగ్రాఫ్ ఇచ్చారు. ప్రధాని హోదాలో మన దేశాన్నిఅభివృద్ధి చేసేందుకు మోడీ చాలా కష్టపడుతున్నారు. ఆయన నిత్యం ప్రజలను కలిసేందుకు తన సమయాన్ని వెతుక్కుంటున్నారు. రోజులో ఎంత సేపు విశ్రాంతి తీసుకుంటారని నేను మోడీని అడిగాను. రాత్రిపూట మూడు గంటలు



మాత్రమే నిద్రపోతారని తెలిసి ఆశ్చర్యపోయాను. ప్రధాని మోడీని కలవడం మాకెంతో ప్రత్యేకం. మా కోసం సమయాన్ని వెచ్చించి, మా కుటుంబాన్ని ఇంతగా గౌరవించినందుకు ఆయనకు కృతజ్ఞతలు' అని సైఫ్ చెప్పుకొచ్చారు.

# రాజ్యాంగాన్ని అపహాస్యం చేసిన చరిత్ర కాంగ్రెస్‌ది

### ఇప్పుడేమో రాజ్యాంగం అంటూ కలవరిస్తోంది

### లోక్‌సభలో దుయ్యబట్టిన మంత్రి నిర్మలా సీతారామన్

**న్యూఢిల్లీ,డిసెంబర్16(వెలుతురు):**
కుటుంబం కోసం రాజ్యాంగాన్నే మార్చివేశారని కాంగ్రెస్‌ను కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ దుయ్యబట్టారు. ఇప్పుడు మాత్రం రాజ్యాంగ పరిరక్షణ గురించి ప్రసంగాలు చేస్తోందని సీతారామన్ మండిపడ్డారు. భారత రాజ్యాంగాన్ని ఆమోదించుకొని 75వ ఏడాదిలోకి అడుగుపెట్టిన సందర్భంగా రాజ్యసభలో సోమవారం ప్రత్యేక చర్చ జరుగుతోంది. అధికార పక్షం తరపున



కేంద్రమంత్రి నిర్మలాసీతారామన్ చర్చను ప్రారంభించారు. ఈసందర్భంగా కాంగ్రెస్‌పై ఘాటు వ్యాఖ్యలు చేశారు. 'రెండో ప్రపంచయుద్ధం తర్వాత దాదాపు 50 దేశాలకు స్వాతంత్ర్యం లభించింది. అవి రాజ్యాంగాన్ని రచించుకున్నాయి. కాలక్రమంలో పలు దేశాలు తమ రాజ్యాంగం అసలు ఉద్దేశాన్ని మార్చివేశాయి. కానీ మన రాజ్యాంగం మాత్రం కాలపరీక్షలను తట్టుకొని నిలబడింది. వాక్ స్వాతంత్ర్యాన్ని అణచివేసేందుకు కాంగ్రెస్ సవరణలు చేసింది.ఇందిర హయాంలో విధించిన ఎమర్జెన్సీ, 42వ రాజ్యాంగ సవరణ గురించి ఆమె ప్రస్తావించారు. 'కాంగ్రెస్ చేసిన సవరణలు రాజ్యాంగం బలోపేతానికి కాదు. అధికారంలో ఉన్నవారిని రక్షించుకోవడానికి.. కుటుంబం కోసం ఈ ప్రక్రియను ఉపయోగించారు' అని వ్యాఖ్యలు చేశారు. ఇందిర అధికారంలో ఉన్నప్పుడు రాజ్యాంగాన్ని నిలిపివేయాలని ప్రయత్నించారని భాజపా చీఫ్, కేంద్రమంత్రి జేపీ నడ్డా విమర్శించారు. ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నుంచి అభ్యంతరం వ్యక్తమైంది.

## అసెంబ్లీలో రైతుల అరెస్టులపై చర్చించాలి

### జైల్లో ఉండాల్సిన తప్పుడు రైతులు ఏం చేశారు : పాడి కౌశిక్‌రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 16 (వెలుతురు): అసెంబ్లీలో చర్చించాల్సింది టూరిజంపై కాదని లగచర్లలో రైతులను అక్రమంగా అరెస్టు చేయడంపై చర్చించాలని బీఆర్ఎస్ నేత, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. లగచర్ల రైతులు చేసిన తప్పేంటని ప్రశ్నించారు. నెల రోజులుగా జైల్లో వేసేంత తప్పు అన్నదాతు ఏం చేశారని నిలదీశారు. గుండెపోటు వచ్చిన హీరా నాయక్‌ను బేడీలు వేసి దవాఖానకు తీసుకెళ్లారని మండిపడ్డారు. తద్వారా యావత్ తెలంగాణ రైతులను అవమానించారని చెప్పారు. లగచర్లలో జరిగిన టెర్రర్‌పై చర్చ జరగాలని వాయిదా తీర్మానం ఇచ్చామన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌తో కలిసి ఆయన అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడారు. అదానీ, అల్లుడు, అన్నదమ్ముల కోసం రేవంత్ భూసేకరణ చేస్తున్నారని ఆరోపించారు. సీఎం ఢిల్లీ టూరిజం, జైలు టూరిజం తప్ప రాష్ట్రంలో ఏమీ లేదని విమర్శించారు. వెంటనే ఎన్నికలు రావాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. ఎన్నికలు వస్తే రేవంత్ పీడ వదలిపోతుందని రైతులు అనుకుంటున్నారని చెప్పారు. ముఖ్యమంత్రిపై 75 లక్షల మంది రైతులు ఆగ్రహంతో ఉన్నారన్నారు. అప్పులపై కాంగ్రెస్ నేతలు అసత్య ప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ అన్నారు. ఆర్బీఐ హ్యాండ్ బుక్‌లో పేర్కొన్నదాని ప్రకారం తెలంగాణ అప్పు రూ.3 లక్షల 17 వేల కోట్లే. కానీ, అప్పు రూ.7 లక్షల కోట్లంటూ రాష్ట్ర ఆర్థిక మంత్రి అసెంబ్లీని తప్పుదోవ పట్టించారని చెప్పారు. మంత్రి భట్టి విక్రమార్కపై సభా హక్కుల ఉల్లంఘన నోటీసులిస్తామని వెల్లడించారు.



## కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా అసెంబ్లీలో ప్రివిలేజ్

### అప్పులపై తప్పుడ నివేదిక వెల్లడించారని ఆరోపణ

హైదరాబాద్, డిసెంబర్ 16 (వెలుతురు): రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా శాసనసభలో ప్రివిలేజ్ మోషన్ పెట్టాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కోరారు. రాష్ట్ర అప్పులపై శాసన సభను, ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుదోవ పట్టిస్తుందని ఆరోపించారు. తెలంగాణ అప్పులు కేవలం రూ.3.89 లక్షల కోట్లు అని ఆర్‌బీఐ తన నివేదికలో స్పష్టం చేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రూ.7లక్షల కోట్ల అప్పులు ఉన్నాయంటూ తప్పుదోవ పట్టిస్తున్నాయని చెప్పారు. అందుకే సభాహక్కుల నోటీసు ఇస్తున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ అప్పులపై ఆర్థిక మంత్రి ప్రసంగం పూర్తిగా అవాస్తవమని ఇటీవల "హ్యాండ్‌బుక్ ఆఫ్ స్టాటిస్టిక్స్ ఆన్ ఇండియన్ స్టేట్స్" పేరిట రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన నివేదిక నిరూపించిందని స్పీకర్ దృష్టికి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తీసుకెళ్లారు. 2014–15లో తెలంగాణ మొత్తం రుణాలు రూ.72 వేల 658 కోట్లు ఉండగా, 2024 మార్చి నాటికి ఈ రుణాల మొత్తం రూ. 3,89, 673 కోట్లకు చేరిందని ఆర్‌బీఐ వెల్లడించిందని తెలిపారు. రాష్ట్ర అప్పులపై ఆర్థిక మంత్రి ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం ఇచ్చి గత బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రతిష్టకు భంగం కలిగించారని తెలిపారు. కావున తెలంగాణ శాసనసభ కార్య విధాన, కార్యక్రమ నిర్వహణ నియమావళిలోని 168 (1) నిబంధన ప్రకారం భారత రాష్ట్ర సమితి శాసనసభా పక్షం తరఫున ఆర్థిక మంత్రిపై సభాహక్కుల ఉల్లంఘన నోటీసు ఇస్తున్నామని తమ పిటిషన్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వివరించారు.

## వచ్చే ఎన్నికల్లో బీజేపీకి ఓటేయొద్దు : ఢిల్లీ సీఎం అతిషి

న్యూఢిల్లీ, డిసెంబర్ 16 (వెలుతురు): వచ్చే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి ఓటేయొద్దని అక్కడి ఓటర్లకు పిలుపునిచ్చారు. ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న అతిషి.. సల్వార్ కమీజ్, శాలువా, రూ.500 మీ ఐదేళ్ల అవసరాలను తీర్చలేవని ప్రజలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఎన్నికలప్పుడు బీజేపీ ఇచ్చే వాటి కోసం ఆశపడొద్దని అతిషి



సూచించారు. అర్వింద్ కేజ్రీవాల్ ఆలోచనల నుంచి వచ్చిన ఉచిత కరెంట్, ఉచిత తాగునీరు, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, మొహల్లా క్లినిక్‌లలో ఉచిత వైద్యం లాంటి మీ ఐదేళ్ల అవసరాలను తీర్చగలుగుతాయని చెప్పారు. ఢిల్లీలో పేదల కోసం పనిచేసే నాయకుడు అర్వింద్ కేజ్రీవాల్ ఒక్కరేనని అతిషి అన్నారు. కాబట్టి పేదలు బీజేపీ నాయకులతో చాలా జాగ్రత్తగా ఉండాలని అతిషి చెప్పారు. ఎందుకంటే బీజేపీ నాయకులు అభివృద్ధి పేరుతో పేదల ఆవాసాలను ధ్వంసం చేస్తారని, పేదల ఓట్లను తొలగిస్తారని వ్యాఖ్యానించారు. ఢిల్లీలో వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో అధికార ఆప్, ప్రతిపక్ష బీజేపీ నేతలు ఇప్పటి నుంచే వ్యూహాలకు పదును పెడుతున్నారు.


## మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ నివాసంలో చోరీ

హైదరాబాద్,డిసెంబర్16(వెలుతురు): బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ నివాసంలో భారీ దొంగతనం జరిగింది. జూబ్లీహిల్స్ లోని ఆయన నివాసంలోకి కొంతమంది దుండగలు చొరబడి దొంగతనానికి పాల్పడినట్లు తెలుస్తోంది. ఇంట్లో ఉన్న 7.5 లక్షల రూపాయల నగదును దుండగులు చోరీ చేసినట్లు సమాచారం. ఆదివారం రాత్రి ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. విషయం తెలుసుకున్న జైపాల్ యాదవ్ ఫిలిం నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఆయన నివాసానికి వెళ్లి పరిశీలించారు. ఈ ఘటనపై విచార చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## పురిటినొప్పులతో గ్రూప్-2 పరీక్ష

### గర్భిణికి అండగా అధికార యంత్రాంగం

నాగర్‌కర్నూల్,డిసెంబర్16(వెలుతురు): నాగర్‌కర్నూల్ జిల్లాలో ఆసక్తికర ఘటన చోటు చేసుకుంది. పురిటి నొప్పులతోనే ఓ అభ్యర్థి గ్రూప్–2 పరీక్ష రాశారు. బల్మూరు మండలం బాణాల గ్రామానికి చెందిన రేవతి నాగర్ కర్నూల్ పట్టణంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో గ్రూప్–2 పరీక్ష రాసేందుకు వెళ్లారు. పరీక్ష రాస్తున్న సమయంలోనే ఆమెకు పురిటి నొప్పులు వచ్చాయి. అప్రమత్తమైన పరీక్ష నిర్వహణ సిబ్బంది.. ఆమెను ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు సిద్ధమయ్యారు. అందుకు ఆమె అంగీకరించలేదు.



పరీక్ష రాస్తానని చెప్పారు. ఆమె కాన్పు తేదీ ఇవాళే కావడంతో అందరూ కాస్త ఆందోళనకు గురయ్యారు. అయినా, ఆమె పట్టు వదలకుండా పరీక్ష రాస్తానని చెప్పడంతో.. అధికారులు ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ సంతోష్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ ఆదేశాల ప్రకారం.. పరీక్ష కేంద్రంలో 108 అత్యవసర వాహనాన్ని అందుబాటులో ఉంచారు. ప్రత్యేక వైద్య సిబ్బందిని ఏర్పాటు చేశారు. ఆమెకు ఎప్పుడు తీవ్ర నొప్పులు వచ్చినా.. ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు అన్నీ సిద్ధంగా ఉంచారు. రేవతి భర్త, ఆమె తల్లి అందుబాటులో ఉన్నారు.

# సమస్యలపై చర్చించాలంటే పారిపోతున్న కాంగ్రెస్

### గురుకులాలంటేనే కేసీఆర్ గుర్తుకొస్తారు - కాంగ్రెస్ వద్ద సరైన లెక్కలు కూడా లేవు : మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 16 (వెలుతురు): కాంగ్రెస్ ప్రభుత్వం వద్ద స్కూళ్లపై సరైన లెక్కలు కూడా లేవని, స్కూళ్లలో జీరో ఎన్‌రోల్‌మెంట్‌పై చర్చించాలని కోరామని, విద్యాలయాలపై తమ ప్రశ్నను చర్చకు అనుమతించలేదని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. గురుకులాలు అంటే ఈ ప్రభుత్వానికి కేసీఆర్‌నే కనిపిస్తున్నారని తెలిపారు. కేసీఆర్ హయాంలో ఏర్పాటు చేసిన గురుకులాల్లో 5 లక్షల మంది చదువుతున్నారని సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. ప్రభుత్వ స్కూళ్లలో ఈ ఏడాది 2 లక్షల మంది తక్కువగా చేరారని పేర్కొన్నారు. దీనిపై ప్రభుత్వం ఎందుకు ఆలోచించడం లేదని ప్రశ్నించారు. కేవలం 10 మంది విద్యార్థులున్న దాదాపు 4 వేల స్కూళ్లు ఉన్నాయని చెప్పారు. 10 మందికి లోపు విద్యార్థులున్న స్కూళ్ల టీచర్లను వేరే చోటికి బదిలీ చేస్తున్నారని మండిపడ్డారు. దాదాపు



6 వేల స్కూళ్లు మూసివేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని అన్నారు. కేసీఆర్ హయాంలో విద్యార్థులకు మార్నింగ్ బ్రేక్‌పాస్ట్ ఇచ్చామని సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. ఈ ప్రభుత్వం మార్నింగ్ బ్రేక్‌ఫాస్ట్ ఎత్తిసిందని అన్నారు. విషాహారం, కుక్క, పాముకాట్లతో గురుకులాల్లో విద్యార్థులు చనిపోతున్నారని సబితా ఇంద్రారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. వీటిపై అసెంబ్లీలో బీఆర్ఎస్ అడిగిన ప్రశ్నలకు ప్రభుత్వం పారిపోయిందని అన్నారు. అటు అసెంబ్లీలో.. ఇటు బయట ప్రభుత్వం సమాధానం చెప్పడం లేదని విమర్శించారు.

మేం స్కూళ్లకు వెళ్లి చూస్తామంటే కూడా అనుమతించడం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యారంగం నిర్వీర్యమైందని పేర్కొన్నారు. విద్యారంగానికి సంబంధించి కాంగ్రెస్ 20 హామీలు ఇచ్చిందని తెలిపారు. కానీ ఇచ్చిన హామీల్లో ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని చెప్పారు. మూసివేయాలని చూస్తున్న స్కూళ్లపై రాష్ట్ర ప్రభుత్వం సమీక్షించాలని సూచించారు.

# ప్రజా సమస్యల నుంచి పారిపోతున్న కాంగ్రెస్

### ఎంత తప్పించుకున్న కాంగ్రెస్ పాలనను ఎండగడతాం : జగదీశ్‌రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 16 (వెలుతురు): ప్రజా సమస్యల నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం పారిపోతుందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకులు జగదీశ్ రెడ్డి విమర్శించారు. ఎంత తప్పించుకున్నా ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ఎండగడుతూనే ఉంటామని ఆయన స్పష్టం చేశారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద సోమవారం జగదీశ్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం తీరుపై నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి సమయం ఇవ్వాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చెప్పారని మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి గుర్తుచేశారు. రేవంత్ రెడ్డి సర్కార్ మాత్రం అధికారంలోకి వచ్చిన రోజు నుంచే ప్రజలపై పడిందని



విమర్శించారు. హైడ్రా పేరుతో పేదల ఇండ్లను కూల్చివేసిందని మండిపడ్డారు. మూసీ సుందరీకరణ పేరుతో బడాబాబులకు దోచిపెట్టే కుట్రకు తెరతీసిందని ఆరోపించారు. లగచర్ల రైతులపై ప్రభుత్వం నిర్బంధం ప్రయోగిస్తోందని తెలిపారు. జైలులో ఉన్న లగచర్ల గిరిజన రైతులపై ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గుండెపోటు వచ్చిన రైతుకు బేడీలు వేసి ఆస్పత్రికి తీసుకెళ్లారని అన్నారు. లగచర్ల ఘటనపై చర్చకు కోరితే ప్రభుత్వం పారిపోయిందని తెలిపారు. అసెంబ్లీ స్పీకర్ రాష్ట్ర ప్రభుత్వంలో భాగం కాదన్న విషయం గుర్తించాలని జగదీశ్ రెడ్డి సూచించారు.

స్పీకర్ మా నోరు నొక్కుతున్నారని తిట్లు తిట్టేవారికే అవకాశం కల్పిస్తున్నారని ధ్వజమెత్తారు. లగచర్ల రైతుల అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. రాష్ట్రంలో ధాన్యం ఉత్పత్తిపై ప్రభుత్వం కాకి లెక్కలు చెబుతోందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సమస్యలన నుంచి పారిపోతోందని అన్నారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ఎండగడుతూనే ఉంటామని స్పష్టం చేశారు.

# ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభం

### భోగివరకు ఆలయాల్లో తిరుప్పావై ప్రవచనాలు

తిరుమల,డిసెంబర్16(వెలుతురు): ఆలయాల్లో ధనుర్మాసం ప్రారంబం అయ్యింది. ప్రతిరోజూ వైష్ణవాలయాల్లో గోదాదేవి పాశురాలు పఠిస్తారు. వణికిస్తున్న చలిలో ప్రజలంతా ఉదయాన్నే లేచి తలస్నానమాచరించి ధనుర్మాస పూజలు ప్రారంభించారు. వైష్ణవాలయాల్లో పాశురాలు జపించి గోదాదేవికి ప్రత్యేక పూజలు చేశారు. ధనుర్మాసం భోగి పండగ వరకు ఉంటుంది. రోజూ గోదాదేవికి భక్తులు పూజలు చేస్తారు. ఆఖరి రోజున అంటే భోగి పండగ నాడు గోదాశ్రీరంగనాథుల కల్యాణం నిర్వహించి పూజను ముగిస్తారు. మధ్యలో వచ్చే ముక్కోటి ఏకాదశి నాడు ఉపవాస దీక్షలు చేస్తారు. అది ఈసారి డిసెంబల్ 26న వచ్చింది.సంక్రాంతి వేడుకలు ప్రారంభానికి సూచికగా ధనుర్మాసనం ప్రారంభం రోజునే నెల గంట మోగుతుంది. ఇవాల్టి నుంచే గ్రామాల్లో హరిదాసుల కీర్తనలు వినిపిస్తాయి. డూడూ బసవన్న విన్యాసాలు కనిపిస్తాయి. ఇంటి ముంగిట రంగవల్లులు దర్శనమిస్తాయి. సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశించే వరకు కాలాన్ని ధనుర్మాసంగా చెబుతారు. ఈ టైంలో సూర్యుడు ధనుస్సులోకి ప్రవేశిస్తాడు దాన్ని సూచించేలా ఆలయాల్లో గంటను మోగిస్తారు. దీన్నే నెల గంట అంటారు. అప్పటి నుంచి ప్రతి రోజూ వైష్ణవ ఆలయాల్లో వేకువ జామున 4గంటల నుంచి పూజలు చేస్తారు. తిరుమలలోని వెంకటేశ్వర స్వామి ఆలయం, యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానంలో కూడా ధనుర్మాస ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. యాదగిరిగుట్ట ఆలయంలో ఉదయం నుంచి 30 రోజుల పాటు ఉదయం 5 గంటలకు తిరుప్పావై నిర్వహిస్తారు. జనవరి 13న గోదా కళ్యాణం, 14 న ఒడిబియ్యం కార్యక్రమంతో జరగుతుంది.

తిరుమల వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఏడాది పొడవునా సుప్రభాత సేవను తెల్లవారుజామున సమర్పించినప్పటికీ ఈ నెల రోజుల పాటు మాత్రం సుప్రభాతం కాకుండా తిరుప్పావై పారాయణం చేస్తారు. తనను తాను ద్వాపర యుగానికి చెందిన శ్రీదేవి చిన్న విగ్రహం పక్కనే ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామివారి



వక్షస్థలంపై ధనుర్మాసం చివరి వరకు బంగారు చిలుకను అలంకరిస్తారు. తిరుప్పావై పూర్తిగా ఏకాంతంగా పఠిస్తారు. ధనుర్మాస సమయంలో భగవంతుడికి సహస్ర నామార్చన కోసం పవిత్రమైన తులసికి బదులుగా బిల్వ ఆకులను ఉపయోగిస్తారు. పవిత్ర ధనుర్మాసాన్ని జనవరి 13వ తేదీ వరకు తిరుపతితోపాటు దేశవ్యాప్తంగా 232 కేంద్రాల్లో తిరుప్పావై ప్రవచనాలు చేయనున్నారు. టీటీడీ ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేసింది. తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరం, కెటి రోడ్డులోని శ్రీ వరదరాజస్వామివారి ఆలయంలో తిరుప్పావై ప్రవచనాలు పారాయణం చేశారు. భాగవతం దశమ స్కందంలో చెప్పినట్టు 12 మంది ఆళ్వారులలో ఒకరైన శ్రీ గోదాదేవి ధనుర్మాసం వ్రతం చేశారు. ఈ వ్రతం చేయడం వల్ల దేశం సమృద్ధిగా, సుభిక్షంగా ఉంటుంది. ద్వాపరయుగంలో గోపికలు ఈ వ్రతాన్ని ఆచరించి శ్రీకృష్ణుని కృపకు పాత్రులయ్యారని చెబుతారు. ఈ వ్రతం ఎలా చేయాలనే విషయాన్ని శ్రీ గోదాదేవి 30 పాశురాలతో కూడిన తిరుప్పావై దివ్యప్రబంధాన్ని లోకానికి అందించారు. భగవంతునికి సేవ చేయడమే ఈ తిరుప్పావై సారాంశం. ఈ వ్రతం ఒకరు చేయడం కంటే అందరినీ కలుపుకుని చేస్తే ఫలితం ఉంటుందని పండితులు చెబుతారు . ఈ సంప్రదాయం ప్రకారం దేశవ్యాప్తంగా గల అన్ని వైష్ణవ దేవాలయాల్లో తిరుప్పావై శాత్తు మొర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

# జైపూర్‌లో కోచింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో గ్యాస్ లీక్

### అపస్మారక స్థితికి చేరుకున్న పలువురు విద్యార్థులు

జైపూర్,డిసెంబర్16(వెలుతురు): రాజస్థాన్ రాజధాని జైపూర్‌లోని ఒక కోచింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో గ్యాస్ లీక్ అయింది. దీంతో చాలా మంది విద్యార్థులు అపస్మారక స్థితికి చేరుకున్నారు.ఈ విషయం ప్రభుత్వం దృష్టికి చేరుకోవడంతో వెంటనే రంగంలోకి దిగిన గ్రేటర్ మేయర్ సౌమ్య గుర్జార్ చర్యలు తీసుకున్నారు. ఉత్కర్ష్ కోచింగ్ సెంటర్ భవనానికి సీలు వేశారు. ప్రమాదం ఎలా జరిగిందో కార్పొరేషన్ బృందం ఆరా తీస్తోంది. కోచింగ్ సెంటర్ నిర్వహణలో అనేక లోపాలున్నట్లు కార్పొరేషన్ బృందం గుర్తించింది.

గోపాల్‌పురా ప్రాంతంలోని రిద్ధి సిద్ధిలో ఉంది ఈ కోచింగ్ సెంటర్. ఉత్కర్ష్ కోచింగ్ సెంటర్‌లో అకస్మాత్తుగా కొంతమంది



విద్యార్థులు తరగతి గదిలోనే స్పృహతప్పి పడిపోవడంతో కలకలం రేగింది. తరగతి గదిలో దుర్వాసన వ్యాపించడంతో 10 మందికి పైగా విద్యార్థుల ఆరోగ్యం ఒక్కసారిగా క్షీణించింది. విద్యార్థుల పరిస్థితి చూసి వెంటనే అంబులెన్స్‌కు సమాచారం అందించారు.





విద్యార్థులను తరగతి గది నుంచి బయటకు తీసి సమీపంలోని ఆస్పత్రికి తరలించారు.సమాచారం మేరకు ఆదివారం సాయంత్రం 6.45 గంటల ప్రాంతంలో పిల్లలు కోచింగ్ క్లాస్‌లో కూర్చుని చదువుకుంటున్నారు. అకస్మాత్తుగా ఏసీ లోపల నుంచి గ్యాస్ లీక్ అయి.. దుర్వాసనతో ఉన్న వాయువు గదిలో వ్యాపించింది. ఈ దుర్వాసనతో విద్యార్థుల ఆరోగ్యం క్షీణించింది. దీంతో కోచింగ్ యాజమాన్యం వెంటనే 108కి సమాచారం అందించింది. 108 అంబులెన్స్ సంఘటనా స్థలానికి చేరుకుని విద్యార్థులందరినీ సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రికి



తరలించారు.ప్రస్తుతం విద్యార్థుల పరిస్థితి మెరుగ్గా ఉందని వైద్యులు తెలిపారు. ప్రస్తుతం అందరూ వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారు. ఇతర పిల్లలు కూడా తరగతి గదిలో కూర్చున్నారు, వారిలో 10 మంది ఆరోగ్యం క్షీణించింది. తరగతులు జరుగుతున్న సమయంలో స్టూడెంట్స్ కు ఈ పరిస్థితి ఎదురైంది. విద్యార్థులు ఒక్కసారిగా స్పృహతప్పి పడిపోవడంతో అంబులెన్స్‌కు సమాచారం అందించారు. ఈ విషయం తెలిసి కోచింగ్ సెంటర్ వెలుపల భారీగా జనం గుమిగూడారు. విద్యార్థులు నడిచే స్టేజ్ లో కూడా లేకపోవడంతో అంబులెన్స్ వద్దకు వారిని ఎత్తుకుని చేర్చినట్లు తెలుస్తోంది.ప్రమాద వార్త తెలియగానే జైపూర్ గ్రేటర్ మేయర్ సౌమ్య గుర్జార్ ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ప్రమాదం ఎలా జరిగిందన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. విచారణ బృందాన్ని కూడా ఏర్పాటు చేశారు.




డైటింగ్...! ఊబకాయం తగ్గడానికో, స్లిమ్‌గా కనిపించటానికో, జీరోసైజ్ కోసమో నేటి యువత అనుసరిస్తున్న విధానం. ఒకప్పుడు పూర్తిగా కడుపు మాడ్చుకోవడం, లేదంటే తినే ఆహారాన్ని మితం చేసుకోవడం చేసేవారు. దానివల్ల బరువు తగ్గుతామని తలపోసేవారు. కానీ నేటి డైటింగ్ ప్లాన్‌లు పూర్తిగా దానికి వ్యతిరేకం. ముల్లును ముల్లుతోనే తీయాలన్న చందంగా కొవ్వును కొవ్వుతోనే కరిగించాలనుకుంటున్నారు. అస్తవ్యస్తమైన ఆహారపు అలవాట్ల వల్ల వచ్చిన ఊబకాయాన్ని అదే ఆహారంతో తరిమికొట్టాలనుకుంటున్నారు. దాంతో రకరకాల డైట్‌లు విస్తృతంగా ప్రచారంలోకి వస్తున్నాయి. వీరమాచినేని డైట్, కీటోజెనిక్, అట్కిన్స్ డైట్, ట్యూనా డైట్‌లు ఆ కోవలోనివే.

### అసలేమిటీ డైట్ ప్లాన్‌లు?

శరీర బరువు మోస్ట్ ఇంపార్టెంట్ సమస్యగా మారిన నేటి పరిస్థితుల్లో, కడుపు నిండా ఇష్టమైనవి తినడం కలగా మారుతోంది. కేలరీలు కొలుచుకుని తినడం, తినేవును పెంచేసుకుంటున్నారు. పెరిగిన శరీరాన్ని తగ్గించుకోవటానికి, ఆ తరువాత తీరిగ్గా ఆలోచిస్తున్నారు. డైట్ ప్లాన్‌ల గురించి ఆరా తీస్తున్నారు.

ఇంకో ముఖ్య కారణం తీరిక లేని జీవితం! పొద్దున్న లేచింది మొదలు ఉరుకులు పరుగులు. పిల్లల దగ్గర నుంచి పెద్దల వరకూ, ఈ పోటీప్రపంచంలో ఎవరి షెడ్యూల్ వారిది. దాంతో శారీరక శ్రమకు, వ్యాయామానికి ప్లానింగ్ చేసుకోవాల్సి వస్తోంది. శారీరక అలసట లేక, చెమట చిందించక, శరీరం అమాంతం పెరిగిపోతోంది. దాన్ని తగ్గించుకోవడానికి ఆ తరువాత తంటాలు పడుతున్నారు. ఇవే కాక ఇంకా రకరకాల కారణాలు మనిషిని, స్త్రీ, పురుష భేదం లేకుండా డైటింగ్‌వైపు నడిపిస్తున్నాయి.

### ప్రయోజనమేనా?

అధిక బరువును వెంటనే తగ్గించుకోవాలనే అత్యాశతో, అతిగా డైట్ ప్లాన్ చేసుకుంటారు. సమయం లేదు, అంత ఓపిక లేదు, ఫలితం వెంటనే రావాలి వంటి సాకులతో కఠినంగా, ఆలోచన లేకుండా, డైటింగ్ చేస్తుంటారు. దీనివల్ల ప్రయోజనం కన్నా అనర్థమే ఎక్కువ. నిజానికి ఏ ఒక్క డైటూ వందశాతం ఫలితం ఇవ్వదు. శారీరక, మానసిక ఆరోగ్యాలు, అలవాట్లు, శరీరతత్వం, నివసించే ప్రాంతం, జన్యు సంబంధ సమస్యలు, వ్యాధులు మొదలైన అనేక అంశాలను పరిగణనలోనికి తీసుకొని డైట్ చేస్తే మంచి ఫలితం ఉంటుంది. నిజానికి ఎవరో ఒకరికి సత్ఫలితాలు వచ్చాయని, వారినే ఫాలో అవుదామనే ధోరణి ప్రజల్లో ఎక్కువైంది.

నిజానికి కొన్ని తాత్కాలికంగా పని చేసినప్పటికీ, భవిష్యత్తులో జీవక్రియలకు ఆటంకంగా మారి ఆరోగ్య సమస్యలు తెచ్చే ప్రమాదాలు లేకపోలేదు. ఈ విషయం గమనించకుండా, ఏది పాటించాలి? ఏది మంచి ఫలితాలను ఇస్తుంది? ఇవేవీ పూర్తిస్థాయిలో తెలుసుకోకుండా ఏ డైటూ సక్రమంగా పాటించక దీర్ఘకాలిక సమస్యలను తెచ్చుకుంటున్నారు కొందరు.



# డైట్ ప్లాన్‌లు...

## అవసరమా? అనర్థమా?

ప్రతీదాంట్లో ప్రోటీన్లు, కార్బోహైడ్రేట్లు, ఫ్యాట్ పరిమాణాలను బేరీజు వేసుకోవడం.... తిండి కూడా కూడికలు, తీసివేతలు చందంగా మారింది. ఇలాంటి పరిస్థితుల్లో ట్రెండీ డైట్‌ప్లాన్‌ల వైపు మొగ్గుచూపుతున్నారు.

డైటింగ్ అంటే కడుపు మాడ్చుకోకుండా, కడుపు నిండా తింటూనే తీసుకునే ఆహారం ద్వారా అదనపు కేలరీలు చేరకుండా చూసుకోవడం. ఈ సూత్రం ఆధారంగా రకరకాల డైట్ ప్లాన్స్ రూపొందించబడ్డాయి. అయితే ఒక్కో డైట్ ప్లాన్‌ది ఒక్కో కాన్సెప్ట్. శరీరపు చక్కెర మోతాదును నియంత్రణలో ఉంచి బరువు పెరగకుండా అడ్డుకునేవి కొన్నయితే, కొవ్వు పదార్థాలు లేకుండా పోషకాలు మాత్రమే శరీరానికి అందేలా రూపొందించినవి మరికొన్ని.

అలాగే శరీర అధిక బరువు తగ్గాలంటే కేవలం ద్రవాహారం మాత్రమే తీసుకోవాలని కొందరు డైట్‌ప్లాన్ రూపొందిస్తే, కొవ్వును కొవ్వుతోనే కరిగించాలని డైట్‌ప్లాన్ తయారుచేసుకునేవారు మరికొందరు. అంతేకాక, పచ్చికూరలు మాత్రమే తీసుకునే డైట్, పాత తరపు ఆహారపు విధానం...అంటే ఆహారంలో చిరుధాన్యాలు చేర్చుకోవడం వంటివి...నేడు విస్తృతంగా ప్రచారం పొందుతున్నాయి.

### ఎందుకంటే...?

ముఖ్యంగా మనం చెప్పుకోవాల్సింది మారిన జీవనశైలి గురించి! ఆధునికత, నాగరికత, సాంకేతికత పెరిగి, జీవనశైలి పూర్తిగా మారింది. తినే వేళలు, సరైన ఆహారం తీసుకోకపోవడం, రుచుల పేరిట జంక్‌ఫుడ్ తీసుకోవడం, అలాగే బిజీ షెడ్యూల్‌తో స్వయంగా వండుకుని తినలేకపోవడం, శారీరక శ్రమ లేకపోవటం, ఒత్తిళ్ళు...ఇలా రకరకాల కారణాల వల్ల ఒబేసిటీ బారిన పడుతున్నారు.

ఆ తరువాత మనం చెప్పుకోవాల్సింది...మితం లేకపోవడం! ఆహారనియమాలు పాటించకపోవడం! వెజ్, నాన్ వెజ్...ఐటెమ్ ఏదైనా, రకరకాల వెరైటీ రుచులు కళ్ళ ముందు కనిపిస్తుండటంతో... ఏం తింటున్నామో, ఎంత తింటున్నామో తెలియకుండా అన్నింటినీ ఆస్వాదించేయాలన్న తపన. దాంతో తెలియకుండానే తమ శరీర బరువును పెంచేసుకుంటున్నారు.

### ఇలా చేస్తే మేలు!

- ఏ పనికయినా ప్లానింగ్, పద్ధతి ముఖ్యం. డైట్ ప్లాన్స్ అనుసరించేముందు కూడా ఒక క్రమమైన పద్ధతి అవసరం, అది ఏరకమైన డైట్ అయినా సరే! ఎవరో పాటిస్తున్నారనో, సోషల్‌మీడియాలో వైరల్ అయిందనో కాకుండా, మీ శారీరకతత్వాన్ని దృష్టిలో పెట్టుకుని, మీకు ఏది సూట్ అయితే ఆ డైట్‌నే పాటించాలి.
- డైట్ చెయ్యడం వరకు బాగానే ఉంటుంది. కానీ దీన్ని ఆపేసిన తర్వాత మళ్లీ బరువు పెరుగుతారు. దీని వల్ల రెసిస్టెంట్ కొవ్వు పెరుగుతుంది. ఏ డైట్ అయినా సరే మూడు నెలలు తప్పనిసరిగా చెయ్యాలి. ఫలితంగా బరువు తగ్గుతారు. అప్పుడు ఆ తగ్గిన బరువునే కనీసం ఏడాదిన్నర పాటు మెయిన్‌టెయిన్ చెయ్యాలి. అలా చెయ్యగలిగితే మళ్లీ బరువు పెరిగే అవకాశం ఉండదు. సమతుల్యత లోపించడం వల్ల బరువు పెరగడం.. ఇతర ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి. కాబట్టి మన జీవనవిధానంలోనే మార్పులు చేసుకోవడం వల్ల ఆరోగ్యపరంగా శాశ్వత ఫలితాలు పొందవచ్చు.
- నేటి యువత ఇంటర్నెట్ ప్రభావంతో, ఇష్టం వచ్చినట్టుగా సొంత ప్రయోగాలు చేస్తోంది. ట్రెండింగ్, ఫాలోయింగ్ అంటూ నిజానిజాలు తెలుసుకోకుండా, ఒకదాని తరువాత ఒకటిగా...డైట్ ప్లాన్స్‌తో ప్రాణాలమీదికి తెచ్చుకుంటోంది. బరువు తగ్గడమన్నది సహజ పరిస్థితుల్లో, ఆరోగ్యకరంగా తగ్గాలి తప్ప, అత్యుత్సాహంతో దేన్నిపడితే దాన్ని ఫాలో అవకూడదు. ఇలా చేయడం వల్ల ఉన్న సమస్యకు మరికొన్ని సమస్యలు తోడవుతాయి. కాబట్టి నేటి వ్యాపార ప్రపంచంలో, ఎవరికీ, దేనికీ మీరు టార్గెట్ కావద్దు.
- పద్ధతి ప్రకారం చేసే ఏ డైట్ అయినా మంచిదే. మహిళలకైనా, పురుషులకైనా న్యూట్రీషియన్ బేస్డ్ డైట్ చాలా ఉపయోగకరంగా ఉంటుంది. కాకపోతే ఏ రకమైన డైట్‌ను తీసుకున్నా, బ్యాలెన్స్‌డ్‌గా తీసుకోవాలి.



### కొన్ని టాప్ లిస్ట్ డైట్ ప్లాన్స్

గత సంవత్సరం కొన్ని రకాల డైట్ ప్లాన్‌లు అత్యంత ప్రాచుర్యం పొందాయి. సెలబ్రిటీల నుంచి సామాన్యుల వరకు ఎంతోమంది ఈ డైట్ ప్లాన్లను ఫాలో అయ్యారు. వాటిల్లో కొన్నిటి గురించి తెలుసుకుందాం.

#### కీటో డైట్!

గతేడాది ప్రపంచవ్యాప్తంగా గూగుల్‌లో ఎక్కువ మంది సెర్చ్ చేసింది ఈ కీటో డైట్ గురించేనట! అంతలా ప్రాముఖ్యం సంతరించుకున్న ఈ కీటో డైట్ ఎప్పటి నుంచో ఉంది. ఇందులో ప్రధానంగా కార్బోహైడ్రేట్లను ఆహారంలో తీసుకోకుండా, అధికశాతం కొవ్వుపదార్థాలు, ప్రోటీన్స్ తీసుకుంటూ, అతి తక్కువ కాలంలో అధిక బరువుకు స్వస్తి పలకవచ్చనే కాన్సెప్టుతో వచ్చిందే... ఈ కీటో డైట్!

#### వీరమాచినేని డైట్

నేడు తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రాధాన్యం సంతరించుకుందీ డైట్! ఎంతోమంది ఈ డైట్‌ను ఫాలో అవుతున్నారు. వీరమాచినేని రామకృష్ణారావు రూపొందించిన ఈ డైట్ ప్రధాన ఉద్దేశం... కొవ్వును కొవ్వుతోనే కరిగించడం. ముఖ్యంగా మధుమేహులకు ఉపయోగకరంగా ఉంటుందనే ప్రచారంతో ఇప్పుడీ డైట్ బాగా ఫేమస్ అయింది.

#### రా ఫుడ్ డైట్

తినే ఆహారం, తాగే పానీయాలు అన్నీ నేచురల్‌గా ఉండాలి. ఎలాంటి ప్రాసెసింగ్ చేయొద్దు. ఒకరకంగా ముడి ఆహారం మాత్రమే తీసుకోవడం ఈ డైటింగ్ విధానం.

#### సౌత్ బీచ్ డైట్

ఇన్సులిన్ స్థాయిలను తగ్గించేందుకు ఈ డైటింగ్ ఉపయోగపడుతుంది. కార్బోహైడ్రేట్స్ తీసుకోవడం వల్ల బరువు తగ్గొచ్చు అనేది దీని ఉద్దేశం.

#### మెడిటెర్రేనియన్ డైట్

బీన్స్, నట్స్.. తాజా పండ్లు, ఉడకబెట్టని ఆహారం తీసుకోవడం ద్వారా బరువు తగ్గొచ్చని మెడిటెర్రేనియన్ డైటింగ్ సూచిస్తుంది.

#### అట్కిన్స్ డైట్

శరీరంలోని ఇన్సులిన్ స్థాయిలను నియంత్రిస్తుంది. దీనిలో భాగంగా తక్కువ మోతాదు కార్బోహైడ్రేట్స్‌ను తీసుకోవాల్సి ఉంటుంది.

వేగాన్ డైట్

గుడ్డు.. పాలు.. తేనె తినొచ్చు. వీటితో పాటు శాకాహారం తీసుకోవాలి. ఈ డైటింగ్ విధానాన్ని ఫిలాసఫీతో పోలుస్తుంటారు నిపుణులు. ప్లాంట్‌బేస్డ్ ఫుడ్ తీసుకోవడానికి అవకాశాలు ఉంటాయి.

#### వెయిట్ వాచర్ డైట్

చాలా పురాతనమైన విధానం. 1960 నుంచే ఇది వాడుకలో ఉంది. తిండి కన్నా వ్యాయామానికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. శరీర బరువు తగ్గాలంటే కచ్చితంగా నిర్దిష్టమైన వ్యాయామం అవసరమేది ఈ డైటింగ్ ఫార్ములా.

#### ట్యూనా డైట్

ఈ రకమైన డైట్ వల్ల మూడు రోజుల్లో 4 కేజీల బరువు తగ్గుతారట. దీనినే కెమికల్ బ్రేక్‌డౌన్ డైట్ అని కూడా పిలుస్తారు. ఈ రకమైన డైట్‌లో ముఖ్యంగా కేలరీలు తక్కువగా ఉండి, అధికమొత్తంలో ప్రోటీన్లను కలిగి ఉన్న ట్యూనా ఫిష్‌ను వాడతారు.

#### లిక్విడ్ డైట్

ఇందులో కేవలం ద్రవాహారం మాత్రమే తీసుకుంటారు. ఘనపదార్థం జోలికి వెళ్ళరు. కేవలం మంచినీరు, పళ్ళరసాలు, కూరగాయల రసాలు... మాత్రమే ఈ డైట్‌ను ఫాలో అయ్యేవారు తీసుకుంటారు.

## బరువు తగ్గడానికి...

బరువు తగ్గాలనుకుంటున్నారా? వ్యాయామం, డైటింగులతో పాటు దీనికి మరో సులువైన మార్గం కూడా ఉంది. సింపుల్ జ్యూస్‌తో ఈ సమస్యను అధిగమించవచ్చు.



నిమ్మరసంలో కొత్తిమీర కలిపిన జ్యూసు తాగాలి. ఇది శరీరానికి చాలా మంచిది. నిమ్మరసం శరీరంలోని విషపదార్థాలను పోగొడుతుంది. అదే కొత్తిమీర కలిపిన నిమ్మరసం తాగితే బరువు తగ్గుతారు. పొట్ట చుట్టూ పేరుకున్న కొవ్వు కూడా కరుగుతుంది. కొత్తిమీరలో కాలరీలు తక్కువ కానీ విటమిన్ ఎ,బి,సి,కెలతో పాటు ఐరన్, పొటాషియం వంటి ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. శరీరంలోని మలినాలను పోగొట్టడంతో పాటు శరీరంలోని అనవసర ఫ్లూయిడ్స్‌ను ఈ జ్యూసు బయటకు పంపేస్తుంది. కొత్తిమీరకు బ్లడ్‌షుగర్ ప్రమాణాలను సమతులం చేసే గుణం ఉంది. అందులోని క్లోరోఫైల్ బరువు తగ్గడానికి సహాయపడుతుంది. జీర్ణక్రియ బాగా జరిగేలా సహకరించే ఎంజైములు ఇందులో ఉన్నాయి. వీటివల్ల కూడా బరువు తగ్గుతారు. ఇక నిమ్మకాయ శరీరంలో నీటి నిల్వలను పెంచుతుంది. జీర్ణక్రియకు సహాయపడుతుంది. నిమ్మకాయ, కొత్తిమీర కలిస్తే బరువు తగ్గడంతోపాటు ఉత్సాహంగా ఉంటారు.

### వండర్ జ్యూసు తయారీ:

మొదట కొత్తిమీర కడగాలి. నిమ్మకాయ తీసుకుని గాజుపాత్రలో రసం పిండాలి. ఈ రెండెంటినీ బ్లెండర్‌లో వేసి, ఒక కప్పు నీళ్లు పోసి బాగా బ్లెండ్ చేయాలి. ఇలా చేసిన జ్యూసును ఉదయమే ఖాళీ కడుపుతో తీసుకుంటే చాలా మంచిది.

పాలకూరలో ఎన్నో పోషకాలుంటాయి. ఇది చర్మాన్ని మెరిపిస్తుంది. దీనివల్ల ఆరోగ్య ప్రయోజనాలు కూడా బోలెడు ఉన్నాయి. అవేమిటో తెలుసుకుందాం...

- పాలకూర తినడం వల్ల కంటిచూపు మెరుగవుతుంది.
- వయసు వల్ల వచ్చే మాక్యులర్ డీజనరేషన్ తలెత్తకుండా నిరోధిస్తుంది.
- రక్తపోటు సాధారణస్థాయిలో ఉండేలా చూస్తుంది.

## పాలకూరలో ఎన్ని పోషకాలో...

- ఆస్టియోపొరాసిస్, గుండెజబ్బులు రాకుండా కాపాడుతుంది.
- జీవక్రియను పెంపొందిస్తుంది. జీర్ణవ్యవస్థ బాగా పనిచేసేలా తోడ్పడుతుంది.
- ఇందులోని విటమిన్‌కె హిమోఫీలియా చికిత్సకు సహాయపడుతుంది. రక్తస్రావాన్ని ఆపే గుణం పాలకూరలో ఉంది.
- పాలకూరలోని విటమిన్‌కె వల్ల కాల్షియం ఉత్పత్తి అయి ఎముకలు పటిష్ఠంగా ఉంటాయి.
- శుక్లాల రిస్కును తగ్గిస్తుంది. గాస్ట్రిక్ అల్సర్లను నివారిస్తుంది.
- కడుపులోని శిశువు ఆరోగ్యంగా పెరిగేలా, నాడీ వ్యవస్థ బలంగా ఉండేలా సహాయపడుతుంది.
- ఎసిడిటీని తగ్గిస్తుంది. క్యాన్సర్ బారిన పడకుండా నిరోధిస్తుంది.
- అతినీలలోహిత కిరణాల నుంచి చర్మాన్ని రక్షించడంతో పాటు దీర్ఘకాలంలో చర్మ కాన్సర్ బారిన పడకుండా కాపాడుతుంది. యాక్నే సమస్యను నివారిస్తుంది. చర్మం కాంప్లెక్షన్ పెరుగుతుంది. కళ్ల కింద ఏర్పడ్డ నల్లటి వలయాలు పోతాయి.
- యాంటిఏజింగ్ గుణాలు పాలకూరలో బాగా ఉన్నాయి.

పాలకూరలో ఫ్యాట్, క్యాలరీలు తక్కువ. అందుకే దీన్ని తినడం వల్ల బరువు తగ్గుతాం. ఇందులో కొవ్వును కరిగించే డయటరీ పీచుపదార్థాలున్నాయి.

- ఈ పీచుపదార్థాల వల్ల మలబద్ధకం సమస్య పోవడంతోపాటు అతిగా తినడం తగ్గుతుంది.

## సలాడ్స్ ఎలా..?

**నేను కీటో డైట్ చేస్తున్నా. వెజిటబుల్ సలాడ్ తీసుకోమన్నారు. సలాడ్స్ ఎలా తయారుచేయాలి? ఎప్పుడు తీసుకోవాలి? అన్ని కూరగాయలు ఉపయోగించొచ్చా? సలాడ్‌లో ఆలివ్ ఆయిల్ ఉపయోగించవచ్చా? దయచేసి సవివరంగా చెప్పండి.**

సలాడ్స్ అనేవి అత్యంత ఆరోగ్యకరమైనవి. కీటో డైట్‌లో సలాడ్స్‌దే పెద్ద పీట. ఆకలిని తట్టుకోవడానికి, అవసరమైన విటమిన్స్, పీచుపదార్థాలు ఇందులో ఉంటాయి. అంతేకాదు సలాడ్స్ నుంచి బోలెడన్ని యాంటీ ఆక్సిడెంట్స్ వస్తాయి. ఇవి ముఖ్యంగా డైట్ చేస్తున్నప్పుడు చాలా అవసరం.

**సింపుల్‌గా సలాడ్ చేయడానికి కావాల్సిన పదార్థాలు...**


పచ్చి కాయగూర ముక్కలు, ఉప్పు, మిరియాల పొడి, నిమ్మరసం. అన్నింటిని కలిపి భోజనంతో పాటు ఒక సైడ్ డిష్‌లా తీసుకుంటే ఆరోగ్యకరం.

భోజనంతో పాటు తినడం వల్ల ఆహారం సమతుల్యం అవుతుంది. భోజనం తగ్గి బరువు తగ్గుతారు. కొందరు భోజనానికి భోజనానికి మధ్య సలాడ్స్ తింటారు. ఇలా చేయడం వల్ల భోజనం మోతాదు తగ్గదు. పైగా కొన్ని పోషకాలు అందవలసిన టైమ్‌లో అందవు. అందుకే సలాడ్స్ భోజనంతో పాటు తింటే బరువు తగ్గే అవకాశం ఉంది.

కీర, దోసకాయ, టొమాటో, క్యారెట్, బీట్‌రూట్, క్యాప్సికమ్, ఉల్లి, బ్రొకోలీ, కొత్తిమీర సలాడ్స్‌లో తీసుకోవచ్చు.

బెండకాయలు, దొండకాయలు, చిక్కుడు, బీన్స్, ఆలుగడ్డ, స్వీట్ పొటాటో, క్యాబేజీ, కాలీఫ్లవర్ మొదలైనవి సలాడ్‌లో తీసుకోవాలనుకుంటే, ఆ పూట భోజనం మానేసి కేవలం సలాడ్ తీసుకోవాలి. కొన్ని కాయగూరల్ని ఉడికించి, లేక మగ్గించి సలాడ్ రూపంలో తీసుకోవచ్చు.

తాజా సలాడ్స్ తీసుకుంటున్నప్పుడు కొద్దిగా ఆలివ్ ఆయిల్ స్ప్రే చేసుకోవచ్చు. ఉడికించిన లేక మగ్గించిన సలాడ్ తీసుకున్నపుడు కూడా ఆలివ్



ఆయిల్ ఉపయోగించొచ్చు. కీటో డైట్ చేస్తున్నారు కాబట్టి మీరు కొబ్బరినూనె ఉపయోగించండి.

సలాడ్స్ అంటే రుచి లేనివి, గడ్డి తిన్నట్టే, ఎందుకు ఈ బతుకు అని మాత్రం అనుకోవద్దు. సలాడ్స్ తినడం వల్ల ఎన్నో ఉపయోగాలున్నాయి. అన్నిటికన్నా ముఖ్యంగా జీర్ణకోశం శుభ్రపడుతుంది. చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. సో.. సలాడ్స్‌ని రుచిగా తయారుచేసుకుని తినండి. సోయా సాస్, చిల్లీ సాస్, జీలకర్ర పొడి, చాట్ మసాలా మొదలైనవి రుచి కోసం వాడుకోవచ్చు.

## ఆఫీసులో అతిగా తింటున్నారా?

చాలామంది ఉద్యోగినులకు ఆఫీసులో స్నాక్స్ తినే అలవాటు ఉంటుంది. గంటకో రెండుగంటలకో ఓ సారి బిస్కట్లు, లేదా చిప్స్ వంటివి తింటూంటారు. ఈ అలవాటే వారిని ఊబకాయం వైపు నడిపిస్తోందంటున్నారు నిపుణులు. ఆఫీసులో స్నాక్స్ తీసుకునే వారి శరీరంలోకి ఏడాదికి లక్ష కేలరీలు వచ్చి చేరుతాయట! ఒకటి రెండు బిస్కట్లు కన్నా ఎక్కువ తిన్నా, మిల్క్ కాఫీ రెండు సార్ల కన్నా ఎక్కువ తాగితే 80నుంచి 100 కేలరీలు అదనంగా వచ్చి చేరతాయంటున్నారు. అంతే కాకుండా కొందరికి కేకులు తినే అలవాటు ఎక్కువగా ఉంటుంది. ఒక్కోకేకులో పది నుంచిపన్నెండు గ్రాముల ఫ్యాట్, 300నుంచి 400 కాలరీలు ఉంటాయి. ఇవి రోజుకు ఒకటి తిన్నా కూడా ఊబకాయం రావడం ఖాయం అంటున్నారు నిపుణులు. ముఖ్యంగా కూర్చుని పనిచేసే మహిళలు వీటికి ఆమడ దూరంలో ఉండాల్సిందే అని వారు చెబుతున్నారు. పనిమధ్యలో ఏదైనా తినాలని అనిపించినా, పళ్ళు, కూరగాయల ముక్కలు తినడం మేలని వారు సూచిస్తున్నారు.



## రాగి మొలకల జావ

గుండె లవ్ డబ్ అని కొట్టుకోవాలంటే ప్రేమలో పడటం ఒక్కటే సరిపోదు. గుండెకు రక్తవృద్ధి సక్రమంగా జరగాలి. అందుకోసం ఐరన్ సమృద్ధిగా ఉండే ఆహారం తీసుకోవాలి. ఇందుకోసం రాగులు వాడాలి. రాగులను ఎండబెటి,్టి పిండి కొట్టించి వండుకునే జావ కంటే, మొలకెత్తించి తయారు చేసుకునే రాగి పిండిలో ఎక్కువ పోషకాలు ఉంటాయి. ఇందుకోసం....

- రాగులను శుభ్రం చేసుకుని, రాత్రంతా నీళ్లలో నానబెట్టాలి.
- మరుసటి రోజు శుభ్రమైన పలుచని కాటన్ టవల్‌లో రాగులను మూటగట్టి పైన బరువుంచాలి.
- తర్వాతి రోజుకి రాగులు మొలకెత్తుతాయి.
- ఇలా మొలకెత్తిన రాగులను ఒక రోజంతా నీడలో ఎండబెట్టి, పిండి కొట్టుకోవాలి.
- ఈ పిండితో జావ లేదా సంకటి తయారు చేసుకుంటే రెట్టింపు పోషకాలు, ఐరన్ అందుతాయి.





## విద్యార్థుల ప్రవర్తన

పాఠశాల ఒక సామాజిక దేవాలయం. అక్కడ అందరూ సమానం. పేద, ధనిక భేదాలు ఉండకూడదు. పురాణాల కాలం నుంచి మన విద్యావ్యవస్థలో ఇది కనిపిస్తుంది. దశరథ మహారాజు కుమారులైన రామలక్ష్మణభరతశత్రుఘ్నులు వసిష్ఠుడి దగ్గర, బలరామకృష్ణులు సాందీపని ముని దగ్గర ధనవంతుల పిల్లల్లా విద్యనభ్యసించలేదు. నిరాడంబరంగా, సామాన్యుల్లాగే చదువుకున్నారు. సామాజిక, రాజనీతి విషయాలలో శ్రీరామచంద్రుడు ఈనాటికీ ఆదర్శమూర్తిగా భావించడానికి కారణం గురువు దగ్గర వినయంగా విద్యనభ్యసించడమే. శ్రీకృష్ణుడు నిరుపేద అయిన కుచేలుడితో స్నేహం చేశాడు. వారి మైత్రి గురుకులం వరకే పరిమితం కాలేదు. కృష్ణుడు ఎంతో ఉన్నతస్థాయికి ఎదిగాక కూడా కుచేలుడిని ఆదరించాడు. తన సరసన కూర్చోబెట్టుకొని, గౌరవించేంతటి సంస్కారం ఆనాటి విద్యావిధానం నేర్పినదే.

## ఏదైనా.. విజ్ఞాన గని

ప్రతి మనిషి చదువుకోవాలి. చదువుకుంటేనే మంచి మనుగడ. పరిణామ క్రమంలో విద్యావ్యవస్థలో ఎన్నో మార్పులు వచ్చాయి. పురాణకాలంలో గురుకులాల్లో చదువుకునేవారు. బౌద్ధమత రోజుల్లో అది ఆరామాలకు చేరుకుంది. తర్వాత అనేక సంస్కరణలకు నోచుకుంది, అనేక విధానాలు అలవర్చుకుంది. ఒకనాడు గురుకులం.. ఇంకోనాడు ఆరామం.. ఇప్పుడు పాఠశాల.. ఏదైనా విజ్ఞానాన్ని ప్రసాదించే ఆలయమే. అక్కడ గురువే దైవం. అక్కడికి వచ్చే శిష్యుడు పరమభక్తుడు. ఆ భక్తుడిని పరిపూర్ణంగా అనుగ్రహించాల్సింది గురుదేవుడే. ఒత్తిడి లేని చదువును అనుగ్రహించి.. విజ్ఞానాన్ని కటాక్షించి.. వారి జీవిత మార్గానికి వెలుగు ప్రసాదించాలి.

# ఎవరు గురువు? ఏది చదువు?

**విద్యార్థికి ఈ సమాజం అంతా గురువే. తెలియని విషయాలు చెప్పేవారందరూ గురువులే. చేపలు పట్టే వ్యక్తి కూడా ఏకాగ్రత విషయంలో గురువే అని వివరిస్తుంది మహాభాగవతంలోని అవధూత ఉపాఖ్యానం. సమాజం నుంచి సమగ్రమైన విజ్ఞానం లభిస్తుంది. మనసు వికసిస్తుంది. తుదిగా ఆ సమాజంపై గౌరవం ఏర్పడుతుంది.**

గమ్యం తెలియని జీవన గమనానికి దారి చూపే దీపం చదువు. విద్యార్థి జీవితం సజావుగా సాగేందుకు ఆ దీపాన్ని భద్రంగా పట్టుకొని ఉండే జ్ఞానాధారం గురువు. విద్యార్జన మహాయాగం వంటిది. దానిని నిర్వహించే బ్రహ్మ గురువు. ఆయన అనుగ్రహం విద్యార్థిని జ్ఞానవంతుడిని చేస్తుంది. విద్యార్థి చదువు గురువుతో ఉండే అనుబంధం మీద ఆధారపడి ఉంటుంది. గురుశిష్యుల సంబంధం గురించి, సమాజహితాన్ని కోరే చదువు గురించి మన సనాతన ధర్మం ఏం చెప్పిందంటే..

తమ చిన్నారికి మూడో యేడు వచ్చిందో లేదో తల్లిదండ్రులకు ఆరాటం. ఎప్పుడెప్పుడు అక్షరస్వీకారం చేయిస్తామో.. ఎప్పుడెప్పుడు బడికి పంపిస్తామో అని. మన సంప్రదాయంలో పిల్లలను బడిలో వేయడం కూడా ఒక సంబరమే. పప్పు బెల్లాలు, పలకాబలపాలు తోటి పిల్లలకు పంచిపెట్టి.. తమ పిల్లలతో ఓనమాలు దిద్దిస్తారు. ఆనందంగా మొదలయ్యే విద్యార్థి జీవితం ఓ మధురానుభూతి. చదువంటే ఓ సంతోషం, ఓ ఆనందం. బడికి పోవాలనే ఒకటే ఆరాటం. ఎలాంటి ఒత్తిడి లేకుండా, హాయిగా చదువుకోవడం తొలినాళ్ల నుంచి మన విద్యావ్యవస్థలో కనిపిస్తుంది. అప్పుడే పునాది గట్టిగా ఉంటుంది. దానిపై భవిష్యత్ బంగారుమేడ గట్టిగా నిలవగలుగుతుంది.

### మనిద్దరం కలిసి..

విద్యార్థి జీవితం గురువుపైనే ఆధారపడి ఉంటుంది. గురుశిష్యుల బంధం ఎంత బలంగా ఉంటే.. ఆ విద్యార్థి భవిష్యత్తు అంత ఉజ్వలంగా ఉంటుంది. సనాతన విద్యావిధానం గురుశిష్యుల సంబంధాన్ని చాలా సందర్భాల్లో స్పష్టం చేసింది. దీనికి సంబంధించిన సారాంశం కేనోపనిషత్తు శాంతి మంత్రంలో కనిపిస్తుంది.

**"ఓం సహనావవతు, సహనౌభునక్తు..
సహవీర్యం కరవావహై
తేజస్వినావధీతమస్తు మావిద్విషావహై
ఓం శాంతిః శాంతిః శాంతిః"**

ఈ శాంతి మంత్రం విద్యావిధానానికి ఓ దిక్సూచి లాంటిది. దీనిలో ఉన్న గురుశిష్య సంబంధ అంశాలను పరిశీలిస్తే మన సంప్రదాయం వారి బంధానికి ఎంత ప్రాధాన్యం ఇచ్చిందో తెలుస్తుంది. శిష్యుడిని గురువు ఎంత ప్రేమగా చూసుకోవాలో అర్థమవుతుంది. "ఓ శిష్యుడా! మనమిద్దరినీ భగవంతుడు రక్షిస్తూ, పోషిస్తూ ఉండాలి. మనమిద్దరం శక్తిమంతులమై శ్రమిస్తూ ఉండాలి. మన అధ్యయనం తేజోవంతంగా ఉండాలి. మనిద్దరం నిరంతరం ద్వేషం లేకుండా ఉందాం" ఇది కేనోపనిషత్తులోని శాంతిమంత్ర ప్రసాదం. గురుశిష్య సంబంధం గురించి విద్యార్థికి ప్రతి గురువూ తెలియజేయాలి. అప్పుడు ఆ విద్యార్థికి గురువు ప్రాణసమానుడు అవుతాడు.

**వినయమే విద్యార్జనకు తొలిమెట్టు. గురువు కూర్చునే ఆసనం, ఆయన వినియోగించే వస్తువులను కూడా సాక్షాత్తు గురువే అనే భావనతో ఉండేవారు అప్పటి విద్యార్థులు. పాఠం ముగించుకొని గురువు వెళ్లాక.. ఆయన వినియోగించిన ఆసనాన్ని తాకడానికి సాహసించేవారు కాదు. గురువుపై అంతటి భక్తిప్రపత్తులుండేవి.**

### అందరికీ చదువు

విద్య అందరికీ అవసరమే. అందుకే తల్లిదండ్రులు తమ పిల్లల విషయంలో విద్యకు అత్యంత ప్రాధాన్యం ఇస్తారు. పురాణాల కాలంలోనూ ఇదే కనిపిస్తుంది. మనుషులు, దేవతలే కాదు.. చదువు ఎంత గొప్పదో అసురుల్లోనూ నాటుకుపోయింది. ఈ విషయాన్ని పోతన మహాభాగవతం ఏడో స్కందంలోని 130, 132 పద్యాల సారాంశం మనకు విశదీకరిస్తుంది. హిరణ్యకశిపుడు రాక్షసరాజు. ఆయన కుమారుడు ప్రహ్లాదుడు. ఓ రోజు చిన్నారి ప్రహ్లాదుడిని చెంతకు పిలిచిన హిరణ్యకశిపుడు లాలనగా..

**చదువని వాడజ్ఞుండగు,
జదివిన సదసద్వివేక చతురత గలుగుం
జదువగ వలయును జనులకు, జదివించెద
నార్యులొద్ద జదువుము తండ్రీ!'**

అని అన్నాడు. "జీవితానికి చదువు చాలా ముఖ్యం, చదువుకోని వాడు అజ్ఞానిగా ఉంటాడు.. వాడు పశువుతో సమానం. చదువుకుంటే తెలివితేటలు బాగా వస్తాయి. చదువనేది మంచి ఏమిటి? చెడు ఏమిటి? అనే వివేకాన్ని కలిగిస్తుంది. అందుకే పుట్టిన ప్రతివాడూ చదువుకోవాలి. నిన్ను మంచి గురువుల దగ్గర చదివిస్తాను" అని ఆ పద్య భావం. ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలకు విద్య ప్రాధాన్యం తెలియజేయాలి. తగిన విధంగా ప్రోత్సహించాలి. విద్యపై ఆసక్తి కలిగించే విషయాలు చెప్పాలి. అప్పుడు పిల్లలకూ బడిపై మమకారం పెరుగుతుంది. చదువుపై ఆసక్తి కలుగుతుంది.

### సంస్కరించే విద్య..

ఇప్పుడు చదువంటే.. మార్కులు. ఉత్తీర్ణత శాతం. పోటాపోటీ పరుగు. తల్లిదండ్రులు కూడా అలాగే వ్యవహరిస్తున్నారు. బాగా చదవాలంటూ పిల్లలపై ఒత్తిడి చేస్తున్నారు. పాఠశాలకు వెళ్లి తమ పిల్లాడికి మార్కుల గురించి అడుగుతున్నారే కానీ, ఎలాంటి విద్య బోధిస్తున్నారో, ఏం నేర్పించాలో సూచించడం లేదు. కానీ, తల్లిదండ్రులు పిల్లవాడిని బడికి పంపినప్పుడు ఎలా వ్యవహరించారో హిరణ్యకశిపుడి ద్వారా మనకు తెలియజేశారు పోతన. ప్రహ్లాదుడిని గురువులకు అప్పగిస్తూ హిరణ్యకశిపుడు.. "ఓ గురువులారా! మా పిల్లవాడు ఇప్పటిదాకా జీవితానికి సంబంధించిన జ్ఞానం లేకుండా ఉన్నాడు. నేను మా అబ్బాయి పైకి రావాలని అనుకుంటున్నాను. దయచేసి మా పిల్లవాడికి చదువు చెప్పి గ్రంథాలు చదివించండి. నీతిశాస్త్రం నేర్పించి సంస్కరించి మమ్మల్ని రక్షించండి" అని విన్నవించుకున్నాడు. ఇందులో తన కుమారుడికి నైతిక విలువలున్న విద్య నేర్పించండని కోరడం కనిపిస్తుంది. విద్యకు ముందు కావాల్సింది నైతికత. మన సంప్రదాయం నైతిక విలువలకు ప్రాధాన్యమిచ్చింది. ఈ తరం తల్లిదండ్రులు తమ బిడ్డలకు ఉన్నత విద్యతో పాటు, ఉన్నత విలువలు రావాలని ఆకాంక్షించాలి. మన విద్యావిధానంలో ప్రతి అంశానికీ నైతిక విలువలు జోడించి చెప్పడం సాధ్యమేనని విద్యావేత్తలు చెబుతున్నారు. ఫలితంగా పిల్లలకు విజ్ఞానంతో పాటు నైతికత అబ్బుతుంది. నీతిగా మెలగాలన్న స్ఫురణ కలుగుతుంది.

### విలువలకు కట్టుబడి

గురువు విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలి. నైతిక విలువలకు కట్టుబడి ఉండాలి. విరాటరాజు కొలువులో బృహన్నలగా ఉన్న అర్జునుడు రాకుమారి ఉత్తరకు నాట్యం నేర్పించేవాడు. ఉత్తర అపురూప సౌందర్యరాశి. అజ్ఞాతవాసం ముగిసిన తర్వాత ఉత్తరను వివాహం చేసుకోవాల్సిందిగా అర్జునుడిని కోరుతాడు విరాటరాజు. అప్పుడు అర్జునుడు 'గురువుగా ధర్మం తప్పడం మంచిది కాదని, ఉత్తరను తన కుమారుడు అభిమన్యుడికిచ్చి వివాహం చేస్తాన'ని విరాటరాజుకు వివరించి చెబుతాడు.

## సత్కార్యాలతోనే సాఫల్యం!

అందమైన ఇల్లు, అనుకూలవతి అయిన భార్య, రత్నాల్లాంటి బిడ్డలు, కావాల్సినంత సంపద, విలాసవంతమైన జీవితం ఇన్ని ఉన్నా.. చాలా మందికి సంతృప్తి ఉండదు. సంపద అనేది పాక్షికమైన ఆనందాన్ని ఇస్తుందే కానీ, పరిపూర్ణమైన సంతోషానికి సోపానం కాదని గుర్తించాలి. మరి మంచి జీవితం, శాంతి, సంతోషం, సంతృప్తి ఇవన్నీ ఎలా లభిస్తాయి? ఇదే ప్రశ్నను ఒక శిష్యుడు ప్రవక్త (స)ను అడిగాడు. అప్పుడాయన 'అల్లాహ్‌ను బాగా స్మరించు, అనాథలను ఆదరించు, పేదలకు శక్తిమేర సాయం చెయ్యి'



అని ఉపదేశించారు. కానీ, నాలుగురాళ్లు సమకూరగానే మనుషుల్లో అహం పెరిగిపోతోంది. దైవాన్ని స్మరించడం మరచిపోతున్నాడు. పేదలను ఈసడించుకుంటున్నాడు. ఇలాంటి భావనలు ఉన్నంత కాలం సంతోషం దరి చేరదు. ప్రవక్త(స) చెప్పినట్లు.. సత్కార్యాల్లోనే సంతృప్తి ఉంది. ధర్మ బద్ధమైన సంపాదన, ధర్మ సమ్మతమైన ఖర్చు, మంచి పనుల కోసం వెచ్చించే సమయం.. ఇవన్నీ సంతోషానికి హేతువులు అవుతాయి. మనసుకు శాంతిని చేకూరుస్తాయి. ఇహపర సాఫల్యాన్ని అందిస్తాయి.

## మనసు జయించిన మహావీరుడు

జిన అనే పదం నుంచి ఆవిర్భవించింది జైనం. ఆ పదానికి జయించినవాడు అని అర్థం. బంధనాలు, కోరికలు, మానసిక వికారాలను జయించి (జినులై) ఉంటే కైవల్యం సాధ్యమనేది జైన మత నినాదం. దీనికోసం జనులు నిర్గ్రంధులు కావాలని వీరి ప్రధాన బోధ. అంటే భవబంధాల నుంచి విముక్తి పొందిన వారని అర్థం.

**స్థాపన:** జైన మత స్థాపకుడు వృషభనాథుడు. ఇతడు మొదటి తీర్థంకరుడు. జీవ ప్రవాహాన్ని దాటడానికి వారధి నిర్మించిన వారిని తీర్థంకరులు అంటారు. వీరు మొత్తం 24 మంది. వీరిలో చివరి ముగ్గురూ ఈ సిద్ధాంతం అభివృద్ధికి కృషి చేశారు. వారు నేమి, పార్శ్వనాథుడు, వర్ధమాన మహావీరుడు. ప్రాచీన జైన సిద్ధాంతాన్ని పూర్తి స్థాయిలో మతంగా రూపుదిద్దీ ప్రచారం చేసిన వాడు వర్ధమాన మహావీరుడు. అందుకే ఆ మతం ఆయన పేరుతోనే ప్రచారం లోకి వచ్చింది.



ఇతని అసలు పేరు వర్ధమానుడు. తండ్రి సిద్ధార్థుడు. తల్లి త్రిశల. వైశాలీ నగరం దగ్గరలోని కుంద అనే గ్రామంలో జన్మించాడు. భార్య యశోద. నలందని దర్శించినపుడు గోశాల ముష్కర పుత్రుడు అనే సన్యాసితో పరిచయమైంది. ఆయన బోధనల ప్రభావంతో 30వ ఏట సన్యాసాన్ని స్వీకరించాడు. కొన్నాళ్లకు వస్త్రాలను కూడా విడిచి దిగంబరుడై ఆ స్థితిలోనే జృంభక పర్వత సానువుల్లో రుజుపాలిక నదీ తీరంలో మద్ది వృక్షం కింద తపస్సు ప్రారంభించాడు. అంచెలంచెలుగా తపస్సును కఠినతరం చేస్తూ 43వ ఏట జ్ఞానోదయం పొందాడు. అన్నిటినీ జయించినవాడు కాబట్టి జినుడు అని, కోరికలతో పోరాడి గెలిచినవాడు కాబట్టి మహావీరుడు అని పిలుస్తారు. ఇంకా వీర, వీరప్రభు, అతివీర, సన్మతి, జ్ఞానపుత్ర అనే పేర్లున్నాయి.

జైనానికి ఆయువు పట్టు: జైన మతానికి త్రిరత్నాలు ఆధార భూతమైన సూత్రాలు. అవి సమ్యక్ దర్శనం, సమ్యక్ జ్ఞానం, సమ్యక్ జీవనం. మరో అయిదు మార్గదర్శక సూత్రాలున్నాయి. అవి... సత్యం, అహింస, అపరిగ్రహం (ఇతర వస్తువుల కోసం ఆశ పడకపోవడం), అస్తేయం (దొంగతనం చేయకపోవడం), బ్రహ్మచర్యం. వీటన్నిటినీ బోధిస్తూ మహావీరుడు దేశాటనం చేశారు.

**పెద్దపీట:** అహింసా మార్గాన పయనిస్తే సంసారిగా ఉంటూనే కైవల్యం పొందవచ్చనేది వీరి ప్రధాన నినాదం. అందుకే వీరు అహింసకు చాలా ప్రాధాన్యతనిస్తారు. ఎంతగా అంటే... వ్యవసాయం వల్ల భూమిలోని జీవులు హింసకు గురవుతాయని వ్యవసాయం చేయకపోవడం వీరి మార్గగమనానికి పరాకాష్ఠ.

**శాఖలు:** జైనంలో దిగంబర, శ్వేతాంబర అనేవి రెండు ప్రధాన శాఖలు. కొన్ని విషయాల్లో బేధాలున్నా వీరి మౌలిక సూత్రాలు ఒకటే. వీరు నిరీశ్వర వాదులు. వీరి దృష్టిలో సృష్టికర్త లేడు. వేద ప్రామాణ్యాన్ని అంగీకరించరు. ఆత్మ అంటే జీవమని నమ్ముతారు. పర్వతాలు, లోహాల వంటివాటినీ సావర్త జీవులు అంటారు.


**నిర్యాణం:** నేటి పాట్నాను ఆ రోజుల్లో పాటలీపుత్రం అని పిలిచేవారు. అక్కడికి సమీపంలో ఉన్న ఒక గ్రామంలో హస్తిపాలుడు అనే శిష్యుడి ఇంట్లో 73వ ఏట అనారోగ్యంతో మరణించాడు.

## సత్యంతోనే విమోచన

ఒక కార్యాలయంలో ఇద్దరు ఉద్యోగులు ఉండేవారు. ఒకాయన ఉన్నతోద్యోగి. మంచి జీతం, మంచి హోదా. మరొకతను చిరుద్యోగి. తక్కువ జీతం. అతనిది పెద్ద కుటుంబం. పైగా ఆర్థిక సమస్యలు. ఇన్ని ఇబ్బందులున్నా.. ఇవేవీ అతని ముఖంలో కనిపించేవి కావు. ఎప్పుడూ ప్రశాంతంగా ఉండేవాడు. ఉన్నతోద్యోగికి ఏ సమస్యలూ లేకపోయినా.. అతని ముఖంలో ఎప్పుడూ బాధ, అభద్రత కనిపించేవి. ఆ చిరుద్యోగి ప్రశాంతంగా ఉండటానికి, ఈ పెద్ద ఉద్యోగి ఆలోచనలతో సతమతమవ్వడానికి కారణం రెండు అక్షరాలు. అదే సత్యం.

చిరుద్యోగి ఏనాడూ అబద్ధమాడేవాడు కాదు. నిజం దాచేవాడు కాదు. అందుకే నిరంతరం ఆత్మవిశ్వాసంతో ఆనందంగా ఉండేవాడు. ఉన్నతోద్యోగి ఇంటాబయటా అబద్ధాలు చెప్పేవాడు! అందుకే ఎప్పుడూ అపరాధ భావంతో ఆంతర్మథనం చెందుతూ ఉండేవాడు. ఈ సందర్భంగా క్రీస్తు చెప్పిన ఒక అద్భుతమైన వాక్యాన్ని గుర్తు చేసుకోవచ్చు.

"మీరు సత్యాన్ని గ్రహిస్తారు. ఆ సత్యం మిమ్మల్ని స్వతంత్రులుగా చేస్తుంది" అంటారు ప్రభువు. సత్యంగా బతికేవారు ఎవరికీ భయపడాల్సిన పనిలేదు. వారికి ఏ ఆందోళనా ఉండదు. వారిలో ఆత్మవిశ్వాసం తొణికిసలాడుతుంటుంది. అలాంటి వారు ఏ హోదాలో ఉన్నా.. ఏ సంపదలూ లేకపోయినా.. లోకం వారికి దాసోహం అవుతుంది. అందుకే 'సత్యమే జయం' అన్నారు



పెద్దలు. అబద్ధం అనేది బతుకును బంధీలను చేస్తే.. సత్యవంతమైన జీవితం మనిషికి స్వేచ్ఛ కలిగిస్తుంది.



## సల్మాన్ అభిమానులను గుడ్‌న్యూస్

### 27న సికిందర్ టీజర్ రిలీజ్

బాలీవుడ్ స్టార్ యాక్టర్ సల్మాన్ ఖాన్ టైటిల్ రోల్ పోషిస్తున్న చిత్రం 'సికందర్'. కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ ఏఆర్ మురుగదాస్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ మూవీ ప్రపంచవ్యాప్తంగా 2025 ఈద్ కానుకగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుండగా.. విడుదల తేదీని ప్రకటించాల్సి ఉంది. కాగా అప్‌డేట్స్ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న మూవీ లవర్స్ కోసం అదిరిపోయే వార్త బయటకు వచ్చింది. సికిందర్ టీజర్ టైం రానే వచ్చింది. సల్మాన్‌ఖాన్ బర్త్ డే సందర్భంగా డిసెంబర్ 27న సికిందర్ టీజర్ విడుదల చేయనున్నారు. ఈ విషయాన్ని మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఇంకేంటి మరి సల్లూభాయ్ అభిమానులు డబుల్ సెలబ్రేషన్స్‌కు రెడీగా ఉండండి. ఈ చిత్రంలో కన్నడ భామ రష్మిక మందన్నా ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. కాజల్ అగర్వాల్ కీలక పాత్రలో నటిస్తోంది. ఈ చిత్రాన్ని నడియాద్వాలా గ్రాండ్‌సన్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై సాజిద్ నడియాద్వాలా నిర్మిస్తుండగా.. పాపులర్ యాక్టర్ సత్యరాజ్ కీలక పాత్ర పోషిస్తున్నాడు.సమాజంలోని అవినీతి, నేరాలకు వ్యతిరేకంగా పోరాడే వ్యక్తి కథ నేపథ్యంలో మురుగదాస్ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నాడని బీటౌన్ సర్కిల్ ఇన్‌సైడ్ టాక్. ఓ వైపు ఎమోషన్స్‌ను హైలెట్ చేస్తూనే.. మరోవైపు అభిమానులకు గూస్ బంప్స్ తెప్పించే హై ఆక్టేన్ యాక్షన్ సీక్వెన్స్ ఉండబోతున్నాయట.





## ఆయుధ పూజకు స్టెప్పులేసిన రాజమౌళి

ఆస్కార్ అవార్డు విజేత, ప్రముఖ సంగీత దర్శకుడు ఎమ్.ఎమ్. కీరవాణి ఇంట్లో పెళ్లి బాజాలు మోగిన విషయం తెలిసిందే. ఆయన చిన్న కుమారుడు మత్తు వదలరా ఫేం శ్రీ సింహా తాజాగా పెళ్లి బంధంలోకి అడుగుపెట్టాడు. సీనియర్ నటుడు మురళీ మోహన్ మనవరాలు రాగ మాగంటిని శ్రీసింహ వివాహం చేసుకున్నాడు. అయితే వీరి పెళ్లిలో రాజమౌళి దంపతులు అమ్మా నాన్న ఓ తమిళ అమ్మాయి సినిమాలోని 'లంచ్ కొస్తావా మంచె కొస్తావా' పాటకు స్టెప్పులేసిన సంగతి తెలిసిందే. దీనికి సంబంధించిన వీడియో ఇప్పటికే వైరల్‌గా మారింది.

అయితే పెళ్లి అనంతరం శ్రీ సింహా బారాత్ జరుగగా.. ఈ వేడుకలో రాజమౌళి మళ్లీ తన డాన్స్‌తో అలరించాడు. ఎన్టీఆర్ నటించిన దేవర సినిమాలోని ఆయుధ పూజ పాటకి కీరవాణి పెద్ద కొడుకు కాలా భైరవతో కలిసి స్టెప్పులేశాడు. కాగా ఈ వీడియోను మీరు చూసేయండి.


## బాలీవుడ్ షో మ్యాన్‌కు శత నివాళి

### భారతీయ సినిమాకు అసలు సిసలు షో మ్యాన్.

బాలీవుడ్‌లో అత్యంత ప్రియతమ నటుడుగా నిలిచిపోయారాయన. 1947లో తొలి సినిమాతో మొదలై 1970ల మధ్య కాలం వరకూ ఇంకా కచ్చితంగా చెప్పాలంటే ఎమర్జన్సీకి కాస్త ముందు వరకూ ఆయన జైత్రయాత్ర సాగింది. ఈ కాలంలో తన చిత్రాలు, పాత్రలు ఈ దేశపు బహుళత్వానికి, సామాన్య ప్రజల సంస్కారానికీ సాహసానికి ప్రతీకగా నిలిచాయి. 'మేరా జూటా హై జాపానీ'తో మొదలుపెట్టి 'సర్ పే లాల్ టోపీ రూసీ' అంటూ అంతర్జాతీయతనూ ప్రవేశపెట్టాయి. ఇన్నిటితోనూ కలిపి చివరకు 'ఫిర్ భీ దిల్ హై హిందూస్తానీ' అన్నారు. రాజ్‌కపూర్, నర్గీస్‌లతో కూడిన ఆర్.కె స్టూడియో లోగో ఒక తరం హిందీ సినిమా వైభవానికి చిహ్నంగా చరిత్రలో స్థానం సంపాదించింది. బహుశా మరే నట దర్శకుడికీ దక్కని అరుదైన స్థానం ఆయనది. 'జీనా యహా మర్నా యహా ఇస్కే శివా జానా కహా?' అంటూ రాజ్‌కపూర్ పాడిన పాట జీవన యాత్రలో మనిషి నిబద్ధతకూ నిశ్చయానికీ నిర్వేదానికి కూడా నిదర్శనం. ప్రపంచ సినిమాలో ప్రజా నటుడుగా సుస్థిర స్థానం పొందిన చార్లీ చాప్లిన్‌ను కూడా భారతీయ తెర రూపంలో ఇమిడ్చిన ఘనుడు రాజ్ కపూర్ .

24 ఏళ్ల వయస్సులోనే దర్శకత్వం చేపట్టిన రాజ్‌కపూర్ 'బర్సాత్' చిత్రంతో జనరంజక చిత్రాలకు కొత్త వ్యాకరణం సమకూర్చారు. నిజానికి తన మనసంతా సినిమానే వుంది గనక చదువు అబ్బదని తండ్రి పృథ్వీరాజ్ కపూర్‌ను ఒప్పించి సినిమాల్లోకి ప్రవేశించినపుడు రాజ్‌కపూర్ ఈ రంగానికే అంటిపెట్టుకుని వుంటానని, ఇచ్చిన మాట అక్షరాలా పాటించాడు. తను రూపొందించిన తొలి చిత్రం 'ఆగ్' వాణిజ్య విజయం సాధించలేకపోయింది. కానీ నర్గీస్‌తో కలసి చేసిన 'బర్సాత్' విజయఢంకా మోగించింది. హిందీ సినిమాలో ఒక జంట అలా చెరగని ముద్ర వేయడం వారిద్దరితోనే మొదలైంది. ఆ చిత్రంతోనే టైటిల్ సాంగ్ అనే కాన్సెప్ట్ కూడా వచ్చింది. శంకర్ జై కిషన్ల కలయిక కూడా సంగీత ప్రపంచంలో మొదటి ప్రయోగం. శైలేంద్ర సింగ్ నేపథ్య గానం. రాజ్‌కపూర్ తన టీమ్ ని వదలిపెట్టలేదు. అన్ని చిత్రాలకూ వారినే తీసుకుంటూ ఒక వరవడి పెట్టారు. విదేశాలలో షూటింగ్, ట్రయాంగల్ లవ్ వంటివి హిట్ ఫార్ములాలుగా చేశారు.

సినీ రంగంలో కపూర్ గురించి చాలా చెప్పుకోవచ్చు గాని అంతకంటే కీలకమైంది సామాజిక కోణం. 'తొలి ప్రధాని నెహ్రూ చేపట్టిన విధానాలు, స్వాతంత్య పోరాట స్ఫూర్తికి కొనసాగింపుగా స్వావలం బన బాట ఆయనపై గొప్ప ప్రభావం చూపాయి. బందిపోటు దొంగల పరివర్తన కోసం 'జిస్ దేశ్ మె గంగా బహతీ హై' అంటూ సంస్కరణ పంథా తీసుకున్న రాజ్‌కపూర్ దాంతో పాటు లౌకికతత్వం, చైతన్యం ప్రతి చిత్రంలోనూ అంతర్లీనంగా జొప్పించారు. కొత్తగా పెత్తనం చేపట్టిన బడా నేతల అవినీతి పోకడలను ఆక్షేపిస్తూ 'శ్రీ 420' తీశారు. ఇప్పటికీ 420 అనేది భారత రాజకీయాలలోనూ మీడియాలోనూ జనం నోళ్లలోనూ నానుతూనే వుంటుంది. 420లే ఘరానాగా శ్రీ తగిలించుకుని పాలిస్తున్నారనే భావన వినూత్నమైంది. 'ఆవారా' కూడా అలాంటిదే. పుట్టుకతో ఎవరూ గొప్పవారు కాదనే కీలక సందేశం ఇస్తారందులో. ఇవన్నీ ఇప్పుడు తెలిసిపోయిన ఫార్ములాలే గాని ఆనాటికి నవ్య ప్రయోగాలు. 'జాగ్తే రహో'లో అప్పటికే మహా నగరమైన కలకత్తాలో పెద్ద అపార్ట్‌మెంట్‌లోకి అనుకోకుండా ప్రవేశించిన రైతు చూసే దృశ్యాలను ఆలంబనగా చేసుకుని మొత్తం సమాజ స్వరూపాన్ని కళ్లకు కట్టారు. అది మామూలు తరహాలో తీసిన ఆర్ట్ ఫిలిం లాంటిది. నాయికగా కాకున్నా తనతో నర్గీస్ చివరిగా కనిపించిన చిత్రం కూడా అదే. ఇలా చూస్తే నవ భారతంలో రెండు పార్శ్వాలనూ ఆయన ఆవిష్కరించారని చెప్పాలి. చాప్లిన్ తరహాలో అమాయకంగా కనిపించే గడుసుతనం ఆయన పాత్రల ప్రత్యేకత. నాయికలకు సమ ప్రాధాన్యత ఇంకా చెప్పాలంటే కాస్త ఎక్కువ మొగ్గు చూపిస్తాడాయన. ఇంతా చేసి రాజ్ దర్శకత్వం వహించింది పట్టుమని పది సినిమాలే. తాను






ఎంతో ఇష్టపడి సుదీర్ఘ కథాంశంతో తీసిన 'మేరా నామ్ జోకర్' దారుణంగా పరాజయం పొందింది. ఇప్పుడు దాన్ని క్లాసిక్‌గా చూస్తారుగాని ఆ నిరాశ ఆయనను బాబీ లాంటి ఫక్తు కమర్షియల్ సినిమా తీసేలా చేసింది. రిషి కపూర్, డింపుల్ కపాడియాల 'బాబీ' కొత్త పోకడలను తీసుకొచ్చి రికార్డులను తిరగ రాసింది. ఆ దర్శక బ్రహ్మ ఆ తర్వాత ఆ స్థాయి చిత్రాలు తీయలేదు. ప్రేమ్ రోగ్, సత్యం శివం సుందరం, రామ్ తేరీ గంగా మైలీ వంటివి పేరు, డబ్బు తెచ్చాయి కానీ పాత రాజ్ దూరం చేశాయి. నవ్య చిత్ర వైతాళికుడైన సత్యజిత్ 'బాబీ' వరకూ తాను రాజ్ చిత్రాలన్నీ గొప్ప ఆసక్తితో చూశాననీ, తర్వాత వదిలేశననీ అంటారు. ఒక విధంగా ఇది భారతీ య సినిమా రంగంలోని మార్పు కూడా. అప్పటికే రాజేశ్ ఖన్నా సూపర్ స్టార్‌డమ్‌కి చేరుకుంటే 'బాబీ'కి అటూ ఇటుగా వచ్చిన 'షోలే' అమితాబ్ శకాన్ని ఆవిష్కరించింది.

శిర్ పర్ లాల్ టోపీ రూసీ' అని పాడిన రాజ్‌కపూర్ నిజంగానే నాటి సోవియట్ యూనియన్‌లో గొప్ప ఆదరణ పొందాడు. రష్యన్లు ఆయన పేరు కూడా పెట్టుకున్నారు. మేరా నామ్ జోకర్ ముగ్గురు హీరోయిన్లలో ఒక రష్యన్ నటిని తీసుకుని ఆయన ఆ దేశంపై తన



ప్రేమను ప్రకటించారు. రాజ్‌కపూర్ కుమారులైన రిషి, రణధీర్, రాజీవ్ లే గాక మూడో నాలుగో తరంలో కరీనా కపూర్, కరిష్మా కపూర్ వంటి అమ్మాయిలు కూడా తారాపథం చేరడం అరుదైన రికార్డు. చిత్ర పరిశ్రమలోనూ సంచలనం. రణధీర్ ఇటీవల రష్యాకు వెళితే టాక్సీ డ్రైవర్ డబ్బులు తీసుకోలేదని చెప్పడం తెలిసిందే. వరస అవార్డులు తీసుకున్న రాజ్ వృద్ధాప్యంలో దాదా సాహెబ్ ఫాల్కే అందుకుంటూ అస్వస్థతతో ఆస్పత్రి పాలవడం ఆయన ప్రస్థానానికి ఆఖరి ఘట్టం. ఇప్పుడు ఆయన శత జయంతి వేడుకల్లో దేశం ఆయన చిత్రాల ప్రదర్శనతో నివాళి అర్పిస్తున్నది.

**(రాజ్‌కపూర్ శత జయంతి వారోత్సవాల సందర్భంగా)**




## బాధిత కుటుంబాన్ని కలుస్తా : అల్లుఅర్జున్

ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట ఘటనలో రేవతి అనే మహిళ ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఆమె కుమారుడు శ్రీతేజ్ ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ నేపథ్యంలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రీతేజ్‌ను తాను కలవలేక పోతున్నానంటూ అల్లు అర్జున్ తాజాగా తెలిపారు. బాలుడు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఓ పోస్టు పెట్టారు. 'దురదృష్టకర సంఘటన తర్వాత వైద్య సంరక్షణలో ఉన్న శ్రీతేజ్ గురించి నేను ఆందోళన చెందుతున్నాను. బాలుడు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నా. ప్రస్తుతం కొనసాగుతున్న న్యాయపరమైన విచారణ కారణంగా.. ఈ సమయంలో శ్రీతేజ్‌ను, అతడి కుటుంబాన్ని కలవలేకపోతున్నాను. త్వరలోనే వారి కుటుంబాన్ని కలిసి మాట్లాడతాను. వైద్యపరంగా, కుటుంబ పరంగా వారిని ఆదుకుంటానని ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నాను' అని అల్లు అర్జున్ ట్వీట్ చేశారు. కాగా, సంధ్య థియేటర్ ఘటనలో అల్లు అర్జున్‌ను ఈనెల 13న చిక్కడపల్లి పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. అనంతరం శనివారం ఉదయం బెయిల్‌పై ఆయన్ని విడుదల చేశారు.

## సీమ బ్యాక్‌డ్రాప్‌తో నిఖిల్ కొత్త సినిమా

కెరీర్‌లో సరైన బ్రేక్ ఎదురుచూస్తున్న యాక్టర్లలో ఒకరు అక్కినేని అఖిల్. గతేడాది సురేందర్ రెడ్డి దర్శకత్వంలో నటించిన ఏజెంట్ బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టింది. ఇప్పటివరకు నటించిన బ్యాక్ టు బ్యాక్ సినిమాలు ఆశించిన స్థాయిలో ప్రేక్షకులను ఇంప్రెస్ చేయకపోవడంతో.. అఖిల్ నెక్ట్స్ ఏ సినిమా ప్రకటిస్తాడా.. ? అని ఎదురుచూస్తున్న వారి కోసం కొత్త అప్‌డేట్ తెరపైకి వచ్చింది. అఖిల్ కొత్త ప్రాజెక్ట్ రాయలసీమ బ్యాక్ డ్రాప్‌లో సాగే ప్రేమ కథని తెలుస్తోంది. మురళీ కిశోర్ అబ్బూరు దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీ లాంచ్ కూడా పూర్తయినట్టు వార్తలు వస్తుండగా.. మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఈ చిత్రానికి ఎస్ థమన్ సంగీతం అందించనున్నాడు. అంతేకాదు ఈ మూవీలో డ్యాన్సింగ్ క్వీన్ శ్రీలీల అఖిల్‌కు జోడీగా కనిపించబోతుందని.. హొంబ్యానర్లపై నాగార్జున, నాగవంశీ సంయుక్తంగా తెరకెక్కించనున్నారని ఇన్ సైడ్ టాక్. మురళీ కిశోర్ అబ్బూరు వినరో భాగ్యము విష్ణు కథ చిత్రాన్ని తెరకెక్కించాడు. మరి ఈ డైరెక్టర్ అఖిల్‌కు మంచి బ్రేక్ ఇస్తాడా..? అన్నది తెలియాల్సి ఉంది. అఖిల్ నిశ్చితార్థం జైనబ్ రవ్జీతో నవంబర్ 26న ఘనంగా జరిగింది. వీరి వెడ్డింగ్ వివరాలపై క్లారిటీ రావాల్సి ఉంది.




## కామెడియన్‌ను ఏకీపారేస్తున్న నెటిజన్లు

తమిళ దర్శకుడు అట్లీపై బాలీవుడ్ స్టార్ కామెడియన్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం వివాదాస్పదంగా మారాయి. తమిళ దర్శకుడు అట్లీ గురించి ప్రత్యేక పరిచయం



అవసరం లేదు. రాజా రాణి సినిమాతో హిట్ అందుకొని తేరి, మెర్సల్ సినిమాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు. రీసెంట్ బాలీవుడ్ బాద్‌షా షారుఖ్ ఖాన్‌తో జవాన్‌తో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్నాడు. అయితే ఆయన నిర్మాణంలో వస్తున్న తాజా చిత్రం బేబి జాన్. విజయ్ తేరి సినిమాకు రీమేక్‌గా వస్తున్న ఈ సినిమాలో వరుణ్ ధావన్ కథానాయకుడిగా నటిస్తుండగా.. కీర్తి సురేష్, వామిక గబ్బి హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ చిత్రం డిసెంబర్ 20న ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా.. కపిల్ శర్మ కామెడీ షోకి హాజరైన ఈ చిత్రబృందానికి ఒక చేదు అనుభవం ఎదురైంది. ఈ షోలో భాగంగా.. కపిల్ శర్మ అట్లీని అడుగుతూ.. "మీరు కథ చెప్పడానికి ఏ స్టార్ హీరో దగ్గరికైన వెళ్లినప్పుడు వాళ్లు అట్లీ ఎక్కడున్నారు అని అడిగారా" అంటూ కపిల్ ప్రశ్నించాడు. అయితే కపిల్ మాటల్లోని ఉద్దేశం అర్థం చేసుకున్న అట్లీ తనదైన శైలీలో గట్టిగా సమాధానమిచ్చాడు. "ఇలాంటి ప్రశ్న నన్ను ఎందుకు అడుగుతున్నారో నాకు అర్థమైంది. ఈ ప్రశ్నకు నా ఆన్సర్ ఒక్కటే. మనకు టాలెంట్ ఉన్నప్పుడు మనం ఎలా ఉన్నాము అనేది పెద్ద విషయం కాదు. నేను ఈ విషయంలో ముందుగా దర్శకుడు ఏఆర్ మురుగదాస్‌కి ధన్యవాదాలు చెప్పాలి. నా దర్శకత్వంలో వచ్చిన రాజా రాణి సినిమాను నిర్మించింది ఆయనే. అతడు నన్ను నమ్మాడు కాబట్టే ఇలా ఉన్నాను. అయితే రాజా రాణి కథతో మురుగదాస్ దగ్గరికి వెళ్లినప్పుడు అతడు నా కథను మాత్రమే చూశాడు తప్ప నా లుక్ ఎలా ఉంది అనేది చూడలేదు. కాబట్టి.. ప్రపంచం కూడా మన పనినే చూడాలి తప్ప.. మన లుక్‌ని బట్టి మనల్ని అంచనా వేయకూడదు". అంటూ అట్లీ చెప్పుకోచ్చాడు. అయితే కపిల్ శర్మ అట్లీ లుక్స్‌పై కామెంట్ చేయడంతో అతడి తీరుపై నెటిజన్లు దుమ్మెత్తిపోస్తున్నారు. కాగా ఈ వీడియోను మీరు కూడా చూసేయండి.

## అగ్రనటుడు ప్రభాస్‌కు షూటింగ్‌లో గాయం



అగ్ర కథానాయకుడు ప్రభాస్ తృటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. ఓ సినిమా షూటింగ్‌లో భాగంగా.. ఆయన గాయపడినట్లు సమాచారం. ప్రస్తుతం ఆయన విశ్రాంతి తీసుకుంటున్నట్లు తెలుస్తుంది. అయితే ఈ విషయాన్ని ప్రభాస్ సోషల్ మీడియా వేదికగా వెల్లడించాడు. ఆయన ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'కల్కి 2898 ఏడీ'. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం సూపర్ హిట్‌గా నిలవడమే కాకుండా రూ.1100 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. అయితే ఈ సినిమాను వచ్చే ఏడాది జపాన్‌లో విడుదల చేస్తున్నారు మేకర్స్. జనవరి 3న జపాన్‌లో విడుదల కానుంది. ఈ సందర్భంగా జపాన్‌లో ప్రమోషన్స్‌లో పాల్గొనాల్సి ఉంది ప్రభాస్. అయితే తాను ఈ వేడుకకు రాలేకపోతున్నానని ప్రభాస్ వెల్లడించారు. మీరు నాపై చూపిస్తున్న ప్రేమకు, అభిమానాలకు ధన్యవాదాలు. జపాన్‌లోని అభిమానులని కలవాలని ఎప్పటినుంచో అనుకుంటున్నా. కానీ మూవీ షూటింగ్‌లో నా కాలుకు గాయమైంది. దీంతో ఈ జపాన్‌కు రాలేకపోతున్న.. ఈ విషయంలో నన్ను క్షమించండి అంటూ ప్రభాస్ రాసుకోచ్చాడు.

## పవర్‌ఫుల్ రోల్‌లో మోహన్‌లాల్

ఒకవైపు ఫ్యామిలీ గొడవలతో సతమవుతున్న మంచు ఫ్యామిలీ.. మరోవైపు తమ కలల ప్రాజెక్ట్ కన్నప్పను పూర్తి చేసే పనిలో పడింది. మంచు కుటుంబం నుంచి వస్తున్న మోస్ట్ ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్ కన్నప్ప. దాదాపు రూ.100 కోట్ల బడ్జెట్‌తో వస్తున్న ఈ సినిమాను కలెక్షన్ కింగ్ మంచు మోహన్ బాబు నిర్మిస్తుండగా.. మంచు విష్ణు కథానాయకుడిగా నటిస్తున్నాడు. హిస్టారికల్ కం మైథాలజీ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ చిత్రంలో ప్రభాస్‌తో పాటు బాలీవుడ్, కోలీవుడ్ అగ్ర తారలు నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రానికి మహాభారతం సీరియల్ ఫేమ్ ముఖేష్‌కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే ఈ మూవీ నుంచి మంచు మోహన్ బాబు, మంచు విష్ణులతో పాటు ప్రముఖుల ఫస్ట్ లుక్‌లను పంచుకున్న చిత్రబృందం తాజాగా మళయాలం స్టార్ నటుడు మోహన్ లాల్ ఫస్ట్ లుక్‌ను విడుదల చేసింది. ఈ సినిమాలో లాలెట్టన్ (మోహన్ లాల్) కిరాట అనే పవర్‌ఫుల్ రోల్‌లో కనిపించబోతున్నట్లు చిత్రబృందం తెలిపింది.



Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at **SRI SHANTHI PUBLICCATIONS** H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. **EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609.** Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com